


# పాతాళదుర్గం

కుంతలదేశపు మంత్రి కొడుకైన శశికాంతుడనేవా డొకనాడు, భద్రుడూ, జయంతుడనే మిత్రు లిద్దరిని వెంటబెట్టుకుని, వేటకై అరణ్యానికి వెళ్ళాడు. అరణ్యంలో లేళ్ళూ, దుప్పులూ, అడవిపందులూ సమృద్ధిగా వున్నవి. కాని, శశికాంతుడూ, అతడి మిత్రులూ వాటిని వేటాడక, ఎక్కడైనా సింహం కనబడుతుందేమో అని వెతుక్కుంటూ అరణ్యంలో చాలా దూరం వెళ్ళారు. మిట్టమధ్యాహ్నం వేళకు వాళ్ళ శ్రమ ఫలించింది. వాళ్ళొక కొండవాగు వెంట వెళుతూండగా, వాగు అవతలి ఒడ్డున సింహం ఒకటి నిలబడి ఉండటం శశికాంతుడి కంటబడింది. సింహం అప్పుడే వాగులో నీరు తాగి, తిరిగి అరణ్యంలో ప్రవేశించేందుకు బయలుదేరింది.

శశికాంతు డా సింహాన్ని తన మిత్రులకు చూపుతూ, "మనం గుర్రాలను ఇక్కడే వదిలి నిశ్శబ్దంగా వాగు దాటి, సింహాన్ని అన్ని వైపుల నుంచీ చుట్టుముట్టుదాం. మన బాణాల్లో ఏదో ఒకదానికి అది గురి కాక పోదు," అన్నాడు.

గుర్రం దిగి వాగు కేసి బయలుదేరిన శశికాంతుణ్ణి, జయంతుడు భుజం పట్టుకుని ఆపి, "శశికాంతా, తొందరపడకు. ఆ వాగు అవతల వున్న అరణ్యభాగం కదంబరాజ్యం లోనిది. ఆ రాజుకూ మనకూ మధ్య వచ్చి గడ్డి వేస్తే భగ్గు మంటున్నది కదా! మనం



వాళ్ళ రాజ్యసరిహద్దులు దాటటం ప్రమాద కారణం కావచ్చు," అన్నాడు.

వేట తమకంలో వున్న శశికాంతుడు తన మిత్రుడి సలహా విని, అవహేళనగా నవ్వి, "నే ననలే పిరికివాణ్ణి, మరీ అంతగా పిరికి మందు పోయకు! మనం, కదంబరాజ్యాన్ని జయించేందుకు జైత్రయాత్ర మీద ఆ రాజ్యంలో ప్రవేశించటం లేదు, క్రూర మృగాన్ని వేటాడేందుకు పోతున్నాం. ఆ పని ముగియగానే, తిరిగి మన రాజ్యం ప్రవేశిస్తాం," అన్నాడు.

"శశికాంతా, బాగా చెప్పావు. సింహం మనపాల బడితే, మాంసాన్ని కదంబ రాజుకూ, చర్మాన్ని ఆయన ఏకైక పుత్రిక కాంతిసేనకూ బహుమానంగా పంపుదాం," అన్నాడు భద్రుడు.

ఈ మాటలకు శశికాంతుడు పెద్దగా నవ్వాడు. సింహం తల తిప్పి, తన కేసి వస్తున్న వేటగాళ్ళను చూస్తూనే, మెల్లగా గర్జించి తోక ఆడిస్తూ ముందుకు రెండడుగులు వేసింది. అదే సమయంలో శశికాంతుడు సింహం కంఠానికి బాణం గురిచేసి వదిలాడు. బాణం రివ్వుమంటూ పోయి సింహాన్ని తాకింది. ఆ దెబ్బ తింటూనే సింహం మహోధృతంగా గర్జిస్తూ వాగు కేసి ఛెంగున దూకింది.


శశికాంతుడూ అతడి మిత్రులూ చప్పున విడిపోయి, మోకాళ్ళ లోతున వున్న వాగును తృటికాలంలో దాటి, సింహం మీద మూడు వైపుల నుంచీ బాణాలు వదిలారు. ఈ సారి బాణాల్లో ఒకటి సింహం డొక్కలో బలంగా నాటుకున్నది. అది గర్జిస్తూ తన మీదికి వస్తున్న ముగ్గురి లోనూ అందుబాటులో వున్న శశికాంతుడి మీదికి కుప్పించి దూకింది. శశికాంతుడు ఇక విల్లంబులతో పని కాదని కత్తి దూశాడు. అంతలో చెట్ల చాటున కలకలం బయలుదేరింది. మరుక్షణం ఒక ఈటె దూసు

కుంటూ వచ్చి, సింహం తలను బలంగా తాకింది. శశికాంతుడూ, అతడి మిత్రులూ కలకలం వచ్చిన వైపుకు చూసేంతలో, "సరిహద్దులు దాటిన శత్రువులను చంపండి!" అన్న కేకా, ఆ వెంటనే రివ్వురివ్వు మంటూ బాణాలూ వచ్చి వారి మీద పడినై.

శశికాంతుడు బాగా గాయపడి నేల కొరుగుతూ, "భద్రా, జయంతా, మీరు త్వరగా పారిపొండి. పొంచివుండి కపట యుద్ధం చేసే శత్రువులతో పోరి లాభం లేదు," అంటూ కేక పెట్టాడు.

ఆ సరికే జయంతుడు ఆయువు పట్టున బాణం దెబ్బ తిని కింద పడిపోయాడు. భద్రుడు పారిపోయేందుకు వెనుదిరిగేంతలో అతడి వీపున ఒక శత్రుబాణం వచ్చి తగిలింది. కాని, అతడా బాధను లెక్కచేయకుండా, అతి వేగంగా పరిగెత్తి, వాగు దాటి చెట్ల కింద వున్న గుర్రాలను చేరుకుని, అతి కష్టం మీద గుర్రం ఎక్కాడు. గుర్రం వెనుదిరిగి పరిగెత్త సాగింది. దానితో బాటు మిగిలిన రెండు గుర్రాలూ బయలుదేరినై. వాగు వైపు నుంచి కొందరు శత్రుసైనికులు పరిగెత్తుకుంటూ వచ్చి, భద్రుడి కేసి బాణాలు వదలసాగారు. "వాణ్ణి ప్రాణాలతో పోనీకండి. ఇక్కడ గాయపడి ప్రాణాలు విడుస్తున్నవాడు కుంతలదేశ





మంత్రి కొడుకులా వున్నాడు," అంటూ వాళ్ళకు వెనక నుంచి హెచ్చరికలు వినబడుతున్నవి.

భద్రుడు యివేమీ వినే స్థితిలో లేడు. అతను గుర్రం జూలు పట్టుకుని, దాని మెడమీదికి ఒరిగిపోయాడు. తనకు తెలిసిన దారి గనక గుర్రం, అతణ్ణి సూటిగా రాజధానీ నగరం కేసి తీసుకుపో సాగింది.

అక్కడ కొండవాగు వద్ద గాయపడిన శశికాంత జయంతుల చుట్టూ చాలామంది ఆయుధపాణులు చేరారు. సింహం అప్పటికే ప్రాణాలు విడిచింది. భద్రుణ్ణి చంపజూచిన శత్రుసైనికులు అరణ్యంలో కొంత దూరం గుర్రం వెనకగా పరిగెత్తి, అది కనబడకుండా పోవటంతో, తిరిగివచ్చారు. వాళ్ళకు కళ్ళెపు తాడు చెట్టు మోదుకు తగులుకు పోవటం వల్ల పారిపో లేకపోయిన శశికాంతుడి గుర్రం మాత్రం దొరికింది.

"మహారాజా! క్షమించండి. ఆ గాయపడిన శత్రువుతో గుర్రాలు రెండూ మహారణ్యంలో కనబడకుండా పోయినై. ఎంతో శ్రమపడి దీన్ని పట్టుకో గలిగాం. ఇది పంచకళ్యాణిలా వున్నది. విలువైన జీనూ అవీ చూస్తుంటే, యిది కుంతల దేశపు మంత్రి కొడుకుదని మా కనుమానం కలుగుతున్నది," అన్నారు సైనికులు, గుర్రాన్ని తమ ఏలిక ముందుకు నడిపించుకు పోయి.

కదంబరాజు ఉగ్రసేనుడు నిప్పులు చెరిగే కళ్ళతో ఆ సైనికుల నోక క్షణం చూసి, పక్కన చేతులు కట్టుకు నిలబడి వున్న సేనానాయకుడి కేసి తలతిప్పి, "సేనానీ, గాయపడిన శత్రువును కూడా చేజిక్కించుకోలేని అర్భకు లన్నమాట, మన సైనికులు! వీళ్ళ ధైర్యసాహసాలను నమ్ముకునేనా, మనం కుంతలరాజుతో వైరం పెట్టుకున్నది?" అన్నాడు ఈసడింపుగా.

సేనానాయకుడు ఏదో చెప్పబోయి, రాజు ముఖం మీది ఉగ్రత్వం చూసి,




"మహారాజా!" అంటూ వీళ్ళు నమల సాగాడు. ఉగ్రసేనుడు శశికాంతుణ్ణి సమీపించి, నిశ్చలంగా పడివున్న అతణ్ణి ఎడమ కాలితో అటూ యిటూ కదిలించి చూసి, "వీడు మంత్రికొడుకే, అనుమానం లేదు. ఇంకొంచం ప్రాణం వున్నట్టు కనబడుతున్నది. వీణ్ణి ఎత్తుకుపోయి, ఆ కొండగుహల్లో ఎక్కడనైనా పారవేసి రండి, ఆయువు అజా దొరక్కుండా ఏ సింహమో తిని జీర్ణించుకుంటుంది. సరే, ఆ రెండోవాడి మాటేమిటి?" అన్నాడు.

ఇద్దరు సైనికులు జయంతుణ్ణి కదిలించి చూసి, "వీడి ప్రాణం ఎప్పుడో గాల్లో కలిసింది మహారాజా!" అన్నారు.

"అయితే, వాణ్ణీ ఆ కొండగుహ లోనే పారవెయ్యండి," అంటూ ఉగ్రసేనుడు సేనాని కేసి తిరిగి, "సేనానీ! ఇవ్వాళ మనం వేటకు బయలుదేరిన వేళ మంచిది కాదు. నేను బాణం గురిచూసి వదిలే టప్పుడు వీళ్ళు మామూలు కుంతలరాజ్య సైనికు లనుకున్నాను తప్ప, సాక్షాత్తూ ఆ దేశపు మంత్రికొడుకూ, వాడి స్నేహితులూ అయి ఉంటారని అనుమానించ లేదు. ఆ రాజు మనకన్న ఎన్నో రెట్లు బలవంతుడు, మంత్రి బుద్ధిచాతుర్యం మనం ఎరిగినదే! మనం నగరానికి వెంటనే తిరిగి వెళ్ళి, మన సరిహద్దు సైనికుల వల్ల పొరపాటు జరిగిపోయిందని కుంతలరాజు నమ్మే విధంగా, ఏదైనా మంచి పథకం ఆలోచించాలి," అన్నాడు.

"అవును మహారాజా, అవును. అందుకు మన మహామంత్రులు సర్వసమర్థులు," అన్నాడు సేనానాయకుడు.

ఉగ్రసేనుడు మారు మాటాడకుండా గుర్రాన్నెక్కి బయలుదేరాడు. అతడికి వెనకగా సేనాని కదిలాడు. సైనికుల్లో ఒక పదిమంది వెనక నిలబడిపోయి శశికాంతుణ్ణీ, జయంతుణ్ణీ చాపచుట్టల లాగా భుజాల



మీద వేసుకుని పరిహాసంగా, "ఓహోం, ఓహోం బీ," అంటూ కొండగుహల కేసి పరిగెత్తారు.

గాయపడిన భద్రుణ్ణి మోసుకుంటూ బయలుదేరిన గుర్రం, నగర ద్వారాలు మూసే వేళకు అక్కడికి చేరింది. మంత్రి కుమారుడి కోసం ఎదురు చూస్తున్న ద్వార రక్షకులు, అతడి మిత్రుడైన భద్రుణ్ణి ఆ స్థితిలో చూసి, గాభరా పడిపోయారు. భద్రుడు బతికి వున్నాడో లేదో కూడా పరీక్షించి చూసేందుకు వాళ్ళు భయపడ్డారు. జయంతు డెక్కి వెళ్ళిన గుర్రం భద్రుడి గుర్రం వెంట వున్నది.

ద్వారరక్షకులు భద్రు డున్న గుర్రం వెంట కాగడాలు తీసుకుని రాజనగరు కేసి బయలుదేరారు. వెన్నులో బాణం గుచ్చుకుని వున్న మనిషిని రాజవీధి వెంట మోసుకుపోయే గుర్రాన్నీ, దాని వెనకగా కాగడాలు పట్టి నడుస్తున్న భటులనూ చూసి, యీ వింత ఏమిటా అని పౌరులు గుంపులు గుంపులుగా పోగయారు.

గుర్రం నేరుగా రాజప్రాసాద ఆవరణ ప్రవేశించి, గుర్రపుసాల వద్దకు వెళ్ళి నిలబడింది. ఈ లోపుగా, వార్త తెలియటంతో, రాజు శతభానుడూ, మంత్రి గంగాధరుడూ అక్కడికి వచ్చారు. భద్రుణ్ణి నౌకర్లు జాగ్రత్తగా గుర్రం మీంచి దింపారు. ఆస్థాన వైద్యుడు అతన్ని పరీక్షించి చూసి, వీపులో గుచ్చుకుని వున్న బాణాన్ని నేర్పుగా లాగాడు. ఆ సమయంలో భద్రుడిలో కొంచెం చలనం కనిపించింది. వైద్యుడు అతడి నాడి పరీక్షించి, "మహారాజా! నా శక్తి కొలదీ ప్రయత్నిస్తాను. దైవసహాయం కూడా వుంటే, భద్రుడు జీవించే అవకాశం వున్నది," అన్నాడు.

భద్రుణ్ణి ఒక మంచం మీద పడుకోబెట్టి నౌకర్లు అతణ్ణి భవనం లోకి తీసుకుపోయారు. అంతవరకూ భద్రుడికి తగిలిన



బాణాన్ని పరీక్షించి చూస్తున్న మంత్రి, సేవకుల్లోకళ్లి పిలిచి, బాణాన్ని అతని చేతి కిస్తూ, "దీన్ని బాగా కడిగి శుభ్రపరిచి తీసుకురా," అని అజ్ఞాపించాడు.

"శశికాంతుడూ, జయంతుడూ ఏమైనట్టు? మహామంత్రీ, మన రాజ్యం లోనే మనకు ఇంత ప్రబలులైన శత్రువు లున్నారని, నే నెన్నడూ అనుమానించలేదు," అన్నాడు రాజు శతభానుడు.

"మహారాజా! ఈ దురాగతం మన రాజ్యంలో జరిగింది కాదని నాకు తోస్తున్నది. భద్రుడు బతికి బయట పడితే, అరణ్యంలో జరిగిం దేమిటో మనకు పూర్తిగా తెలిసిపోతుంది. శశికాంతుడూ, జయంతుడూ తిరిగి వస్తారన్న నమ్మకం నాకు కలగటం లేదు. భద్రుణ్ణి గాయపరిచిన బాణం మీద ముద్రితమైన చిహ్నాలు చూస్తాంటే......" అంటూ మంత్రి గంగాధరుడు ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకున్నాడు. శతభానుడి మనస్సు కలవరపడింది. మంత్రికి శశికాంతుడు ఏకైక పుత్రుడు. ఓదార్పు మాటలు ఎన్ని చెప్పి మాత్రం ప్రయోజన మేమిటి?

మంత్రి ఇచ్చిన బాణాన్ని రక్తం లేకుండా శుభ్రంగా కడిగి, గుడ్డతో తుడిచి, సేవకుడు దాన్ని తెచ్చి ఆయన కిచ్చాడు. గంగాధరుడు బాణాన్ని ఒక కాగడా వెలుగులో బాగా పరీక్షించి చూసి, నివ్వెరపోతూ, దాన్ని శతభానుడి కిచ్చి, "మహారాజా! ఆ బాణం విడిచినవాడు కదంబరాజు ఉగ్రసేనుడు. దాని అలుగు మీద అతడి రాజచిహ్నమైన ఎలుగుబంటి తల ఉన్నది," అన్నాడు.

శతభానుడు బాణాన్ని పరీక్షించి చూసి, "మహామంత్రీ! దీని అర్థం ఏమిటి? ఉగ్రసేనుడు యుద్ధప్రకటన లేకుండానే మన మీదికి దండెత్తి వస్తున్నాడా? మన వేగులవాళ్ళు ఏం చేస్తున్నారు? సరిహద్దు కాపలావాళ్ళ మాటేమిటి?" అన్నాడు కోపంగా.

"మహారాజా, ఉగ్రసేనుడికి మన మీద బహిరంగంగా దండయాత్ర చేసే శక్తి సామర్థ్యాలు లేవు. అయినా మన జాగ్రత్తలో మనం ఉండటం మంచిది. సేనానికి చెప్పి, సైనిక సమీకరణా, రక్షణ ఏర్పాట్లూ చేయించండి," అన్నాడు గంగాధరుడు.

శతభానుడు సేవకుల్లొకణ్ణి పిలిచి, సేనానాయకుణ్ణి పిలుచుకు రమ్మని ఆజ్ఞాపించి, భవనం కేసి బయలుదేరేంతలో, సైనికు డొకడు రొప్పుతూ రొస్తూ రాజు దగ్గిరికి వచ్చి, "మహారాజా! కదంబరాజు పంపగా వచ్చిన దూతలు నగరద్వారాల వద్ద వున్నారు. వాళ్ళను మీ దగ్గిరకు తెమ్మని సెలవా?" అని అడిగాడు.

"ఉగ్రసేనుడు మన వద్దకు దూతలను పంపటమా?" అంటూ శతభానుడు ఆశ్చర్యపోయాడు.


"దూత లెంతమంది? దర్పంగా కనిపిస్తున్నారా?" అని ప్రశ్నించాడు గంగాధరుడు.

"అలాంటి దేమీ లేదు, ప్రభూ. వచ్చిన వాళ్ళంతా కలిసి ఆరుగురు. వాళ్ళల్లో ఇద్దరు పెడరెక్కలు విరిచి కట్టబడి వున్నారు. అందరూ ప్రాణాలరచేత పెట్టుకుని వున్న వాళ్ళలా కనిపిస్తున్నారు," అన్నాడు సైనికుడు.

"దీని వెనక ఏదైనా కుటిల రాజనీతి లేదు గదా, మహామంత్రీ? అరణ్యంలో ఏదో ఘోరం జరిగిపోయినట్టు నా కనుమానం కలుగుతున్నది," అన్నాడు శతభానుడు తల పంకిస్తూ.

"ఉగ్రసేనుడు అందులో సమర్థుడే. ఏమైనా, ఈ దూతల ద్వారా అతడు పంపిన రాయబార మేమిటో తెలుసుకోవటం అవసరం గదా. దూతల వెంట పెడరెక్కలు విరిచి కట్టబడిన బందీ లేమిటి?" అంటూ గంగాధరుడు కొంచెం ఆగి సైనికుడితో, "వాళ్ళను సభామందిరానికి తీసుకురా," అని ఆజ్ఞాపించాడు. —(ఇంకావుంది)





# పాతాళదుర్గం

## 2

[కుంతలదేశ మంత్రికొడుకైన శశికాంతు డనేవాడు, ఇద్దరు మిత్రులతో వేటకై అరణ్యానికి వెళ్ళి, శత్రుబాణం వల్ల గాయపడ్డాడు. భద్రు డనేవాడు పారిపోయి, రాజధానీనగరం చేరాడు. కుంతలరాజూ, మంత్రీ అరణ్యంలో ఏం జరిగివుంటుందా అని చర్చిస్తూండగా, సైనికుడొకడు వచ్చి కదంబరాజు దూతలను పంపినట్టు వాళ్ళకు చెప్పాడు. తరవాత—]

కదంబ రాజైన ఉగ్రసేనుడి దూతలు నలుగురు, ఇద్దరు ఖైదీలతో సభామందిరానికి వచ్చారు. శతభానుడు సింహాసనం మీద ఆసీనుడయివున్నాడు. గంగాధరుడు దూతల వెంట వున్న ఖైదీల చేతికట్లు విప్పవలసిందిగా సేవకులను ఆజ్ఞాపించాడు.

రాజసేవకులు ఖైదీల కట్లు విప్పబోయేంతలో ఉగ్రసేనుడి దూతల్లో ఒకడు ముందుకు వచ్చి, గంగాధరుడికి తల వంచి నమస్కరిస్తూ, "మహామంత్రులు నన్ను క్షమించాలి. వీళ్ళిద్దరూ పరమ క్రూరులు, అతి సాహసులు," అంటూ ఖైదీలను సమీపించి, తన చేతికర్రతో ఒకణ్ణి పొడుస్తూ, "వీడు ధూమకుడు, పితృహంతకుడు, యీ రెండవవాడు సోమకుడు, భ్రాతృహంతకుడు," అన్నాడు.

"ఈ హంతకుల్ని మా వద్దకు పంపడంలో, మీ మహారాజుగారి అభిప్రాయ



మేమిటి?" అని ప్రశ్నించారు మంత్రి గంగాధరుడు.

ఆ ప్రశ్న వింటూనే తతిమ్మా ముగ్గురు దూతలూ ముందుకు వచ్చారు. అందరూ ఒకేసారి మాట్లాడబోయిన వాళ్ళల్లా, మొదటి దూత సౌంజ్ఞ చేయగానే ఆగిపోయారు. అప్పుడు మొదట మాట్లాడిన దూత, శత భానుడి కేసి తల ఎత్తి చూసి, తరవాత మంత్రికీ, రాజుకూ వినబడేంత పెద్ద గొంతుతో, "మహారాజులా, మహామాత్యు లకు, మా ప్రభువులు ఉగ్రసేన మహా రాజులుంగారు గౌరవపూర్వకంగా నమ స్కారాలు చేసి, దుఃఖకరమైన వార్త ఒకటి యిలా విన్నవిస్తున్నారు: కదంబరాజ్యంలో ఏ కారణం వల్లనో ప్రవేశించిన కుంతలదేశ మహామంత్రుల పుత్రుడూ, వారి అనుచరు లిద్దరూ, ఖైదు నుంచి పారిపోయిన ధూమ కుడూ, సోమకుడూ అనే హంతకుల వల్ల గొప్ప యిక్కట్ల పాలయ్యారు. ఆ ముగ్గుర్నీ యీ హంతకులు చంపి, వారి నగలూ గుర్రాలూ దొంగలించ బోయేంతలో, ఒక సింహాలమంద అక్కడికి వచ్చి పడింది. ఈ హంతకులు ఆ ప్రదేశం నుంచి పారి పోతూ కావలాసైనికులకు దొరికారు. మహా మంత్రుల పుత్ర మిత్రుల శవాల కోసం, సైనికులు కొండప్రాంత మంతా గాలిస్తు న్నారు. దొరికితే, ఆ సంగతి వెంటనే తెలియ బరచ బడుతుంది," అని చెప్పారు.

"మీ మహారాజుగారు యిదంతా నోటి మాటగా చెప్పమన్నారా? లిఖిత పత్రం ఏమీ లేదా?" అన్నారు గంగాధరుడు.

"మహారాజుగారు యీ దారుణ విషయం రాయ ప్రయత్నించారు గాని, వారికి చేయి ఆడలేదు. ఆ కారణంగా, వారు రాయ దలచుకున్న విషయం నాకు చెప్పి తమకు తెలియ బరచమన్నారు," అన్నాడు దూత.

అంతవరకూ కదంబరాజు దూత చెపు తున్నదంతా శ్రద్ధగా ఆలకించిన శతభానుడు



సింహాసనం మీది నుంచి లేస్తూ, "సరే, యిక మీరు వెళ్ళిపోవచ్చు. ఈ హంతకుల్ని విచారించి తగినశిక్ష మేమే విధిస్తాం," అన్నాడు.

ఆ మాటలు వింటూనే ఉగ్రసేనుడి దూతలు కలవరపడిపోయి, ఒకళ్ళ ముఖాల కేసి ఒకరు చూసుకున్నారు. ఈసారి దూతల్లో మరొకడు ముందుకు వచ్చి, "మహారాజా! క్షమించాలి. పితృ భ్రాతృ హంతకులైన వీళ్ళిద్దరికీ లోగడే యావజ్జీవ కారాగార శిక్ష విధించబడింది. వీళ్ళు ఖైదు నుంచి పారిపోయి, తిరిగి యీ కొత్త హత్యలకు ఒడిగట్టారు. మా మహారాజుగారి ఆజ్ఞ ఏమిటంటే, యీ హంతకు లిద్దర్నీ, కదంబ కుంతలదేశాల సరిహద్దు మీదవున్న మహా వృక్షానికి దేనికైనా వేలాడకట్టి ఉరిదీయమని. ఆ కార్యం మేము తిరిగివెళ్ళేటప్పుడు పూర్తిచేస్తాం, యిక సెలవు!" అన్నారు.

ఉగ్రసేనుడి దూతలు నలుగురూ, ఖైదీ లిద్దర్నీ సమీపించి, వాళ్ళను చేతి కర్రలతో పొడిచి వెనక్కు తిప్పబోయారు. ఖైదీల్లో ధూమకుడనేవాడు రోషంగా కళ్ళెర్ర చేసి, "ఛీ, దుర్మార్గుల్లారా!" అంటూ యీసడించాడు. సోమకుడు కర్రదెబ్బ తిని ఉలకలేదు, పలకలేదు. అతడి ముఖం మీద ఎలాంటి బాధా ప్రస్ఫుటంకాలేదు. దూతల్లో ఒకడు వాళ్ళిద్దరికీ చేరువగా వెళ్ళి, "జాగ్రత్త! మీ పెళ్ళాంబిడ్డల మాట మరిచి పోకండి!" అన్నాడు పళ్ళు కొరుకుతూ.

దూతలు ఖైదీలతో సభామందిరం నుంచి బయిటికి వెళ్ళిపోయారు. రాజు శతభానుడు వాళ్ళు పోయిన ద్వారం కేసి సాలోచనగా చూస్తూ, "అమాత్యా! హంతకుడు ఉగ్రసేనుడే నన్న అనుమానం నాకు దృఢపడుతున్నది. ఏమిటీ, అతడి యీ కపట నాటకమంతా!" అన్నాడు.

" ఈ కపట నాటకం చాటున, మహా భయంకరమైన కుట్ర ఏదో వున్నదన్న అనుమానం నాకు కలుగుతున్నది, మహారాజా!



అంతే కాదు, శశికాంతుడు సజీవుడే అని కూడా నేను భావిస్తున్నాను," అన్నాడు మంత్రి గంగాధరుడు.


"శశికాంతుడు క్షేమంగా తిరిగి రావాలని నేను కోరుకుంటున్నాను. ఉగ్రసేనుడికి, మన భద్రుడు గాయపడి నగరం చేరినట్టు తెలియదులావుంది. అతడి దూతల మాటల వల్ల మనవాళ్ళు ముగ్గురూ అరణ్యంలో మరణించారని వాళ్ళు అభిప్రాయపడుతున్నట్టు కనబడుతున్నది," అన్నాడు శతభానుడు.

"అతడి దూతలు మన నగరం చేరక ముందు, అందరూ అలాగే అనుకుని వుంటారు. అప్పుడు నగరప్రజలు చెప్పుకునే మాటల వల్ల, భద్రుడు యిక్కడికి చేరినట్టు దూతలు గ్రహిస్తారు. వెన్నులో తగిలిన బాణం శస్త్రం చేసి బయిటికి లాగగానే, అతడు మరణించాడని, పుకారు వేయిస్తాను," అన్నాడు గంగాధరుడు.

"ఇందు వల్ల కలిగే మేలేమిటి?" అన్నాడు శతభానుడు.

"ఈ పుకారు, అతడి దూతల ద్వారా గాని, మరొకవిధంగా గాని ఉగ్రసేనుడికి చేరుతుంది. ఆ విధంగా, అరణ్యంలో జరిగిన వాస్తవం ఏమిటో మనకు తెలిసే అవకాశం లేదని, అతడు ధీమాగావుంటాడు. అది మనకు చాలా మేలు చేకూరుస్తుంది, మహారాజా! ఈ హంతకులనబడే ఖైదీలిద్దరి సంగతి తెలుసుకోవాలి. అదంతా నేను చూస్తాను. అప్పటికే చాలా పొద్దు పోయింది, తమరు శయనాగారానికి వెళ్ళండి," అంటూ మంత్రి గంగాధరుడు రాజుకు నమస్కరించి, సభామందిరాన్నుంచి బయిటికి వచ్చి, అక్కడ కాపలావున్న ఒక భటుణ్ణి పిలిచి, వాళ్ళ నాయకుణ్ణి తీసుకు రావలసిందిగా ఆజ్ఞాపించాడు.

ఉగ్రసేనుడి దూతలు రాజప్రాసాదపు ఆవరణ దాటి, నగరంలో ప్రవేశించారు.



రాజవీధిన వున్న ఒక చెట్టు కింద నాలుగు గుర్రాలు కట్టివేయబడి వున్నవి. దూతలు వాటిని అధిరోహించి, ఖైదీలైన ధూమక సోమకుల నడుముకు పొడవాటి తాళ్ళుకట్టి, వాటి కొనలను గుర్రాల జీనులకు బిగించి బయలుదేరారు.

ఆ సరికి రాత్రి బాగా పొద్దుపోయింది. నగరం సద్దు మణిగింది. ఏవో అవసర కార్యాల మీద పోయే ఒకరిద్దరు పౌరులూ, గస్తీభటులూ తప్ప, దూతలకు ఎవరూ దారిలో ఎదురుపడలేదు. వాళ్ళకు భద్రుడు బతికి వున్నాడా, లేక మరణించాడా అన్న సంగతి తెలుసుకోవాలని చాలా ఆదుర్దాగా వున్నది. తాము కదంబరాజు దగ్గిర నుంచి బయలు దేరేటప్పుడు, బాణందెబ్బ తిని గాయపడిన వాడు, అరణ్యంలో ఎక్కడో గుర్రంమీంచి జారి కిందపడి మరణించి వుంటాడని భావించారు. కాని, కుంతల నగరం చేరిన తరవాత నగర పౌరులు మాట్లాడుకునే దాన్ని బట్టి, ఆ గాయపడ్డ వాడు రాజప్రాసాదం చేరాడు. వాడు మాట్లాడే స్థితిలో వుంటే, యదార్థం బయట పడిపోతుంది...

దూతలు నగరద్వారం చేరి, అక్కడ కాపలా వాళ్ళకు నగర రక్షకు డిచ్చిన అనుమతి పత్రం చూపి, "పాపం, మంత్రి కుమారుడి స్నేహితు డొకడు గాయపడి నగరం చేరాడట. వెన్నులో గుచ్చుకున్న బాణంతో, అత డింత దూరం గుర్రం మీద రావటం ఆశ్చర్యంగా వుంది!" అన్నారు.

"ఆ గాయపడ్డ యువకుడి పేరు భద్రుడు, ఉక్కు ముక్కలా వుండేవాడు. ఏం లాభం! శస్త్రం చేసి బాణం బయిటికి లాగగానే, ఆ వున్న కాస్త కొనవూపిరీ పోయింది," అన్నారు కాపలాభటులు.

"అయ్యో పాపం!" అంటూ దూతలు లేని బాధ కనబరిచి, నగరద్వారం దాటి అరణ్య మార్గం పట్టారు.



"మన మహారాజూ, మంత్రీ పథకం వేశారంటే దానికి తిరుగుండదు. మంత్రిగారు సామాన్యుడా? నూలుపోగుతో ఏనుగును బంధించగలడు," అన్నా డొక దూత.

"చచ్చిన వాళ్ళు చచ్చారు; పథకాలూ, తంత్రాలూ అల్లేవాళ్ళు అల్లుతున్నారు. వాళ్ళ మాట కేం గాని, మధ్య మనం అదృష్టవంతులం," అన్నాడు మరొక దూత.

"ఏమిటబ్బా, అంత అదృష్టం?" అన్నాడు మొదటి దూత.

"మనం వచ్చిన పని మహ చక్కగా, మహ చాకచక్యంగా నిర్వహించాం. మన వాగ్జాలంతో యీ దేశపు రాజునూ, మంత్రినీ సమ్మోహితుల్ని చేశాం. ఇందుకు మన రాజుగారు మన నెంతగా సత్కరిస్తారో, ఎన్నెన్ని మడిమాన్యాలిస్తారో వూహించుకో," అంటూ దూత పెద్దగా నవ్వాడు.

అతడి నవ్వు ముగిసేలోపల అంతకంటె పెద్దగా వికృతంగా దారిపక్క చెట్ల చాటు నుంచి మరొక నవ్వు వినిపించింది. దూతలు ముగ్గురూ నివ్వెరపోయి, ఆ ధ్వని వచ్చిన వైపుకు చూశారు. అక్కడెవరూ వారికి కనిపించ లేదు, అలికిడైన జాడ కూడా లేదు. గుడ్డి వెన్నెలలో అరణ్యం మహా భయంకరంగా వున్నది. ఏవేవో వింత ధ్వనులు వినిపిస్తున్నాయి.

"మన సంతోషంలో మనం యింత వరకూ పరిసరాలను గమనించ లేదు సుమా! ఈ అరణ్యం దొంగలకూ, దారిదోపిడిగాళ్ళకే గాక, భయంకరమైన పిశాచాలక్కూడా నిలయం అని విన్నాం. ఇక నోళ్ళు మూసుకుని జాగ్రత్తగా గుర్రాలను నడపండి. ధూమక సోమకులు గుర్రాల వెంట వస్తూనే వున్నారా?" అంటూ దూతల్లో ఒకడు వెనక్కు తిరిగి చూశాడు.

ఆ మరుక్షణం దూతల మీద చెట్లకొమ్మల నుంచి కణకణలాడే బొగ్గులు వానజల్లులా కురిసినై. ఆ నిప్పుకణాలు మీద పడగానే

గుర్రాలు బెదిరి పరిగెత్తసాగినై. దూతల్లో ఇద్దరి దుస్తులు విప్పుంటుకుని భగ్గుమన్నవి.

"కొరివిదయ్యాలు! కొరివిదయ్యాలు!". అంటూ దూతలు నలుగురూ ఒక్కసారిగా భీతితో కేకలుపెట్టారు. కళ్ళాలు లాగి, పరిగెత్తే గుర్రాలను ఆపాలనే ప్రయత్నం వాళ్ళేమీ చెయ్యలేదు. అవి పెద్దగా సకిలిస్తూ దారీతెన్నూలేకుండా అరణ్యానికి అడ్డంపడి పరిగెత్తసాగినై. ధూమక సోమకులు పడుతూ లేస్తూ, వాటి వెనక పరిగెత్తసాగారు,

కొద్ది సేపటి తరవాత గుర్రాలు అలిసిపోయి రౌతుల స్వాధీనానికి ,వచ్చినై. దూతల్లో ఒకడు ధూమక సోమకులు తమ వెంటనే వుండటం గమనించి తృప్తిగా నిట్టూర్చి, "మనం ఎంత అదృష్టవంతులం! ఎంత పెద్ద ప్రమాదాన్నుంచి బయటపడ్డాం. కొరివిదయ్యం పట్టునుంచి బయటపడ్డ వాళ్ళి, కాలుదు కూడా ఏమీ చెయ్యలేడని సామెత గదా!" అన్నాడు.

"ఆ సామెతల కేంలే, మనం దారి తప్పాం," అన్నా డొక దూత విసుగ్గా.

"దారి తప్పితే నేం, ప్రాణాలు దక్కినై. ఆ కనబడే కొండ మనరాజ్యంలోదే కదా?" అన్నాడు మరొక దూత.

"అవును, మీ రాజ్యంలోదే! మీరు కదంబర్రాజుగారి దూతలా? మంచిది,



నా వెంట రండి. నేను కుంతలదేశ సరిహద్దు కాపలాసైనికుణ్ణి. కుంతల, కదంబ దేశాల సరిహద్దు మీద వున్నదే, ఆ కనబడే మహావృక్షం! మీరు దానికింద నిలబడి చూస్తే, పోవలసిన దారి సూటిగా కనబడుతుంది," అని చెప్పాడు సైనికుడొకడు.

సైనికుడు ముందుండి దారితీయగా, దూతలు ఎక్కడలేని సంతోషంతో తమ గుర్రాలను వెనకగా నడిపి అతడు చెప్పిన మహావృక్షం కిందికి వెళ్ళారు. అక్కడ మరొక కాపలాసైనికుడు కత్తి చేతబట్టుకుని నిలబడి వున్నాడు.

"అక్కడ తెల్లగా పాములా మెలికలు తిరుగుతూ పోతున్నదేమిటి? కొండవాగా?" అని అడిగాడు ఒక దూత. కాపలా సైనికుడు ఆ ప్రశ్నకు జవాబిచ్చేంతలో, చెట్టుకొమ్మల్లో ఏదో శబ్దం అయింది. దూతలు భయంతో కంపించిపోతూ, తలలు ఎత్తి, "ఏవో కొండచిలువలలా వున్నై!" అంటూ గుర్రాలను అదిలించారు. అంతలో బలమైన రెండు ఉచ్చుతాళ్ళు విసురుగా వచ్చి, దూతల్లో ఇద్దరి కంఠాలకు బిగుసుకున్నై. వాళ్ళెక్కి వున్న గుర్రాలు రెండూ ముందుకు పరిగెత్తినై. కత్తి చేతబట్టుకుని వున్న కాపలా సైనికుడు ధూమక సోమకుల నడుముకు బిగించి వున్న తాళ్ళను ఒక్క వేటుతో నరికివేశాడు.

మిగిలిన ఇద్దరు దూతలూ భీతితో అరుస్తూ, గుర్రాలను అదిలించి కొండవాగుకేసి దౌడుతీశారు. కంఠాలకు ఉచ్చులు బిగుసుకున్న దూతలిద్దరూ ఒక్కసారి కీచుమంటూ అరిచి, కొమ్మలకు వేళ్ళాడసాగారు.

"ఆ పారిపోయే ఇద్దర్నీ వాగు చేరక ముందే పడగొట్టండి!" అన్న కేక వినిపించింది. ఆ వెంటనే చెట్లచాటు నుంచి బయటికి వచ్చిన కుంతలసైనికులు, దూతలకేసి రివ్వురివ్వుమంటూ బాణాలు వదలసాగారు. —(ఇంకావుంది)





# పాతాళదుర్గం


## 3

[కదంబరాజదూతలు నలుగురు, ఇద్దరు ఖైదీలను వెంటబెట్టుకు వచ్చి, కుంతలదేశ రాజుతో, వాళ్ళు అరణ్యంలో మంత్రికుమారుణ్ణి అతని మిత్రులనూ చంపిన వాళ్ళని చెప్పారు. తరవాత దూతలు తమ దేశానికి పోతూండగా కుంతలసైనికులు వాళ్ళల్లో ఇద్దరి మెడలకు ఉరితాళ్ళు తగిలించి, ఖైదీలను విడిపించారు. తరవాత—]

కదంబరాజదూత లిద్దరూ తమ గుర్రాలతో కొండవాగు దాటి, తమ రాజ్యంలో ప్రవేశించారు. కుంతలసైనికులు వదిలిన బాణాలేవీ వారికి తగలలేదు. అర్ధరాత్రి, గుడ్డివెన్నెల, అరణ్యప్రదేశం. ఆ కారణం వల్ల సైనికులు దూతల మీదికి గురిచూసి బాణాలు వదలలేకపోయారు.

"వాగు దాటి ఆ దూతల వెంట పడటంలో ప్రమాదం ఉన్నది. వాళ్ళకు కదంబరాజ్య సరిహద్దు కాపలా వాళ్ళు సహాయంగా రావచ్చు. ఏమైనా ఆ ఇద్దర్నీ ప్రాణాలతో పోనివ్వకూడదు. మీలో ఎవరు శత్రు రాజ్యంలో జొరబడి, వాళ్ళను వేటాడగలరో చెప్పండి. వాళ్ళను చంపిన వాళ్ళకు మంత్రిగారు పెద్ద బహుమానం యిస్తారు," అన్నాడు కుంతలసైనికుల నాయకుడు.

ఆ మాట వింటూనే ధూమకుడు ముందుకు వచ్చి, "అయ్యా, నేనూ,



సోమకుడూ ఆ పని చేయగలం. మాకు బహుమానా లేవీ అవసరం లేదు. ఆ దూతల్నే కాకుండా కదంబరాజునూ, మంత్రినీ కూడా మేము చంపి తీరతాం. ఆ దుర్మార్గులు చెప్పినట్టు మేము పితృ, భ్రాతృ హంతకులమేం కాదు. పన్ను భారం మోయలేక ఉగ్రసేనరాజుకు ఎదురుతిరిగిన గ్రామస్థులం," అన్నారు.

"మా మంత్రిగారికి మీరు హంతకులు కాదన్న అనుమానం కలిగే, మిమ్మలను బంధవిముక్తుల్ని చేయమని, నాకు ఆజ్ఞ ఇచ్చారు. సరే, మాటలతో కాలయాపన అయిపోతున్నది. ఈ రెండు గుర్రాలూ, ఈ కత్తులూ తీసుకుని వేట ప్రారంభించండి. బహుమానం కావలిసివస్తే మాత్రం, ఆ దూతల శిరస్సులు మా మంత్రిగారి దగ్గిరకు తీసుకురావలసి వుంటుంది," అన్నాడు సైనికులనాయకుడు.

ఆ వెంటనే ధూమక సోమకులు, సైనికు లిచ్చిన కత్తులు తీసుకుని, గుర్రాలెక్కి దూతలు వాగు దాటిన ప్రదేశంలోనే తామూ వాగు దాటి, వాళ్ళను వెతుకుతూ కదంబ నగరం కేసి బయలుదేరారు. ఆ ప్రదేశ మంతా కొండమయం. మహావృక్షాలతో, ముళ్ళపొదలతో ఆ ప్రాంతమంతా, చీకటిలో మహాభయంకరంగా వున్నది. అడవి మృగాలు నీటి మడుగుల దగ్గిరకు రాక పోకలు జరిపే కాలిబాటల వెంట, జాగ్రత్తగా తమ గుర్రాలను నడుపుతూ, ఎక్కడైనా అలికిడి అయిన జాడ కోసం చెవులు రిక్కించి వింటూ ధూమకసోమకులు అరణ్యంలో చాలా దూరం వెళ్ళారు. కాని, వాళ్ళకు దూతల జాడ కనిపించలేదు.

"సోమూ! ఈ చీకట్లో ఆ దుర్మార్గుల్ని వెతికిపట్టటం అయేపని కాదు. ముందు మన గ్రామం వెళ్ళి మన కుటుంబాలను సరిహద్దులు దాటించి కుంతలరాజ్యం చేరుద్దాం," అన్నాడు ధూమకుడు.



సోమకుడు అడ్డంగా తలాడించి, "ఉగ్రసేనరాజు చావు చూడందే, నేను గ్రామం రాను. నన్ను కట్టలేసంత మాత్రాన నన్ను ఖైదు చేసి, నానా హింసలకూ గురిచేస్తాడా? పైగా నేను భ్రాతృహంతకుణ్ణా!" అన్నాడు రోషంగా.

"నీ మొండితనం మాను, సోమూ! రాజు అంత తేలిగ్గా మన చేతికి చిక్కుతాడనుకున్నావా? అతడి చుట్టూ ఎంతమంది అంగరక్షకులుంటారో తెలుసా? నేనూ నీతో పాటు హింసలపాలయిన వాణ్ణే. పారిపోయిన ఇద్దరు దూతలూ మన మీద రాజుకు కొండేలు చెప్పి, ఉరితీత పడిన దూతల చావుకు మనమే కారణం అని ఆయన చేత నమ్మిస్తారు. అప్పుడు మన కుటుంబాల గతి ఏమవుతుందో ఆలోచించావా?" అన్నాడు ధూమకుడు

ఆ మాటలతో సోమకుడు కొంచెం మెత్తబడ్డాడు. అతడికి ముందు తమ కుటుంబాల రక్షణ విషయం జాగ్రత్త పడటం మేలనిపించింది. "సరే, నువ్వు చెప్పినట్టే చేద్దాం, పద!" అంటూ సోమకుడు గుర్రాన్ని మరొక దారికి మళ్ళించాడు.

ధూమకుడు కూడా తన గుర్రాన్ని మళ్ళించబోయేంతలో, నగరం వైపు నుంచి పెద్ద వెలుగు కనిపించింది. ఇద్దరూ ఆశ్చర్య పడుతూ అటు కేసి తలలు తిప్పారు. కోట గోడల మీది నుంచి మండుతున్న బాణాలు అరణ్యం కేసి వచ్చి పడుతున్నవి. నగారా మోతలూ, భేరీ ఝాంకార ధ్వనులూ ఒక్కుమ్మడిగా దిక్కులను పిక్కటిల్ల చేస్తున్నవి.

"నగరాన్ని మనవాళ్ళు ముట్టడించారు. రాజు హతం! మనం కూడా వెళ్ళి నగరం మీద పడదాం," అంటూ సోమకుడు గుర్రాన్ని పక్కకు తిప్పాడు.

ధూమకుడు అతణ్ణి వారిస్తూ, "తొందర పడకు. కదంబనగరాన్ని ముట్టడించగల



శక్తి మన పేద గ్రామీణుల కెక్కడ వున్నది? మనం గుడ్డిగా నగరాని కేసి పరిగెత్తితే, మళ్ళీ రాజుకు ఖైదీలుగా చిక్కుతాం. కాలిబాటలు వదిలి, జాగ్రత్తగా చెట్ల మాటున ముందుకుపోయి, ఆ రణగొణ ధ్వనికీ, మంటల బాణాలకూ కారణం ఏమిటో తెలుసుకుందాం," అన్నాడు ధూమకుడు.


కదంబనగరంలో రేగిన కల్లోలానికి కారణం, సామకు డనుకున్నట్టు పన్నుల భారం మోయలేని గ్రామీణులు చేసిన దాడి కాదు. ఆ రోజు—సరిగా అర్ధరాత్రివేళ ఒక మహాకాయుడు, కోట చుట్టూ వున్న అగడ్తను నాలుగైదు అంగల్లో దాటి, మూసి వున్న నగరద్వారాలను బలంగా తట్టాడు.

"ఎవడు వాడు? బుద్ధిలేదా! సూర్యోదయం అయితేగాని ద్వారాలు తెరవబడవు!" అంటూ ద్వారరక్షకులు కేకవేశారు.

"నేనెవర్నా? రాజాధిరాజును!" అంటూ మహాకాయుడు ఒక్క ముష్టిఘాతంతో తలుపులను ఫెళఫెళమంటూ వెనక్కు విరుచుకు పడేలా చేశాడు. ద్వారరక్షకుల్లో కొందరు వాటి కింద చిక్కుకుపోయారు. మిగిలినవారు విరిగిన ద్వారం నుంచి లోపలి ప్రవేశించిన నల్లని పర్వతాకారుణ్ణి చూసి భయకంపితులై మూర్ఛపోయారు.

"మీ రిలాగే చచ్చినట్టు పడివున్నారో, చచ్చిన వాళ్ళు చావగా మిగిలిన వాళ్ళయినా బతుకుతారు. అలా కాక, కోటలోకి పరిగెత్తి హెచ్చరికలు చేశారో, మెడలు విరిచేస్తాను," అన్నాడు మహాకాయుడు.

ఆ మాటలతో ప్రాణభయం పోయిన ద్వారరక్షకుల్లో కొందరు అతడి కేసి చూశారు. ఆ మహాకాయుడు చర్మాలు ధరించి వున్నాడు. కళ్ళు నిప్పుకణాల్లా మెరుస్తున్నవి. తల మీద మెలికలు తిరిగిన రెండు కొమ్ము లున్నవి. చేతిలో ముళ్ళు చెక్కిన పెద్ద రాతిగద లాంటిది వున్నది.



"రాక్షస దొరా! నువ్వేలోకం వాడివో మాకు తెలీదు. నగరంలో నీ ఇష్టంవచ్చిన వాళ్ళను తినెయ్యండి. కాని, అదుగో, ఆ రాజమార్గానికి ఎదురువైపు నున్న ఎర్ర చావలగోడ ఇంటివాళ్ళను మాత్రం ఏమీ చెయ్యకండి. ఆ ఇంట్లో నా పెళ్ళాంబిడ్డ లున్నారు," అన్నా డొక ద్వారరక్షకుడు.

రాక్షసుడు విరగబడి నవ్వాడు. "ఎరి మూర్ఖా! నేను మనుషుల్ని తినేందుకు మరో లోకం నుంచి వచ్చిన రాక్షసు ననుకున్నావా? నే నిక్కడివాణ్ణే, దండకారణ్యం వాణ్ణి! మానవుల్లో మా రాజుగారికి వియ్య మందాలని బుద్ధి పుట్టింది. మీ రాజకూతురు మహ చక్కని చుక్కటే!" అంటూ రాక్షసుడు, నిశ్శబ్దంగా రాజభవనం కేసి నడిచిపోయాడు.

భవన ప్రధానద్వారం వద్ద కావలావాళ్ళిద్దరు చురుగ్గా పహరా తిరుగుతున్నారు. మరి నలుగురు ఒక నెగడు చుట్టూ కూర్చుని కబుర్లాడుతున్నారు. రాక్షసుడు వాళ్ళ కెదురుగా బాట కవతల వున్న ఒక వృక్షం కింది చీకటిలో కొద్దిసేపు నిలబడి, ద్వారం కేసి బయలుదేరిన వాడల్లా అంతలోనే ఆగి, మరి కొంత దూరం చెట్ల కింది చీకటిలో నడిచిపోయి, భవనప్రాకారాన్ని సమీపించి, దాని మీదిగా లోపలికి దూకాడు. అలా దూకటంలో అతడి కాలొకటి ప్రాకారానికి తగిలి, పెద్ద శబ్దంతో అందులోని కొంత భాగం పెరిగి కిందపడింది.


ఆ వెంటనే భవనంలో గొప్ప సంచలనం బయలుదేరింది. "శత్రుసైన్యాలు! శత్రుసైన్యాలు!" అంటూ కొందరు కేకలు పెట్టారు. "భూకంపం! భూకంపం!" అంటూ మరికొందరు భయంతో అరిచారు. రాజప్రాసాదం లోని నౌకర్లూ చాకర్లూ అందరూ కిందికి పరిగెత్తుకుంటూ వచ్చి, కూలిపోయిన ప్రాకారపు గోడను చూసి ఆశ్చర్యపడసాగారు.



రాజకుమార్తె కాంతిసేనకు భవనంలో రేగిన గగ్గోలుకు నిద్రాభంగమై, తన గది నుంచి బయటికి వచ్చి, పిట్టగోడ నానుకుని నిలబడి కిందికి చూడసాగింది. ఆమె చెలికత్తెలిద్దరు ఆమె పక్కన చేరి, "ఎంత పెద్ద ధ్వనయింది! అందరం భూకంపం వచ్చిందనుకున్నాం," అంటూ కళ్ళింత చేసి, చేతులు వూపుతూ, ఆమెకు కూలిన గోడ చూపసాగారు.

రాక్షసుడు నిశ్శబ్దంగా మెట్లెక్కి రాజకుమార్తె వున్న రెండో అంతస్తుకు పోయాడు. దారిలో అతడికి నౌకర్లెవరూ ఎదురుపడలేదు. వాళ్ళందరూ కాగడాలు వెలిగించుకుని, ప్రాకారం దగ్గిరకు వెళ్ళిపోయారు. రాక్షసుడు మెట్లెక్కి పై భాగానికి వెళుతుండగా, అతడి తల నీడ ముందుగా రాజకుమార్తె వున్న చోట పడింది. దాన్ని చూస్తూనే కాంతిసేన అదిరిపడింది. చెలికత్తెలు భయకంపితులై నీడ, పై నుంచి పడుతున్నదేమో అనుకుని ఆకాశం కేసి చూశారు. అంతలో రాక్షసుడు ఆఖరు మెట్టెక్కి, పై అంతస్తు చేరి చిన్నగొంతుతో, "నేను మీ కెవరికీ హాని చేయను. అయినా, మీలో ఎవరైనా మూర్ఛ పోదలిస్తే, పొండి. కాని, కేకలు పెట్టి గొడవచేశారో, గొంతులు పిసికేస్తాను," అన్నాడు.

రాజకుమార్తె భయకంపితురాలై, మూర్ఛపోయింది. చెలికత్తెలామెను కింద పడిపోకుండా చేతులతో ఆదుకున్నారు. రాక్షసుడు వాళ్ళను సమీపించి, కాంతిసేనను మృదువుగా పట్టుకుని పైకెత్తి భుజాన వేసుకుని, చెలికత్తెలతో, "అందంలో మీరు రాజకుమార్తె కేమీ తీసిపోరు. నా వెంట వస్తారా? శౌర్యసాహసాలు గల మా యువకుల్ని చేసుకుందురుగాని. వాళ్ళ అందచందాల మాట మాత్రం అడగవలిసిన పని లేదు. నన్ను చూశారుగదా? నా అంత చక్కగానూ వుంటారు," అన్నాడు.



చెలికత్తె లా మాటలు వింటూనే కూడ బలుక్కున్నట్టు, ఒక్కసారిగా మూర్ఛ పోయారు. రాక్షసుడు, కాంతిసేనతో మెట్లు దిగివచ్చి, ఈ సారి ప్రాకారంగోడ ఎక్కడ దాటటమా అని ఆలోచించేంతలో, రాజు గారి నౌకరొకడు అటుగా వచ్చి, అతణ్ణి చూసి, "రాక్షసుడు! రాజకుమారి నెత్తుకు పోతున్నాడు!" అంటూ కేకపెట్టాడు.

రాక్షసుడు చప్పున ఉద్యానవనం కేసి పరిగెత్తి, అక్కడ చెట్ల చాటున నిలబడ్డాడు. అతడికి రాజసేవకుల్లో ఎవర్ని చంపటమూ ఇష్టం లేదు. రాజకుమార్తెను సురక్షితంగా ఎత్తుకుపోవటం ఒక్కటే అతడు కోరుతున్నది. ఆ కారణంగా, అతడు 'కాగడాలూ, కత్తులూ తీసుకుని ఉద్యానవనం లోకి వస్తున్న రాజభటుల మీదికి పోకుండా, గోడ దూకి, నగరద్వారాల కేసి పరిగెత్తాడు.

ఆ సరికి రాజు ఉగ్రసేనుడూ, మంత్రి నిద్ర మేలుకుని, మేడ పై భాగానికి వచ్చారు. ఉగ్రసేనుడికి పారిపోతున్న రాక్షసుడి భుజం మీద తన కుమార్తె కనిపించింది. భటులు కొందరు రాక్షసుడి మీదికి గురిచేసి బాణాలు వదులుతున్నారు. వాటిల్లో ఒకటీ అరా వచ్చి తగిలినా, అతడేమీ లెక్క చెయ్యకుండా, నగరద్వారాలు దాటి, అరణ్యమార్గం పట్టాడు.

"కోట బురుజుల మీది నుంచి అగ్ని బాణాలు ప్రయోగించి, అరణ్యంలో వాడెటు పోతున్నదీ చూడండి. ఈ లోపల అశ్వికులు వాడి వెన్నంటిపోయి చుట్టుముట్టండి. రాక్షసుణ్ణి హతమార్చేందుకు నేనే స్వయంగా వస్తున్నాను," అంటూ ఉగ్రసేనుడు పెద్దగా కేకపెట్టాడు. వెంటనే సైనికులు బాణాలకు నూనెరాసిన గుడ్డలు చుట్టి, వాటిని వెలిగించి, రాక్షసుడు పోయిన మార్గం కేసి వదలసాగారు. అశ్వికభటులు కొందరు వేగంగా నగరద్వారాలు దాటి రాక్షసుడి వెంట పడ్డారు.

—(ఇంకావుంది)





# పాతాళదుర్గం


**4**

[రాత్రివేళ కదంబరాజనగరులో ఒక మహాకాయుడు ప్రవేశించి, రాజకుమార్తె కాంతిసేనను అపహరించి, ఎత్తుకుపోసాగాడు. కావలివాళ్ళు అతని మీదికి బాణాలూ, ఈటెలూ విసిరారు. రాజు ఉగ్రసేనుడు ఆజ్ఞాపించగా కొందరు అశ్వికులు అతని వెంట బడ్డారు, మరికొందరు అతని మీద అగ్నిబాణాలు ప్రయోగించసాగారు. తరవాత—]

రాజప్రాసాదంలో రేగిన గగ్గోలుకు నగరమంతా మేల్కొన్నది. ప్రజల్లో చాలామంది శత్రురాజెవడో నగరం మీద దాడి కొచ్చాడని భయపడ్డారు. వాళ్ళల్లో కొందరు నగర ద్వారాల కేసి పరిగెత్తారు.

అంతలో భటులు వదిలిన అగ్నిబాణాలు కొన్ని గురితప్పి నగరం లోని ఇళ్ళ మీద పడినై. ఆ వెంటనే అక్కడా యిక్కడా చిన్నచిన్న మంటలు లేచినై. ప్రజల్లో భీతాహం పుట్టింది. వాళ్ళు తమ తమ గృహాలు రక్షించు కునేందుకు వెనుదిరిగి పరిగెత్తసాగారు.

మేడ పైభాగాన నిలబడి ఇదంతా చూస్తున్న రాజు ఉగ్రసేనుడు మంత్రి కేసి తిరిగి, "అమాత్యా, యిదీ మన ప్రజల రాజభక్తి! కష్టకాలంలో ఎవడి క్షేమం వాడు చూసుకునేవాడే తప్ప, మన రక్షణకై వచ్చి నిలబడేవా డొక్కడూ లేడు. నిజంగా శత్రు




రాజే దాడికి వస్తే, కోట రక్షణకు సహాయ పడేవారు వీళ్ళల్లో ఒక్కగా నొక్కరైనా ఉండరు," అన్నాడు కోపంగా.

"మహారాజా, రాజ్యరక్షణకు మనం జీతభత్యా లిచ్చి పోషిస్తున్న సైనికు లున్నారు గదా, యీ పనికి ప్రజ వల్ల అయ్యే దేమిటి? వాళ్ళ చావు వాళ్ళని చావ నివ్వండి," అంటూ మంత్రి అగ్నిబాణాలు ప్రయోగిస్తున్న భటులను రాజుకు చూపుతూ, "మనవాళ్ళు రాక్షసుడి మీద ప్రయోగించే బాణాలూ, ఈటెలూ రాజకుమార్తెకు హాని కలిగించ వచ్చు. ఆ విషయమై భటులను హెచ్చరించటం అవసరం గదా," అన్నాడు.

ఉగ్రసేనుడు "అవునవును!" అంటూ తలవూపి, తొందరతొందరగా భవనం మీది నుంచి కిందికి దిగిపోతూ, "అమాత్యా! నేను తిరిగి వచ్చేవరకూ నగరరక్షణ బాధ్యత మీరే వహించాలి. శతభానుడు దేనికైనా సమర్థుడు. మనం అతడి దగ్గిరకు పంపిన దూత లేమయారో తెలియటం లేదు," అన్నాడు. అంతలో ఒక సేవకుడు గుర్రాన్నొకదాన్ని మెట్ల వద్దకు తెచ్చి నిల బెట్టాడు. ఉగ్రసేనుడు ఒక్క ఎగురున దాన్ని అధిరోహించి, కొందరు రౌతులు వెంట రాగా, నగరద్వారం దాటి అరణ్య మార్గం పట్టాడు. మంత్రి కొంచెం సేపు రాజు పోయిన వైపుకే చూస్తూ నిలబడి, తరవాత కోట బురుజు కేసి నడుస్తూ, "ఈ ఉగ్రసేనుడు రాజ్యాన్ని మరెంతో కాలం నిలబెట్టుకోలేడు," అనుకున్నాడు.

కదంబనగరానికి తూర్పుదిక్కున వున్న అరణ్యం, కొండప్రాంత మంతా కాగడాలూ, దివిటీలూ పట్టుకు తిరుగుతున్న సైనికులతో నిండిపోయింది. "దివిటీల వెలుగులో తనను వెతికేవాళ్ళను రాక్షసుడు తేలిగ్గా గుర్తిస్తాడు. అలాంటప్పుడు వాడు వీళ్ళ కెలా దొరుకుతాడు!" అనుకుంటూ మంత్రి ఆశ్చర్యపోయాడు.

అరణ్యంలో ధూమకసోమకుల కూడా యిలాంటి అనుమానమే కలిగి, కదంబ రాజు తెలివితక్కువతనానికి నవ్వుకున్నారు. వాళ్ళిద్దరూ, సైనికులు తామున్న ప్రాంతానికి రాగానే, గుర్రాలు దిగి, వాటిని గుబురు చెట్ల చాటున దాచి, ఒక పెద్ద చెట్టెక్కి కొమ్మల్లో దాక్కున్నారు. కదంబ సైనికుల్లో కొందరు కాగడాలు పట్టుకుని, ఆ చెట్టు కిందికి వచ్చి, సంభాషించుకో సాగారు. వాళ్ళ మాటల వల్ల ధూమక సోమకులకు రాజకుమార్తె అపహరణా, ఉగ్రసేనుడు స్వయంగా అరణ్యంలోకి వచ్చిన సంగతి తెలిసింది.



"ఆ దుర్మార్గుణ్ణి చంపటానికి మన కిది మంచి అవకాశం," అన్నాడు సోమకుడు.

"తొందరపడకు సోమూ! మనం సైనికుల దుస్తుల్లో వున్నట్టయితే, ఆ పని సాధ్యమయేది. ఇప్పుడు మన మున్న వేషంలో, ఎవరి కంటనైనా పడ్డామో, ముందు మనం చావటం ఖాయం," అన్నాడు ధూమకుడు. కదంబ సైనికులు చెట్టుకింది నుంచి వెళ్ళిపోయారు.

"సోమూ, ఇక మనం చెట్టు దిగి, యింకా చీకటి వుండగానే మన గ్రామం చేరటం మంచిది. మన కుటుంబాలను యీ రాజ్య సరిహద్దులు దాటించందే, మనం ఎలాంటి సాహసానికి పూనుకోగూడదు," అన్నాడు ధూమకుడు. సోమకు డేమీ జవాబివ్వలేదు. ఇద్దరూ చెట్టుకొమ్మల్లోంచి కిందికి రాసాగారు. అంతలో కొంచెం ఎడంగా వున్న ఊడలమర్రి చాటు నుంచి నల్లని భయంకరాకారం ఒకటి బయటికి వచ్చి దాపులనున్న కొండగుహల కేసి నడవసాగింది. దాని భుజం మీద ఒక మానవాకృతి నిశ్చేతనంగా పడివున్నది.

ధూమకుడు, సోమకుడి భుజం పట్టుకుని ఆగమని హెచ్చరించి, గుహల కేసి పోతున్న భయంకరాకారాన్ని అతడికి



చూపుతూ, "అదుగో రాకసుడు! వాడి భుజం మీద వున్నది రాజకుమార్తె, అనుమానం లేదు. ఆమె ధరించిన వజ్రవైడూర్యాలు, ఈ గుడ్డివెన్నెల్లో కూడా ఎలా మిలమిలా మెరిసిపోతున్నవో, చూశావా!" అన్నాడు. సోమకుడు ఆ దృశ్యం చూస్తూనే నిశ్చేష్టుడైపోయాడు. రాకసుడు గుహల్లో ఒకదాన్ని సమీపించే సరికి, లోపలి నుంచి, "ఎవరు వాళ్ళు? వెనక్కు తిరిగి పొండి!" అన్న గంభీర కంఠస్వరం వినబడింది.


"ఒరే మనిషీ, గొంతు పగిలేలా అంత పెద్దగా అరవకు! నే నీ రాత్రి ఎవణ్ణీ చంపకూడదని ఒట్టేసుకున్నాను. మర్యాదగా గుహ నుంచి బయటికి వచ్చి, కిక్కురుమనకుండా వెళ్ళిపో," అన్నాడు రాకసుడు.

"నువ్వెవడో రాకసుడిలా కనిపిస్తున్నావే? నే నెక్కడ ఒక మహావీరుడికి మూలికా వైద్యం చేసి గాయాలు మాన్పి, ఇప్పుడే స్పృహ తెప్పించాను. వీరాలు పలక్కుండా గుహ ముందు నుంచి కదిలి, కుఁయ్‌కుఁయ్ మనకుండా నీ దారిన పో!" అన్న జవాబు వచ్చింది గుహలో నుంచి.

ఆ జవాబు వింటూనే రాకసుడు ఉగ్రుడైపోయి, "ఒరే, మనిషి! ఎంతమాటన్నావే? నేను రాకసుణ్ణిరా, కుంభీరుణ్ణి!" అంటూ హుంకరించి గుహ కేసి ఒకడుగు వేశాడు.

"నేను మాంత్రికుణ్ణిరా, కాలశంబరుణ్ణి! కాచుకో!" అంటూ గుహ నుంచి కేక వినబడింది. ఆ వెంటనే మెరుస్తున్న శంబరుడి మంత్రదండం పాములా బుసకొడుతూ వచ్చి, కుంభీరుడి తలను బలంగా తాకింది.

అంత బలశాలి అయిన కుంభీరుడూ, మంత్రదండం దెబ్బ తింటూనే కింద పడిపోయాడు. కాని ఆ పడేటప్పుడు రాజకుమారి కాంతిసేనకు అపాయం కలక్కుండా జాగ్రత్త పడ్డాడు. కాంతిసేన అప్పుడే నిద్ర నుంచి మేల్కొన్నట్టు కళ్ళు తెరిచి చుట్టూ కలయ చూసింది. ఆమె


CHITRA



ఎత్తుగా పెరిగి తివాసీలా ఉన్న పచ్చిగడ్డిపై పడుకుని వున్నది. పక్కనే తనను అపహరించుకు వచ్చిన మహాకాయుడు తల చేతులతో పట్టుకుని మూలుగుతూ, మధ్య మధ్య పళ్ళు కొరుకుతున్నాడు. అతడి తల మీద వున్న కొమ్ముల్లో ఒకటి— కుడివైపుది మంత్రదండం దెబ్బకు విరిగి పోయింది. అక్కడ కలిగిన గాయం నుంచి సంతతధారగా రక్తం కారుతున్నది.


మహా భయంకరుడైన ఆ రాక్షసుణ్ణి, ఆ దీనస్థితిలో చూడగానే కాంతిసేనకు అతడంటే భయం పోయి, ఎంతో జాలి కలిగింది. ఆమె చప్పున లేచి కూర్చుంటూ, "ఓ మహారాక్షసా! నన్ను తినదలుచుకున్న వాడివి, ఇంత దూరం ఎందుకు తెచ్చావు? నిన్ను గాయపరిచిందెవరు? మా తండ్రిగారేనా? ఆయన గొప్ప శూరుడు, శరణన్న వాళ్ళను వధించరు. ఆయన్ని బతిమాలి నీకు ప్రాణదానం చేయిస్తాను," అన్నది.

రాజకుమారి మాటలు వింటూనే కుంభీరుడికి అంత బాధలోనూ నవ్వాగింది కాదు. అతడికి ఆమె మాట్లాడిన తీరు కూడా ఎంతో ముచ్చట కలిగించింది.

కుంభీరుడు కూర్చున్న చోటు నుంచి లేచి కొద్ది దూరంలో వున్న పొదల దగ్గిరకు వెళ్ళి వాటి ఆకులు కోసి అరచేతుల్తో వాటిని బాగా మర్దించి, తల మీద నెత్తురు కారుతున్న చోట ఆ పసరు పూసుకుని తిరిగి కాంతిసేన దగ్గిరకు వచ్చాడు. అతడు వచ్చేసరికి కాంతిసేన గుహ కేసి చూస్తున్నది.

"ఆ చీకటి గుహలో ఎవరో మాట్లాడుతున్నారు. వాళ్ళెవరు మహారాక్షసా? నీ అనుచరులా?" అని అడిగింది ఆమె.

కుంభీరుడు గుహ కేసి రోషంగా చూసి, "అక్కడ వున్నది నా అనుచరులు కాదు, శత్రువులు. తల మీద యీ గాయం ఆ శత్రువు కలిగించిందే. వాడొక మాంత్రికుడు, శక్తిమంతుడిలా కనిపిస్తున్నాడు.



నే వచ్చిన పని చెడిపోయే ప్రమాదం ఉన్నది కనక, ప్రస్తుతానికి వాళ్ళి ప్రాణా లతో వదిలిపెడుతున్నాను," అన్నాడు.

"నీ వచ్చిన పనేమిటి? నన్ను గృహం నుంచి దొంగలా ఎత్తుకుపోవటమా? ఎంత గొప్ప వీరుడివి, ఛీ!" అన్నది కాంతిసేన లేచి నిలబడుతూ.

కుంభీరుడా మాటలకు నిలువునా కంపించి పోయాడు. లజ్జతో ముఖం ముడుచుకుపోయింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అతడు కాంతిసేన ముందు చేతులుమోడ్చి మోకరిల్లుతూ, "అమ్మా, కాంతిసేనా! నన్నంతగా అసహ్యించుకోకు. నేను స్వతంత్రుణ్ణి కాను, ఒకానొక మహాశక్తిమంతుడికీ, క్రూరాతిక్రూరుడికీ భృత్యుణ్ణి. నన్ను ఎత్తుకు రావలిసిందిగా ఆజ్ఞాపించినవాడు, ఆ మహాపాపి. ఆ పని నేను కాకపోతే, అతని భృత్యుల్లో మరొకడు—నా కన్న క్రూరాత్ముడూ, కఠినాత్ముడూ నెరవేర్చే వాడు. అతడి ఆజ్ఞకు తిరుగులేదు. కాని, నేను నిన్ను నా ప్రాణాలొడ్డి అయినా సరే కాపాడి, ఏదో ఒకనాడు నీ తండ్రి గృహనికి చేరుస్తాను," అన్నాడు.

"ఆ పని యిప్పుడే ఎందుకు చేయకూడదు?" అని ప్రశ్నించింది కాంతిసేన.

"అది మనిద్దరికీ ప్రాణగండం అయి తీరుతుంది. నిన్ను నా యజమాని తెమ్మన్న చోటుకు తీసుకుపోక తప్పదు. నువ్వేమీ భయపడకు. నిన్నతణ్ణుంచి నేను కాపాడి తీరుతాను. ఈ భూ ప్రపంచంలో నీ మనస్సుకు నచ్చిన వాడితో నీకు వివాహం జరిగేలా చూస్తాను, సరా," అన్నాడు కుంభీరుడు.

కాంతిసేనకు ఏం మాట్లాడేందుకూ పాలుపోలేదు. కుంభీరుడి మంచితనంలో ఆమెకు కొంత నమ్మకం కలిగినా, అతడు చెబుతున్నదేమిటో కొంచెం కూడా అర్థం కాలేదు. అప్పుడు తను చేయగలిగిందేమిటి?

పారిపోయే ప్రయత్నం చేయటం వృథా. రాక్షసుడి కన్ను గప్పటం సాధ్యమయేది కాదు. సహాయం కోసం కేకలు వేసే ప్రయోజనం లేదు. కుంభీరుడు ఉగ్రుడై తన గొంతు నులమవచ్చు. అతడితో మంచిగా వుంటూ సౌమ్యంగా ప్రవర్తించటమే తనకు భవిష్యత్తులో మేలు కూర్చుతుంది...


కాంతిసేన యిలా ఆలోచిస్తున్నంతలో గుహ ముందు కాగడా వెలుగు కనిపించింది. పెద్దపెద్ద జడలతో, ఆపాదమస్తకం కాషాయ వస్త్రాలతో, చేతిలో మంత్రదండం పట్టుకుని వున్న వికృతాకారు డొకడు ఆ వెలుగులో అక్కడ ప్రత్యక్షమయాడు.

"ఏం, రాక్షసాధమా! నువ్వింకా యిక్కడే తగలడ్డావా? తోరిగ లాగా చెవి పక్కన ఏమీ రాదా? నీలో నువ్వే మాట్లాడుకుంటున్నావా, లేక నీ అనుచరాధము లెవరైనా పక్కనున్నాడా?" అని ఈసడిస్తూ ప్రశ్నించాడు మాంత్రికుడు.

కాంతిసేన మాంత్రికుడికి కనబడకుండా కుంభీరుడు ఆమెకు అడ్డంగా నిలబడి, కళ్ళెర్రజేసి, పళ్ళు కొరుకుతూ, "మానవాధమా! నే నీ రాత్రి ఎవర్నీ చంపకూడదని ఒట్టు పెట్టుకున్నాను. అయినా, నిన్నిప్పుడు ప్రాణాలతో వదలను!" అంటూ హుంకరించి ముందుకు అడుగు వేశాడు.

మాంత్రికుడు వికటాట్టహాసం చేస్తూ, మంత్రదండం ఎత్తి, "ఆహా, రాక్షసపురుక్కెంత కోపం వచ్చింది!" అంటూ దాన్ని విసరబోయేంతలో, రివ్వుమంటూ ఒక బాణం వచ్చి, అతడి చేతిని తాకింది. ఆ వెంటనే చెట్ల మీది నుంచి కేకలు వినబడినై. మాంత్రికుడు చేతిలోని కాగడాను విసిరి నేలకు కొట్టి, గుహ లోపలికి వెళ్ళాడు. కుంభీరుడు చప్పున కాంతిసేనను భుజాని కెత్తుకుని మరో గుహ కేసి పరిగెత్తసాగాడు. ఈ లోపల రివ్వురివ్వు మంటూ బాణాలు వచ్చి పడసాగినై. —(ఇంకావుంది)





# పాతాళదుర్గం

## 5

[రాకుమారి కాంతిసేనను ఎత్తుకుపోయిన కుంభీరు డనే రాక్షసుడు, కొండప్రాంతం చేరి, కాలశంబరు డనే మాంత్రికుడి వల్ల గాయపడ్డాడు. చెట్టు మీదినుంచి ధూమకసోమకులు యిదంతా గమనించారు. హఠాత్తుగా ఎక్కణ్ణుంచో ఒక బాణం వచ్చి, శంబరుడికి తగిలింది. ఆ వెంటనే అతడూ, రాక్షసుడూ గుహల్లోకి పరిగెత్తారు. తరవాత—]

కదంబ సైనికులు కొందరు, "అదుగో, రాక్షసుడు! అదుగో, రాక్షసుడు!" అని కేకలు పెడుతూ గుహల కేసి పరిగెత్తుకు రావటం, చెట్టు మీద వున్న ధూమక సోమకులు చూశారు. శత్రువుల కంటబడకుండా వుండేందుకు వాళ్ళిద్దరూ మరింత గుబురుగా వున్న చెట్లకొమ్మల్లోకి ఎగబాకారు.

"రాక్షసు డెక్కడ? వాడు పారిపోకుండా చుట్టుముట్టండి!" అంటూ ఒక అశ్వికుడు కత్తి ఝళిపిస్తూ సైనికుల మధ్యకు వచ్చాడు. అతడు కదంబరాజు ఉగ్రసేనుడు. అతణ్ణి చూస్తూనే సోమకుడు పళ్ళుకొరికి బాణం ఎక్కుపెట్టబోయేంతలో, ధూమకుడు అతణ్ణి వారిస్తూ, చెవిలో మెల్లిగా ఏమో చెప్పాడు. అంతలో నలుగు రైదుగురు కదంబ సైనికులు ఉగ్రసేనుడి దగ్గిరకు పరిగెత్తుకుంటూ వచ్చి, "మహారాజా! రాక్షసుణ్ణి మేం గాయపరిచాం.



అదుగో చూడండి, యిక్కడ భూమ్మీద నెత్తురు గుర్తులు. కాని, వారు చీకట్లో ఏదో గుహలోకి పారిపోయారు," అన్నారు.

ఉగ్రసేనుడు సైనికులు తెచ్చిన కాగడాలలో ఒకటి తీసుకుని గుహల ముందు పచ్చిక మీద వున్న రక్తపు మరకలు చూశాడు. అవి చాలా చోట్ల కనిపించినై.

"సేనానీ, యీ రక్తం అంతా చూస్తాంటే యిక్కడ ఏదో చిన్న యుద్ధం జరిగినట్టు కనబడుతున్నది. పగలు మనం యీ ప్రాంతాలనే గదా కుంతలదేశ మంత్రికొడుకునూ, అతడి మిత్రుల్నీ వేటాడింది?" అన్నాడు ఉగ్రసేనుడు.

రాజు మాటలకు సేనానాయకుడు వణికి పోతూ, "అవును, మహారాజా! కుంతల మంత్రి కుమారుణ్ణీ, అతడి అనుచరులనూ చంపిన ధూమకుడూ, సోమకుడూ అనే ఖైదీలను మన సరిహద్దు కాపలా సైనికులు పట్టుకున్నది యిక్కడే! ఆ హంతకు లిద్దర్నీ మన దూతలు ఆ దేశపు రాజుగారి వద్దకు తీసుకుపోయారు," అన్నాడు.

"ఆ దూతలు యింతవరకు తిరిగి రాలేదు. మన మాటలు ఆ రాజూ మంత్రీ ఎంతవరకు నమ్మారో మనకు తెలీదు. ఏది ఏమైనా, యీ రాకీసుడి పీడ ఒకటి వచ్చి అడ్డుపడింది కాని, లేకపోతే ఆ కుంతల దేశాన్ని ఒక్కవారం రోజుల్లో సర్వనాశనం చేసివుండేవాణ్ణి," అన్నాడు ఉగ్రసేనుడు పళ్ళుకొరుకుతూ.

సేనాని ఏమో అనబోయేంతలో దాపుల వున్న కొండవాగు ప్రాంతం నుంచి కలకలం వినిపించింది. ఉగ్రసేనుడు కత్తి పైకెత్తి, "రాకీసుడు కొండవాగు దాటి కుంతల దేశంలో ప్రవేశించాడేమో వెతకండి. కొందరు, యీ గుహలన్నీ గాలించండి," అని సైనికులను ఆజ్ఞాపించాడు.

సైనికుల్లో కొందరు వాగు కేసి పరిగెత్తబోయేంతలో, వాగు వైపు నుంచి కొందరు




కుంతలదేశ అశ్వసైనికులు, భయంకరంగా కేకలుపెడుతూ వచ్చి, కదంబ సైనికుల మీద పడ్డారు. "ఇది అధర్మయుద్ధం! దొంగదాడి! నే నెవరో తెలుసా, ఉగ్రసేన మహారాజును!" అంటూ ఉగ్రసేనుడు సింహంలా గర్జించాడు.

"అంత గొప్ప మహారాజుకు, యీ కొండ గుట్టల్లో ఏం పని? అనుమతి లేకుండా వాగు దాటి కుంతలదేశంలో ప్రవేశించిన ప్రతి ఒక్కడూ మాకు శత్రువే. ప్రతి ఘటించకుండా లొంగిపొండి, లేకపోతే ప్రాణాలు దక్కవు," అంటూ కుంతల సైనికుల నాయకుడు కత్తిదూసి, 'గుర్రం మీది నుంచి కింది కురికాడు.

కదంబ సైనికులు తమ రాజు ముందు సొలువుగా నిలబడి, ఈటెలు బారుచేశారు. కొందరు సాహసులు డాలూ కత్తితో ముందు కురికి, కుంతల సైనికులను ఎదుర్కొన్నారు. ఉగ్రసేనుడు తన రక్షణకై దడిలా నిల్చున్న సైనికులను హెచ్చరిస్తూ, కొంచెం వెనక్కుపోయి, ఒక రాతి మీద నిలబడి, వాగు కవతల యింకా శత్రు సైనికులేమైనా వున్నారేమో అని పరీక్షగా చూడసాగాడు.

కుంతల కదంబ సైనికుల మధ్య బాహా బాహీ యుద్ధం భయంకరంగా సాగింది. కుంతల సైనికుల్ని కొండవాగు దాటేలా తరిమికొట్టాలని కదంబసైనికులు ప్రయత్నిస్తూంటే, కుంతలసైనికులు, వాళ్ళనూ వాళ్ళ రాజునూ చుట్టుముట్టి పట్టుకోవాలన్న పట్టుదలతో పోరసాగారు. అంతలో తూర్పు దిక్కు తెల్లనైంది. చెట్టుకొమ్మల్లో దాక్కొని వున్న ధూమక సోమకులకు, కొంచెం దూరంలో యుద్ధం చేస్తున్న రెండు పక్షాల సైనికులూ స్పష్టంగా కనబడసాగారు.

"సోమూ, యిదే మంచి అదను. ఆ పాపి ఉగ్రసేనుణ్ణి యమలోకానికి నువ్వు పంపుతావా? నన్ను పంపమన్నావా?" అన్నారు ధూమకుడు.




ధూమకుడు మాట పూర్తి చేసేలోపలే, సోమకుడు బాణం ఎక్కుపెట్టాడు. "కంఠానికి గురిచెయ్యి!" అని హెచ్చరించాడు ధూమకుడు.

సోమకుడు బాణం ఉగ్రసేనుడి కంఠానికి గురిచేసి వదిలాడు. కాని, అదే సమయంలో వాగు కవతల పెద్ద కలకలం బయలుదేరటంతో ఉగ్రసేనుడు ఆతృతగా నిల్చున్న రాతి మీది నుంచి కిందికి ఉరికాడు. సోమకుడు వదిలిన బాణం గురి తప్పి, రాజు కంఠంలో కాకుండా, భుజంలో బలంగా నాటుకున్నది. ఉగ్రసేనుడు కెవ్వుమంటూ అరిచి కింద పడిపోయాడు. అతడి సైనికులు తమ రాజు కేదో ప్రమాదం కలిగిందని తెలుసుకుని, ఒక్కసారిగా వెనుదిరిగారు. అది అదనుగా తీసుకుని కుంతల సైనికులు వాళ్ళను ఈటెలతో వెన్నుపోట్లు పొడవసాగారు. అంతలో వాగు వైపు నుంచి, ఒక కంఠస్వరం గంభీరంగా వినిపించింది:
"పారిపోయే శత్రువులను చంపవద్దు! చుట్టు ముట్టి బంధించండి!"

కుంతల సైనికులు వెనుదిరిగి చూశారు. మంత్రి గంగాధరుడు కొంతమంది అశ్విక సైనికులతో వేగంగా ఆ ప్రదేశానికి వస్తూ వాళ్ళకు కనిపించాడు. జై జై నినాదాలు మార్మోగినై. కదంబ సైనికులు చుట్టుముట్టబడి నిరాయుధులు చేయబడ్డారు. రాజు ఉగ్రసేనుడు బాధతో నేల మీద అటూ యిటూ దొర్లసాగాడు. గంగాధరుడు గుర్రం దిగి, సైనికులు దారి యివ్వగా, ఉగ్రసేనుణ్ణి సమీపించి, "ఎవ రీతడు? ఓహో, ఉగ్రసేన మహారాజుగారా? ఆశ్చర్యంగా వుంది. సభాభవనంలో కనకపు సింహాసనాన్ని అధిష్ఠించి వుండవలసిన వారు, ఈ అరణ్యం మధ్య నేల మీద పడి దొర్లుతున్నారేం?" అన్నాడు ఆశ్చర్యం నటిస్తూ.

గంగాధరుడి మాటలు వింటూనే, ఉగ్రసేనుడు లేచి కూర్చోబోయి బాధతో పెద్దగా





మూలిగాడు. ఇద్దరు కుంతల సైనికులు ముందుకు వచ్చి, అతణ్ణి చేతులు పట్టుకు లేపి నిలబెట్టారు. సోమకుడు వదిలిన బాణం యింకా అతడి భుజంలో అలా గుచ్చుకునే వున్నది. గంగాధరుడు ఆ బాణం కేసి వేలు చూపుతూ, "మహారాజా! ఈ మాత్రానికే యింతగా బాధపడిపోతున్నారా? మీరు ప్రయోగించిన అంబు వెన్నులో తగిలినా లెక్కచేయకుండా మా భద్రుడు ముప్పైకోసుల దూరం ప్రయాణం చేసి, మా రాజధాని చేరాడు. రాజవైద్యుడు శస్త్రం చేసి అంబు బయటికి లాగుతూంటే, నవ్వుతూ నిన్న యీ ప్రాంతాల జరిగిన విశేషాలు చెపుతూ వుండిపోయాడు," అన్నాడు.

భద్రుడి పేరూ, అతడికి వెన్నులో తగిలిన బాణం సంగతి వింటూనే, ఉగ్రసేనుడు పిచ్చివాడిలా నలుమూలలకూ చూడసాగాడు. ఆ క్షణంలో అతడికి ప్రాణభయం పట్టుకున్నది. తన కొడుకును చంపినందుకు, మంత్రి గంగాధరుడు తనను కత్తితో నిలువునా చీల్చివేస్తాడని అతడు వణికిపోసాగాడు. కాని, గంగాధరుడు చిరునవ్వు నవ్వుతూ ఒకడుగు ముందుకువేసి, ఉగ్రసేనుణ్ణి పట్టుకునివున్న సైనికులకు అతణ్ణి రాతి మీద కూర్చోబెట్టవలసిందిగా ఆజ్ఞాపించి, "మహారాజా, యింత పుత్రశోకంలో కూడా నేను తమకు హాని తలపెట్టి మాత్రం యిక్కడకు రాలేదు. నా కుమారుడు శశికాంతుడి శవం కనబడేంత వరకూ, నేను అతడు మరణించాడంటే నమ్మను. అదే విధంగా జయంతుడూ బతికే వున్నాడనుకుంటున్నాను. మీ ద్రోహానికి వాళ్ళెప్పుడో తప్పక పగ తీర్చుకుంటారు," అన్నాడు.

ఉగ్రసేనుడు దీనవదనంతో, గంగాధరుడి కేసి చూస్తూ, "మహామంత్రీ! నిన్న ఉదయం నిద్రలేస్తూనే ఏ పాపిష్ఠిముఖం

చూశానే, అన్నీ కష్టాలే. ఇక్కడికి వేటకై వచ్చి, ఘోరాతిఘోరమైన పాపకార్యం చేశాను. రాత్రి నా కుమార్తెను......"

ఉగ్రసేనుడు మాట మధ్య ఆగి పోయాడు. మంత్రి గంగాధరుడు, ఉగ్రసేనుడు కూర్చున్న రాతికేసి ఒకడుగు వేసి, చప్పున వంగి, అక్కడ వున్న ఏదో ఒక వస్తువును చేతిలోకి తీసుకుని, దాన్ని పరీక్షించి చూస్తూ, "ఏమిటిది? ఎవడో రాక్షసుడి కొమ్ము! నెత్తురింకా ఎండిపోలేదు. యిక్కడి గుహల్లో రాక్షసులున్నారని నేనెన్నడూ వినలేదే!" అన్నాడు ఆశ్చర్యంగా.



ఉగ్రసేనుడు, గంగాధరుడి చేతిలోవున్న కొమ్ము కేసి చూస్తూ, "మహమంత్రీ! ఆ రాక్షసుడే రాత్రి నా కుమార్తెను కోటలో నుంచి అపహరించుకు పోయాడు. వాణ్ణి తరుముతూ నేనీ ప్రాంతానికి వచ్చాను. వాడితో నేను ముఖాముఖి తలపడింది లేదు. వాడి కొమ్ము ఎవరు తెగనరికి వుంటారు?" అన్నాడు నివ్వెరపోతూ.

ఉగ్రసేనుడి కుమార్తె అయిన కాంతిసేన అపహరణ గురించి గంగాధరుడు యింతవరకూ వినివుండలేదు. ఆ సంగతి వింటూనే అతడికి ఉగ్రసేనుడి మీద జాలి కలిగింది. వెంటనే అతడు తనతోపాటు వచ్చిన వైద్యుణ్ణి దగ్గిరకు పిలిచి, ఉగ్రసేనుడి భుజంలో దిగివున్న బాణాన్ని చూపుతూ, "నీ చేతనైనంతలో మహరాజుకు బాధ లేకుండా, ఆ బాణాన్ని బయటికి లాగు," అని చెప్పి, ఉగ్రసేనుడితో, "మహరాజా! నా కుమారుడు గాయపడి యీ ప్రాంతాల ఎక్కడో దొరకవచ్చునన్న నమ్మకంతో, మా రాజవైద్యుడి శిష్యుణ్ణి వెంటబెట్టుకు వచ్చాను," అని చెప్పాడు.

యువవైద్యుడు క్షణాల మీద ఉగ్రసేనుడి భుజంలో దిగివున్న బాణాన్ని బయటికి లాగి, గాయానికి కట్టుకట్టాడు. గంగాధరుడు ఆ బాణాన్ని చూస్తూనే, ఆశ్చర్య

పోయి ఏమో అనబోయేంతలో, పక్కన వున్న సైనికనాయకుడు అతడితో రహస్యంగా ఏదో చెప్పాడు. గంగాధరుడు మరింత ఆశ్చర్యపోతూ, "మహారాజా! మిమ్మల్ని గాయపరిచినవాళ్ళూ, రాకొమరుడి కొమ్ము నరికినవాళ్ళూ ఒకరే. పితృభ్రాతృ హంతకులని, మీరు మా వద్దకు పంపిన ధూమకసోమకులకు, మా సరిహద్దు కావలా నాయకుడు, మీ దూతల నుంచి తీసుకున్న బాణాలు యిచ్చాడు. ఇదిగో, చూడండి, మీ రాజచిహ్నం," అంటూ బాణాన్ని ఉగ్రసేనుడికి చూపించాడు.

"మహామంత్రీ! వాళ్ళిద్దరూ హంతకులవునో కాదో నాకు తెలియదు; కాని, ముమ్మాటికీ రాజద్రోహులు! వాళ్ళు ప్రాంతాలనే ఎక్కడో పొంచివుండి వుంటారు," అంటూ ఉగ్రసేనుడు తన సైనికుల కేసి తిరిగి, "ఆ రాజద్రోహుల్ని వెతకండి!" అని ఆజ్ఞాపించాడు.

గంగాధరుడు సైనికులను ఆగమని హెచ్చరించి, "మహారాజా! ఇక్కడ ఆజ్ఞలివ్వవలసినవాణ్ణి నేను, మీరు కాదు. నా కుమారుడైన శశికాంతుడు ఏమైనదీ తెలిసేవరకూ మీరంతా, శతభానుమహారాజుగారి బందీలు," అని చెప్పి కుంతల సైనిక నాయకుడి కేసి తిరిగి, "మన సైనికుల చేత యీ గుహలూ, అరణ్య ప్రాంతమంతా ఆ ధూమక సోమకుల కోసం వెతికించు. శతభాను మహారాజుగారు అభయమిచ్చారని మన సైనికులు కేకలు వేస్తూపోతే, వాళ్ళిద్దరూ దాగినచోటు నుంచి బయటపడవచ్చు," అన్నాడు.

ఆ వెంటనే ధూమక సోమకులు చెట్టు చిటారు కొమ్మల మీద నిలబడి, "శతభాను మహారాజుకూ, జై!" అంటూ ఒక పెద్ద కేకపెట్టి, కొమ్మ మించి కొమ్మ మీదికి కోతుల్లా ఎగిరి, నేల మీదికి ఒక్క దూకు దూకేశారు.

—(ఇంకావుంది)





# పాతాళదుర్గం

## 6

[కుంభీరుడూ, కాలశంబరుడూ చెరొక గుహలోకి పారిపోయారు. సోమకుడు విడిచిన బాణం కదంబరాజు ఉగ్రసేనుణ్ణి గాయపరిచింది. ఉగ్రసేనుడు రాజద్రోహులని ప్రకటించిన ధూమక సోమకులకు, కుంతలదేశ మంత్రి గంగాధరుడు అభయం యిచ్చాడు. వాళ్ళిద్దరూ చెట్టుకొమ్మల్లో నుంచి కిందికి దూకారు. తరవాత—]

ధూమక సోమకులను చూస్తూనే, కదంబ రాజు ఉగ్రసేనుడు కంపించిపోతూ, "మహా మంత్రీ! వీళ్ళకు మీరు అభయప్రదానం చేయటం ఏమీ బాగాలేదు. వీళ్ళు అరాజక వాదులు. ఒక రాజుకు ద్రోహం తలపెట్టిన వాళ్ళు మరో రాజుకు ద్రోహం చెయ్యరన్న నమ్మకం ఏమిటి?" అన్నాడు.

ఇంతలో ధూమకసోమకు లిద్దరూ మంత్రి గంగాధరుడి ముందుకు పరిగెత్తుకుంటూ వెళ్ళి, ఆయన ముందు సాష్టాంగ పడి పోయారు. గంగాధరుడు వాళ్ళను లేవవల సిందిగా ఆజ్ఞాపించి, "ఇప్పుడు మీరిద్దరూ నిజమైన యోధుల్లా కనిపిస్తున్నారు. మీరు పితృ భ్రాతృ హంతకులన్న మాట నేనే మాత్రం నమ్మలేదు. మీకు యోధులకు తగిన దుస్తులు యిప్పిస్తాను. మహారాజును గాయపరిచిన వాళ్ళు మీ యిద్దర్లో ఎవరు?" అని అడిగాడు.



"ప్రభూ! ఈ దుష్టరాజు కంఠానికి గురి చేసి బాణం వదలమన్నాను, కాని, సోమకుడు జాలి తలిచి భుజానికి తగిలేలా బాణం కొట్టాడు, రాజు బతికిపోయాడు," అన్నాడు ధూమకుడు.


సోమకుడు కళ్ళెర్ర చేసి ఉగ్రసేనుడి కేసి తిరిగి ఏమో అనబోయేంతలో మంత్రి గంగాధరుడు అతణ్ణి వారించి, ఉగ్రసేనుడితో, "మహారాజా! వీళ్ళు మీ ప్రాణానికి పగబట్టిన తాచుపాముల్లాంటి వాళ్ళు. మీరు వాళ్ళపై అత్యాచారం చేశారు. వాళ్ళు మిమ్మల్ని గాయపరిచి పగ తీర్చుకున్నారు. సరికిసరి. ఇప్పుడు వాళ్ళను క్షమించానని ఒక్కమాట అనండి. ఈ పగ యింతటితో తీరి పోతుంది," అన్నాడు.

"మహామంత్రీ! రాజద్రోహుల్ని క్షమించటమా? ఇదెలాంటి రాజనీతి? వీళ్ళు పన్నులు చెల్లించవద్దని రైతులను రెచ్చగొట్టిన తిరుగుబాటుదార్లు," అన్నాడు ఉగ్రసేనుడు కోపంగా.

"ప్రభూ! ఈ ఉగ్రసేనుడికి యితడి మంత్రికీ పరిపాలన అంటే పన్నులు వసూలు చేయటం అన్న అర్థం తప్ప మరొకటి తెలియదు. పారిపోయారు గాని లేకపోతే, ఆ కుంభీరుడి దగ్గిరా, కాలశంబరుడి దగ్గిరా కూడా పన్నులు వసూలు చేసేవాడే, యీ రాజు!" అన్నాడు ధూమకుడు పళ్ళు కొరుకుతూ.

కుంభీరుడూ, కాలశంబరుడూ అన్న పేర్లు వింటూనే మంత్రి గంగాధరుడు ఆశ్చర్యపడి, "వాళ్ళిద్దరూ ఎవరు? మహారాజుగారి పుత్రికను అపహరించుకు పోయిన రాక్షసులా?" అని ప్రశ్నించాడు.

ధూమక సోమకులు రాత్రి గుహల ముందు జరిగినదంతా మంత్రి గంగాధరుడికి చెప్పారు. కుంభీరుడంతటి మహారాక్షసుణ్ణి ఎదిరించి, తన మంత్రదండంతో అతడి కొమ్ము విరగగొట్టిన కాలశంబరుడు




చాలా గొప్ప మంత్రవేత్త అయి వుంటాడని గంగాధరుడు భావించాడు. అంతేకాక, ఆ మాంత్రికుడు రాక్షసుడితో అన్న మాటలు, 'నేనిక్కడ ఒక మహావీరుడికి మూలికా వైద్యం చేసి గాయాలు మాన్పి?...'— ఆ గాయపడినవాడు తన పుత్రుడు శశికాంతు డెందుకై వుండకూడదు? ఈ అనుమానం రాగానే గంగాధరుడు, ధూమకసోమకులను, అతడు కనిపించిన గుహ చూపెట్టమన్నాడు.

ధూమకసోమకులు గుహలకేసి బయలు దేరారు. మంత్రి గంగాధరుడు కొద్దిమంది సైనికులతో వాళ్ళను అనుసరించాడు. ఉగ్రసేనుడు కూడా మూలుగుతూ వాళ్ళ వెనగ్గా నడిచాడు. ధూమకసోమకు లిద్దరూ గుహల ముందు నిలబడి, "ప్రభూ! మాంత్రికుడు యీ గుహలో నుంచి బయటికివచ్చి, చేతికి బాణం తగలగానే లోపలికి పరిగెత్తాడు. ఇది కుంభీరుడు రాకుమారితో ప్రవేశించిన గుహ!" అని చూపెట్టారు.

"ఆ రాక్షసుణ్ణి చుట్టుముట్టి పట్టుకోవాలి, మహామంత్రీ! ఇక్కడ ఆజ్ఞ లివ్వవలసింది తమరని సెలవిచ్చారు గనక సైనికుల్ని హెచ్చరించండి," అన్నాడు ఉగ్రసేనుడు.

"మహారాజా! ఆ రాక్షసుడూ, మాంత్రికుడూ ఇంకా గుహల్లోనే దాగి వుండేటంత బుద్ధిహీనులని నేననుకోను. అయినా మన జాగ్రత్తలో మనం వుండటం మంచిదే," అంటూ మంత్రి గంగాధరుడు సైనికులను హెచ్చరించాడు.

సైనికులు కొందరు ఈటెలు బారుచేసి రాక్షసుడు పోయిన గుహలోకి బెదురు బెదురుగా ప్రవేశించాడు. గుహ అంధకారమయంగా వున్నది. దివిటీలు వెలిగించి కత్తులూ, ఈటెలూ సిద్ధంగా పట్టుకుని గుహలో కొంత ముందుకు వెళ్ళేసరికి, హఠాత్తుగా ముందున్న వాళ్ళ మీదికి ఒక నల్లని ఆకారం పైనుంచి దూకింది. ఆ వెంటనే గగ్గోలు ప్రారంభమై గుహ నుంచి బయట



పడేందుకు సైనికులు తొక్కిసలాడి, "రాక్షసుడు! రాక్షసుడు!" అంటూ కేకలు పెడుతూ బయటికి పారిపోయి వచ్చారు.

మంత్రి గంగాధరుడు వాళ్ళను ఆపి, "రాక్షసుణ్ణి మీరు చూశారా? వాడేమైనా మీదికి వచ్చాడా? లేక వాడి అరుపు వినబడిందా?" అని ప్రశ్నించాడు.


"గుహంతా కన్నుపొడుచుకున్నా కానరానంత చీకటి, ప్రభూ. కిబాగిబా అంటూ ఏవో మోతలు వినబడినై. అయినా, తెగించి యింకా ముందుకు వెళ్ళాం. మాటాపలుకూ ఏ హెచ్చరికా లేకుండా వాడు ముందు నడుస్తున్న ఇద్దరు దివిటీల వాళ్ళమీద నిలువునా దూకేసి గావుపట్టు పట్టాడు," అన్నాడు సైనికుల్లో ఒకడు.

మంత్రి గంగాధరుడికి యివి నమ్మదగిన మాటల్లా కనిపించలేదు. ఏది ఏమైనా ఇద్దరు సైనికులు గుహలో ప్రమాదస్థితిలో వున్నారు. అతడు తన సైనికుల నాయకుణ్ణి పిలవబోయేంతలో, ధూమకసోమకు లిద్దరూ గుహ పక్కగా పడివున్న దివిటీలు రెండు తీసుకుని, కత్తులు దూసి, "ఒరే, కుంభీర రాక్షసా! వస్తున్నాం, కాచుకో!" అంటూ గుహలోకి పరిగెత్తారు.

వాళ్ళ సాహసం చూసి మంత్రి గంగాధరుడు అచ్చెరువందాడు. రాజు ఉగ్రసేనుడు చేయెత్తి, "నా కుమార్తెను క్షేమంగా బయిటికి తెచ్చారంటే, మీ రాజద్రోహాన్ని క్షమిస్తాను," అంటూ కేక పెట్టాడు.

మంత్రి గంగాధరుడు గుహలోకి ప్రవేశించాడు. మరికొందరు సైనికులు కూడా దివిటీలతో లోపల ప్రవేశించారు. ఈ లోపల ధూమకసోమకులు గుహలో కొంతదూరం వెళ్ళేసరికి, వాళ్ళకు, "అయ్యో, రక్షించండి! బాబో, కాపాడండి!" అంటూ సైనికులు చేస్తున్న ఆర్తనాదాలు వినిపించినై.

ధూమకసోమకులు ఒక్కక్షణం ధైర్యం చెదిరి ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.




రాక్షసుడు సైనికులిద్దర్నీ విరుచుకు తింటున్నాడన్న భయం వాళ్ళకు కలిగింది. కాని, అంతలోనే సోమకుడు భీకరంగా అరిచి, "ధూమా! మనకు భయమేంటి? మన గ్రామదేవత కాళేరమ్మను తలుచుకో! జై, కాళేరమ్మా!" అంటూ ముందు ఉరికాడు. ధూమకుడు కూడా అతడితోపాటు జై కొడుతూ మరికొంచెం దూరం ముందుకు వెళ్ళేసరికి, అక్కడ ఎదురైన దృశ్యం, ఇద్దర్నీ ఆశ్చర్యచకితుల్ని చేసింది.

ఒక పెద్ద కొండచిలువ ఒక సైనికుణ్ణి తలవైపు నుంచి కొంచెం కొంచెమే మింగుతూ, రెండవవాణ్ణి తోకతో చుట్టబెట్టి గుహ గోడల కేసి విసిరివిసిరి కొడుతున్నది. ఇద్దరు సైనికులూ హాహాకారాలు చేస్తున్నారు. సోమకుడు కత్తితో కొండచిలువ మెడ మీద నాలుగైదుసార్లు బలంగా కొట్టేసరికి, దాని మెడ సగం తెగిపోయింది. సైనికుడు దాని నోటి నుంచి బయటికి వచ్చి, సొమ్మసిల్లి నేల మీద పడి పోయాడు. ఈ లోపల ధూమకుడు కొండచిలువ నడుం మీద కత్తితో కొట్టి, దాన్ని రెండుగా నరికాడు. రెండవ సైనికుడు దాని పట్టునుంచి బయటపడి పిచ్చివాడిలా కేకలు పెడుతూ గుహలో గంతులు వెయ్యసాగాడు.

మంత్రి గంగాధరుడు కొందరు సైనికులతో అక్కడికి వచ్చి, రక్తపు మడుగులో విలవిలా కొట్టుకుంటున్న కొండచిలువనూ, నెత్తురోడుతున్న కత్తులతో నిలబడి వున్న ధూమక సోమకులనూ చూసి, "రాక్షసుడెక్కడ?" అని ప్రశ్నించారు.

"ఇక్కడ రాక్షసుడెవడూ లేడు, ప్రభూ! మీ సైనికులు చీకట్లో హఠాత్తుగా మీది ఉరికిన కొండచిలువను చూసి, రాక్షసుడనుకున్నారు," అన్నాడు ధూమకుడు.

"రాక్షసులు మాయావులు. వాళ్ళు కావాలనుకున్న రూపం క్షణాల మీద వచ్చేస్తుంది. ఆ కుంభీరుడే యీ కొండచిలువ రూపం




ధరించి వుంటాడు. నా కుమార్తె ఎక్కడ?" అంటూ రాజు ఉగ్రసేనుడు కీచుమన్నాడు.

మంత్రి గంగాధరుడు ఉగ్రసేనుడి భుజం మీద చేయివేసి సముదాయిస్తూ, "మహారాజా! మీరు యీ చీకటి గుహలోకి ఎందుకొచ్చారు? బయట చల్లగాలిలో కొంచెం విశ్రాంతి తీసుకోండి. మీ కుమార్తెను అపహరించుకుపోయిన రాక్షసుడు యీగుహలో ఎక్కడున్నా, వెతికి పట్టుకునే బాధ్యత నాది," అన్నాడు.

ఇంతలో ధూమకసోమకులు దివిటీలు తీసుకుని గుహలో కొంతదూరం వెళ్ళి, అది మూడు నాలుగు సొరంగ మార్గాలుగా చీలి పోవటం చూశారు. ఆ మార్గాలన్నీ కొండ దిగువకూ, అరణ్యంలోకీ; ఎటు కావాలంటే అటు వెళ్ళేందుకు వీలుగా వున్నవి. రాక్షసుడు ఈ మార్గాల్లో ఏదో ఒకటి ఎన్నుకుని పారిపోయి వుంటాడని వాళ్ళు గ్రహించారు. తరవాత వాళ్ళు తిరిగి వచ్చి, గంగాధరుడికి ఆ విషయం చెప్పారు.

గంగాధరుడు నిరుత్సాహంగా తలవూపి, "సరే, ప్రస్తుతానికి చేయగలిగిందేమీలేదు. ఆ మాంత్రికుడు కనిపించిన గుహ ఎలా వున్నదో చూద్దాం పదండి," అన్నాడు. అందరూ గుహ నుంచి బయిటికి వచ్చారు. కొండచిలువ సగం మింగి వదిలిన సైనికుణ్ణి కొందరు భుజాని కెత్తుకున్నారు. మతిపోయి అరుస్తున్న రెండవ సైనికుణ్ణి కొందరు సైనికులు నడుముకు తాడు కట్టి బయటికి లాక్కొచ్చారు.

మాంత్రికుడు కాలశంబరుడు కనిపించిన గుహ ఏ మంత చీకటిగా లేదు. ఎక్కణ్ణుంచో కొంత వెలుగు గుహలో ప్రవేశిస్తున్నది. ధూమకసోమకులు ముందు గుహలో ప్రవేశించారు. వారికి కొంచెం వెనగ్గా మంత్రి గంగాధరుడు వెళ్ళాడు. లోపలవున్న గుడ్డి వెలుగులో వారికి, క్రూరమృగాలేవో తిని వదిలిన ఒక మానవకళేబరం కనిపించింది.


CHITRA

దాన్ని చూస్తూనే గంగాధరుడు ఒక్క దూకున ముందుకు వెళ్ళి, కళేబరాన్ని పరీక్షించి చూసి, "ఇది, జయంతుడి శవం! ఈ ప్రాంతాల మరేదైనా..." అంటూ చుట్టూ కలయ చూడసాగాడు. ఆ సమయంలో అతడి కళ్ళల్లో నీళ్ళు తిరగటం ధూమక సోమకులకు కనిపించింది. వాళ్ళిద్దరూ గుహలో కొంతదూరం వెళ్ళేసరికి ధూమకుడికి మెరుస్తూ ఒక వస్తువు కనబడింది. వాడు దాన్ని పైకెత్తి చూశాడు, అది కాలశంబరుడి మంత్రదండం! ఆ క్షణంలో ధూమకుడికి కలిగిన ఆనందం అంతా యింతా కాదు. వాడు మంత్రదండాన్ని చేతిలో గిరగిరా తిప్పుతూ, మంత్రి గంగాధరుడి దగ్గిరకు వచ్చి, "ప్రభూ! మాంత్రికుడు కూడా గుహలోంచి పారిపోయాడు. ఇది, ఆ కాలశంబరుడి మంత్రదండం, నాకు దొరికింది!" అంటూ మంత్రదండాన్ని గంగాధరుడికి చూపించాడు.

"నీకు దొరికింది గనక అది నీదే! దీనిలో అద్భుతశక్తు లుండవచ్చు," అంటూ మంత్రి గంగాధరుడు గుహ నుంచి బయటికి వచ్చి, విచారంగా ఒక రాతిమీద కూర్చుని వున్న రాజు ఉగ్రసేనుణ్ణి సమీపించి, "మహారాజా! విచారించకండి. మనిద్దరం దురదృష్టవంతులమే. మీరు ఒక్కగా నొక్క కుమార్తెను కోల్పోయారు, నేనూ నా ఒక్కగా నొక్క కుమారుణ్ణి పోగొట్టుకున్నాను. ఆ రాక్షసుడూ, మాంత్రికుడూ ఎక్కడున్నారో తెలిస్తే తప్ప..." అంటున్నంతలో కదంబదేశ మంత్రి ఒళ్ళంతా గాయాలతో, చిరిగిపోయిన దుస్తులతో గుర్రం మీద వేగంగా అక్కడికి వచ్చి, "మహారాజా! నాశనం! సర్వనాశనం!" అంటూ గుర్రం మీంచి చప్పున దిగబోయి, కాలు రికాబులో చిక్కుకోవటంతో దఢీమంటూ వెల్లకిలా కింద పడిపోయాడు.

—(ఇంకావుంది)





# పాతాళదుర్గం


## 7

[ సైనికులకు గుహలలో కాలకంబరుడూ, కుంభీరుడూ కనిపించలేదు. ఒక గుహలో సైనికు లిద్దరు కొండచిలువ వాతబడ్డారు. ధూమకుడికి, కాలకంబరుడి మంత్రదండం దొరికింది. ఆ సమయంలో కదంబదేశమంత్రి ఒళ్ళంతా గాయాలతో గుర్రం మీద వచ్చి, తమ రాజైన ఉగ్రసేనుడి ముందు, 'సర్వనాశనం !' అంటూ పడిపోయాడు. తరవాత—]

గంగాధరుడు వైద్యుణ్ణి పిలిచి కదంబ మంత్రి గాయాలకు చికిత్స చేయమన్నాడు. ఇద్దరు సైనికులు మంత్రిని ఒక రాతికి ఆనించి కూర్చోబెట్టారు. రాజు ఉగ్రసేనుడు అతడి ముందుకు వచ్చి, "అమాత్యా! ఏమిటిదంతా?" అని అడిగాడు.

. గంగాధరుడు వైద్యుణ్ణి త్వరగా గాయాలకు కట్లు కట్టమని చెప్పి, ఆ పని పూర్తి కాగానే, "అమాత్యా! ఇప్పుడు చెప్పండి. కదంబనగరాన్ని శత్రువు లేమైనా ఆక్రమించుకున్నారా?" అని ప్రశ్నించాడు.

కదంబమంత్రి దాహం కావాలని సంజ్ఞ చేశాడు. సైనికు డొకడు ఆయనకు సొరబుర్ర లోంచి నీరు పోశాడు. మంత్రి దాహం తీర్చుకుని, కొంత స్థిమితపడి, "మీరు కుంతల దేశ మహామంత్రుల్లా వున్నారు," అంటూ గంగాధరుడి కేసి తలాడించి, "కదంబ నగరం మీదికి ఎవరో శత్రువులు దాడి



కొచ్చారని వినగానే, నేను ఆ వచ్చిన వారు కుంతలదేశ సైనికులై వుంటారని భావించాను," అంటూ ఉగ్రసేనుడి కేసి భయంగా చూశాడు.

రాజు ఉగ్రసేనుడు కోపోద్రేకంతో వణికి పోతూ, "కదంబనగరం శత్రువుల వశమై పోయిందీ, అదేనా నీవు చెప్పదలుచు కున్నది?" అంటూ మంత్రిని గద్దించి అడిగాడు.

"మహారాజా, మీరు ఉద్రేకపడకండి," అంటూ గంగాధరుడు, ఉగ్రసేనుణ్ణి శాంత పరిచి, "ఇంతకూ ఆ శత్రువు లెవరు?" అని కదంబ మంత్రిని అడిగాడు.

"శత్రువులు పరదేశీయు లైతే నగరం ఒక పట్టాన వాళ్ళ వశం అయి వుండేది కాదు. విద్రోహం తలపెట్టింది కదంబ వాసులే. వాళ్ళు ఉరుముల్లేని పిడుగుపాటు లాగా, మబ్బుల్లేని జడివాన లాగా హఠాత్తుగా వచ్చి నగరం మీద పడ్డారు. నగర వాసుల్లో చాలామంది వాళ్ళతో ఏకమయ్యారు. ఇంకే ముంది, క్షణాల మీద రాజభవనం ఆక్రమించుకుని బొక్కసం కొల్లగొట్టారు," అన్నాడు కదంబమంత్రి.

"బొక్కసం కొల్లగొట్టారా? నా బొక్కసం! ఎన్నో తరాల నుంచి కష్టపడి కూడబెట్టిన డబ్బూ, బంగారం, వెండీ—అంతా," అంటూ ఉగ్రసేనుడు గాయపడ్డ బెబ్బులిలా భీకరంగా కేక పెట్టి, "ఇంతకూ ఆ రాజద్రోహులకు నాయకు లెవరు? వాళ్ళ నిప్పుడే నా కత్తికి ఎర చేస్తాను. ఏదిరా, నా యుద్ధాశ్వం!" అని కత్తి దూసి, దూరంగా మేస్తున్న తన గుర్రం కేసి పరిగెత్తబోయాడు.

గంగాధరుడు, ఉగ్రసేనుడి రెక్క పట్టుకుని ఆపుతూ, "మహారాజా! తమకు కుమార్తె ఎక్కువో, ఖజానా ఎక్కువో నా కర్థం కావటం లేదు. కొంచెం శాంతించండి, తొందరపడి లాభం లేదు," అని,




కదంబమంత్రితో, "ఆ విద్రోహులకు నాయకు లెవరైనా వున్నారా, లేక అంతా వట్టి అలగా జనమా?" అని ప్రశ్నించాడు.

"మహామంత్రీ, వాళ్ళకు నాయకులు లేకపోవటం ఏమిటి? ధూమక సోమకు లనే పితృ భ్రాతృ హంతకు లున్నారే? వాళ్ళే ఆ మూకకు నాయకులు. 'బొక్కసం దోచండి! అది మన నుంచి పన్నుల రూపంలో బలవంతంగా వసూలు చేసిన ధనమే!' అంటూ వాళ్ళు జనాన్ని ధనాగారం మీదికి ఎగదోలారు," అన్నాడు కదంబమంత్రి.

సోమకుడు పళ్ళు కొరికి, ముక్కుపుటాలెగరవేస్తూ కత్తి దూయబోయేంతలో ధూమకుడు అతన్ని కనుసైగలతోనే వారించి, గంగాధరుడి ముందుకు వచ్చి, "ప్రభూ, చూశారుగదా, యీ అన్యాయం? గడిచిన రెండు రోజులుగా మేము కదంబ నగర ఛాయల్లోనే లేము. కదంబరాజ్య పాలకు లెంత నీచులో, అసత్యవాదులో యిప్పటికైనా మీ కర్థమైందా?" అని ప్రశ్నించాడు.

గంగాధరుడు కదంబమంత్రి కేసి కొర కొర చూస్తూ, "గత నలభైఎనిమిది గంటల్లో కదంబ పాలకులు ఒక్కగానొక్క నిజమైనా పలికిన పాపాన పోలేదు. యువరాణిని రాక్షసు డెత్తుకుపోయాడు, కోశాగారం కొల్లగొట్టబడింది, రాజ్యం శత్రువుల హస్తగతమైంది, పాలకు లిద్దరూ ప్రమాదకరమైన గాయాలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇంత కన్న చేసిన పాపాలకూ, ఆడిన అబద్ధాలకూ మరేం ప్రాయశ్చిత్తం జరగాలి?" అన్నాడు.

రాజు ఉగ్రసేనుడు అవమానంతో కుంగిపోతూ, "మహామంత్రీ, జరిగినదానికి నేను చాలా సిగ్గుపడుతున్నాను. రాజ్యం పోయిందన్న దిగులు నా కేం లేదు. నా కుమార్తెను రాక్షసుడి నుంచి కాపాడే ప్రయత్నంలో మీ నుంచి సహకారం అపేక్షిస్తున్నాను," అన్నాడు.



"సహకారానికేం, మహరాజా! శకకాం తున్న మాంత్రికు చెత్తుకు పాయాడని నా అనుమానం," అంటూ గంగాధరుడు ఆగి, "ఆ ధ్వనులేమిటి? తప్పెట మోతలూ, కేకలూ మీకు వినబడటం లేదా?" అంటూ తన సైనికుల కేసి తిరిగి ప్రశ్నించాడు.


సైనికుల్లో యిద్దరు ముగ్గురు అక్కడ ఎత్తుగా వున్న రాళ్ళ మీది కెక్కి, తప్పెట ధ్వనులూ, కొమ్ముబూరల మోతలూ విన వస్తున్న దిక్కు కేసి చూసి, "ప్రభూ! జనం గుంపులు గుంపులుగా యిటు కేసి వస్తున్నారు. వాళ్ళల్లో కొందరు నాట్యాలు చేస్తూ తప్పెటలు వాయిస్తున్నారు," అని చెప్పారు. అంతలో ఒక అశ్వికుడు చెట్లమధ్య నుంచి బాణంలా దూసుకు వచ్చి ఉగ్రసేను డికి అల్లంత దూరంలో గుర్రం దిగాడు. అతడు ధరించిన దుస్తులు అక్కడక్కడా కాలి వున్నవి. మొలలో ఖడ్గం లేని ఖాళీ ఒర వేలాడుతున్నది. అతడు ఉగ్రసేనుడి కోశాధికారి!


"కోశం కొల్లగొట్టేశారు, మహరాజా! నేను ప్రాణాలతో పారిపోయి వచ్చాను. జనం మీ కోసం ఇటు కేసి వస్తున్నారు. పారిపోకపోతే ప్రాణాలు దక్కవు," అంటూ కోశాధికారి, రాజు కాళ్ళ మీద పడిపోయాడు.

"ఎక్కడికి పారిపోవటం? ఎలా పారిపోవటం?" అన్నాడు గంగాధరుడు, ధూమక సోమకుల్ని దగ్గిరకు రావలసిందిగా సంజ్ఞ చేస్తూ.

"సైన్యాలను సమకూర్చుకుని, ఆ రాజద్రోహుల్ని హతమార్చండి, మహరాజా!" అంటూ కదంబమంత్రి తమ రాజుకు సలహా పలికాడు.

"సైన్యాలు!" అంటూ గంగాధరుడు హేళనగా నవ్వి, "పౌరు లందరూ ఎదురు తిరిగారు, యింక సైన్యాలను గాల్లోంచి సమకూరుస్తావా, మంత్రీ!" అని కదంబ మంత్రిని కొప్పడి, "ఇప్పుడు మిమ్మల్ని


CHITRA



రక్షించవలసిన వాళ్ళు ధూమక సోమకులు. ఏం, ధూమక సోమకుల్లారా! ఆ కార్యం మీరు నిర్వహించగలరా?" అని అడిగాడు.

"ఈ రాజూ, మంత్రి ప్రాణాలు కాపాడగలమేమో గాని, వాళ్ళ రాజ్యం మాత్రం తిరిగి వాళ్ళకు యిప్పించలేం," అన్నాడు ధూమకుడు.

"రాజు లేని రాజ్యం అంటూ ఎక్కడా వుండదు. నీ కేమైనా మతి పోయిందా, ధూమకా?" అన్నాడు గంగాధరుడు కసురుతూన్నట్టు.

"మహామంత్రీ! నాకు రాజ్యం అవసరం లేదు. ఇప్పుడే నా కుమార్తెను వెతుక్కుంటూ అరణ్యాలు పట్టి పోతాను," అన్నాడు ఉగ్రసేనుడు.


"రాజుతోనే గదా మంత్రి బతుకు!" అన్నాడు కదంబమంత్రి.

"రాజ్యమే లేనప్పుడు, యింక కోశాగారం ఎక్కడిది! నేనూ మీతోపాటే వస్తాను," అన్నాడు కోశాధికారి.

"మీలో ఒక్కరిని కూడా ఆ వచ్చే జనం ప్రాణాలతో యిక్కడ్నించి పోనివ్వరు," అంటూ సోమకుడు రంకె వేశాడు.

"ఇక్కడ ఆజ్ఞాపించేవాణ్ణి నేను. అనవసర ప్రసంగాలెవరూ చేయకూడదు," అంటూ గంగాధరుడు కళ్ళెర్రచేసి, "ఉగ్రసేన మహారాజూ, అతడి పరివారమూ కుంతలదేశ రాజుకు శరణాగతులు. వాళ్ళ ప్రాణాలు కాపాడవలసిన బాధ్యత నాది. ధూమకా! సోమకా! మీ రిద్దరూ యిప్పుడే బయలుదేరి పోయి, ప్రజల్ని కదంబ నగరం కేసి తిరుగుముఖం పట్టించాలి. వాళ్ళు మొండిగా ముందు కొచ్చారో రక్తపాతం జరుగుతుంది," అని చెప్పి, తన సైనికులను యుద్ధసన్నద్ధులు కావలసిందిగా ఆజ్ఞాపించాడు.

ధూమక సోమకులకు,కుంతలదేశమంత్రి ఆజ్ఞ ఆశ్చర్యాన్నీ, కోపాన్నీ కూడా తెప్పిం



చింది. సోమకుడు శపథం చేయబోయే వాడిలా చేఎత్తి ఏమో అనబోయేంతలో, ధూమకుడతన్ని భుజం పట్టుకుని దూరంగా లాక్కుపోయి, "సోమూ, తొందరపాటు పనికిరాదు. గంగాధర మంత్రితో యీ సమయంలో పోట్లాట పెట్టుకుంటే, సుశిక్షితులైన అతడి సైనికులు, మన కదంబప్రజల్ని తేలిగ్గా ఓడించి, తిరిగి ఆ దుర్మార్గుడైన ఉగ్రసేనుణ్ణి సింహాసనం ఎక్కించగలరు. కనుక, మనం ప్రస్తుతానికి రాజీగా పోవటమే మంచిది," అన్నాడు.

సోమకుడు అయిష్టంగా తలవూపుతూనే, ధూమకుడితోపాటు బయలుదేరాడు. ఇద్దరూ గుర్రా లెక్కి, విజయనినాదాలు చేస్తూ అటు కేసి వస్తున్న కదంబ పౌరులకు ఎదురు వెళ్ళారు. పౌరుల్లో కొందరు వాళ్ళిద్దర్నీ గుర్తించి, "అదుగో, ధూమక సోమకులు! వాళ్ళ నాయకత్వం కింద మనం, కుంతల దేశ రాజు శతభానుణ్ణి కూడా సింహాసనం విడిచి అడవులు పట్టి పోయేలా చేయగలం," అంటూ కేకలు పెట్టారు.

ధూమకుడు ప్రజల గుంపును సమీపించి, తప్పెటల వాళ్ళని, కొమ్ముబూరల వాళ్ళని నిశ్శబ్దంగా వుండమని హెచ్చరించి, "పౌరులారా! ఇక మీరు శాంతంగా కదంబ నగరానికి తిరిగిపోవటం మంచిది. ఉగ్రసేనుడూ, అతడి మంత్రి కూడా కుంతలదేశ అమాత్యుడైన గంగాధరుడి శరణుజొచ్చారు. వాళ్ళిద్దర్నీ యీ సమయంలో మీరు చంపదలిస్తే, కుంతల సైనికులతో యుద్ధం తప్పదు. అందులో మనకు విజయం కలుగుతుందన్న నమ్మకం నాకు లేదు. ఒకవేళ మనం తాత్కాలికంగా విజయవంతులమైనా, కుంతలరాజు సర్వసైన్యాన్ని వెంటబెట్టుకుని మన మీద దాడి చేస్తాడు. ఆ సంగతి గుర్తుంచుకోండి," అన్నాడు.

"అతణ్ణే ఎదిరించి పోరాడుతాం! రాజరికం అన్నది లేకుండా చేసేందుకు ఆత్మా

ర్పణ చేయటానికి మేం సిద్ధం!" అంటూ జనం లోంచి కొందరు యువకులు పెద్దగా కేకపెట్టారు.

"ఆత్మార్పణకీ, ఆత్మహత్యకీ తేడా మీకు తెలిసినట్టు లేదు," అంటూ ధూమకుడు పెద్దగా నవ్వి, "ఆ అరిచే వీరులంతా ఇళ్ళకు పోయి కోతికొమ్మచ్చు లాడుకోండి. నేను కదంబ పౌరముఖ్యుల్ని ముందుకు రావలసిందిగా కోరుతున్నాను," అన్నాడు.


జనం దారి ఇవ్వగా నలుగు రైదుగురు వృద్ధులు ముందు కొచ్చారు. ధూమకుడు గుర్రం దిగి వాళ్ళకు నమస్కరించి, "అయ్యలారా! మీరు యిక్కడ నాయకత్వం వహించి, ఉడుకురక్తం కుర్రకారును అదుపులో పెట్ట కోరుతున్నాను. గంగాధరమంత్రి అన్నట్టు, రాజు లేని రాజ్యం వుండదు. ఇక కదంబదేశానికి ఉగ్రసేనుడు రాజుగా రావటం జరగదు. కాని, ఆయన కుమార్తె కాంతిసేన మాటేమిటి?" అన్నాడు.

"కాంతిసేన మాకు రాణి కావాలి!" అంటూ జనంలో నుంచి కేకలు బయలుదేరినై. పౌరవృద్ధులు కూడా దానికి అంగీకార సూచకంగా తలలు వూపారు.

"అలా అయితే, అందరూ ప్రశాంతంగా కదంబ నగరానికి వెళ్ళిపొండి. రాక్షసుడు అపహరించుకు పోయిన, ఆ యువరాణిని తిరిగి తెచ్చే బాధ్యత నాది," అన్నాడు ధూమకుడు.

జనం ధూమకుడి కొకసారి జై కొట్టి నగరం కేసి బయలుదేరారు. ధూమక సోమకులు గుర్రాలను మళ్ళించి, గంగాధరుడున్న చోటుకు బయలుదేరేంతలో, ధూమకుడి నడుము నుంచి వేలాడుతున్న కాలకంబరుడి మంత్రదండం, జుయ్ మంటూ శబ్దం చేసి, కట్టివున్న తాడును తెంచుకుని గాలిలోకి లేచింది. సోమకుడు గుర్రం మీద లేచి నిలబడి, మంత్రదండాన్ని పట్టుకునేందుకు పైకెగిరాడు. —(ఇంకావుంది)





# పాతాళదుర్గం

## 8

[ఉగ్రసేనుడి రాజభవనాన్ని కదంబబోయలు ఆక్రమించుకుని, కోశాగారం కొల్లగొట్టారు. తరవాత వాళ్ళు రాజు కోసం అరణ్యంలోకి బయలుదేరారు. ధూమకసోమకులు వాళ్ళను శాంతపరిచి, తిప్పి పంపారు. ధూమకుడి నడుము నుంచి వేలాడుతున్న మంత్రదండం గాలిలోకి లేచింది. సోమకుడు దాన్ని పట్టుకోడానికి పై కెగిరాడు. తరవాత—]

సోమకుడు గుర్రం మీది నుంచి ఒక్క ఎగుడు ఎగిరి గాలిలో తేలిపోతున్న మంత్రదండాన్ని పట్టుకోగలిగాడు. కాని, ఈ లోపల గుర్రం పక్కకు పోవటంతో అతడు దభీమంటూ కింద పడిపోయాడు. అయినా సోమకుడు మంత్రదండాన్ని మాత్రం తన గుప్పెట నుంచి వదలలేదు. ఈ లోపల ధూమకుడు గుర్రం నుంచి కిందికి దూకి, "బలే, సోమూ! మెలకువ అంటే అలా వుండాలి. ఒక్క ఊపున అది నడుముకు కట్టిన తాడు తెంచుకోవటంతో, ఏం జరుగుతున్నదీ నేను గ్రహించలేక పోయాను. మొత్తం మీద కాలశంబరుడి మంత్రదండం మహత్తు గలదే!" అన్నాడు.

సోమకుడు మంత్రదండం పట్టుకుని లేచి నిలబడ్డాడు. అది అతడి గుప్పెట పట్టు నుంచి బయట పడేందుకు పాము లాగా అటూ యిటూ మెలికలు తిరగసాగింది.



అంతేకాక దానిలో నుంచి అస్పష్టమైన ధ్వనులేవో బయల్వెడలసాగినై. ధూమకుడు దానికేసి పరీక్షగా కొంచెంసేపు చూసి, "సోమూ! నాకో ఆలోచన వచ్చింది. కాలశంబరుడు దీని కోసం ఏవో మంత్రాలు జపిస్తున్నాడు. అందుకే ఇది అతణ్ణి చేరేందుకు ప్రయత్నిస్తున్నది," అన్నాడు.

"మనం ఇది చూపే దారి వెంటబడి పోతే, ఆ దుర్మార్గుణ్ణి పట్టుకోవచ్చు గదా?" అన్నాడు సోమకుడు, మంత్రదండాన్ని ధూమకుడికిస్తూ.

"అదెలా సాధ్యం? దీనితోపాటు గాల్లోకి మనం ఎగరలేం కదా! ఇప్పుడిది ఎగిరిపో చూసిన దిక్కు తూర్పు. అవునా?" అన్నాడు ధూమకుడు. సోమకుడు అవునన్నట్టు తలవూపాడు.

"ఇందులో మహత్తు వున్న సంగతి రహస్యంగా వుంచుదాం. రాజకుమార్తె కాంతిసేనను వెతికి తెచ్చే బాధ్యత మనపైన పడింది కదా. ఈ మంత్రదండం అందుకు మనకు సహాయపడవచ్చు," అన్నాడు ధూమకుడు. ఆ తరవాత ఇద్దరూ గుర్రాలెక్కి మంత్రి గంగాధరుడున్న ప్రాంతానికి వెళ్ళారు.

"తిరుగుబాటుదార్లను, ఏ రక్తపాతం లేకుండా కదంబనగరానికి తిప్పి పంపినందుకు మీ ఇద్దర్నీ అభినందిస్తున్నాను. కాని, వాళ్ళకు మీరు చేసిన వాగ్దానం నాకు ఆశ్చర్యం కలిగిస్తున్నది. రాజకుమారి కాంతిసేనను, రాకాసుడి బారి నుంచి మీరెలా విడిపించి తీసుకురాగలరు?" అని అడిగాడు మంత్రి గంగాధరుడు.

"అందుకు ప్రయత్నిస్తాం, ప్రభూ! ఆ ప్రయత్నంలో చావటానికైనా మేం సిద్ధమే. మా వాళ్ళకు మాట ఇచ్చాం," అన్నాడు ధూమకుడు.

"ఇద్దర్లో నువ్వు నాయకుడిలా కనిపిస్తున్నావ్. నా కుమార్తెను తేగలిగావంటే,

నీకు అర్ధరాజ్యం ఇస్తాను, ధూమకా!" అన్నాడు రాజు ఉగ్రసేనుడు.

"ఒకటి, మీ కిప్పుడు రాజ్యమే లేదు. రెండు, ఉన్నా—మీ నుంచి నేను అర్ధ రాజ్యం ఆశించటం లేదు," అన్నాడు ధూమకుడు కోపంగా.

కదంబమంత్రి, కోశాధికారి కొరకొర చూస్తూ, ధూమకుడి కేసి ఒకడుగు వేయ బోయేంతలో గంగాధరుడు వాళ్ళను ఆపి, "చింత చచ్చినా పులుపు చావలేదంటారే, అదే యిది," అని తన సైనికుల కేసి తిరిగి, "ఉగ్రసేన మహారాజునూ, ఆయన పరివారాన్ని మన నగరానికి తీసుకుపోయి విడుదులు ఏర్పాటు చేయండి," అని ఆజ్ఞా పించాడు.

రాజు ఉగ్రసేనుడూ, అతడి మంత్రీ, కోశాధికారీ కుంతల సైనికుల వెంట బయలుదేరి కొండవాగు దాటగానే, మంత్రి గంగాధరుడు ధూమకుడితో, "మీ యిద్దరికీ నేను కుంతలరాజ్య సైనికుల దుస్తులు యిస్తున్నాను. అంతేకాక, మీరు కుంతల రాజుగారి పని మీద వెళుతూన్నట్టు పత్రం ఒకటి యిస్తాను. ఆ విధంగా మీకు అవసర సమయంలో ఏ మహారాజు నుంచయినా సహాయం పొందే వీలుంటుంది," అన్నాడు.



ధూమకు డందుకు కృతజ్ఞత తెలియ పరిచాడు. సేనానాయకుడు తెప్పించిన సైనికదుస్తులు, ధూమక సోమకులకు ఇవ్వ బడినై. వాళ్ళిద్దరూ ఆ దుస్తులు ధరించారు. తరవాత మంత్రి దగ్గిర సెలవు తీసుకుని వెళ్ళబోతూ, ధూమకుడు, "ప్రభూ! తమ కుమారుడు శశికాంతుడి మాటేమిటి? అతడు సజీవుడనే మనం భావించాలి గదా?" అన్నాడు.

"అందులో సందేహం లేదు. శశికాం తుణ్ణి, కాలశంబర మాంత్రికుడు వెంట తీసుకు పోయాడని నా నమ్మకం. మీరు రాక్షసుణ్ణి వెతికి పట్టుకుంటే, కాంతిసేన



ఎక్కడున్నదీ తెలుస్తుంది. ఇక నేను మాంత్రికుడు ఎక్కడున్నదీ కనుక్కోవాలి. ఆ పనికి శశికాంతుడి మిత్రుడైన భద్రుడనే వాణ్ణి కొంత సైనిక సహాయం యిచ్చి పంపుతాను," అన్నాడు మంత్రి గంగాధరుడు.


ధూమకుడు ఆ మాటల కేమీ జవాబు చెప్పకుండా, గంగాధరుడికి నమస్కరించి, సోమకుణ్ణి వెంటబెట్టుకుని తూర్పుదిక్కుగా బయలుదేరాడు. ఆతడి ఉద్దేశం మాంత్రికు డెక్కడున్నదీ తెలుసుకో గలిగితే, అతడి ద్వారా కుంభీరుడి నివాసస్థానం కనుక్కోవడం సులభం అని. వాళ్ళిద్దరి మధ్యా వున్న వైరం, వాళ్ళ సంభాషణ తీరూ ధూమకుడికి యిలాంటి అభిప్రాయం కలిగించింది.

ధూమక సోమకు లిద్దరూ కొండదారుల వెంట ప్రయాణించి, మిట్టమధ్యాహ్నం వేళకు ఒక మహారణ్యంలో ప్రవేశించారు. అక్కడ వారి కొక సెలయేరు కనిపించింది. ఆ సెలయేటి ఒడ్డున వెంట తెచ్చుకున్న ఆహారం తిని చెట్ల కింద కొంచెంసేపు విశ్రాంతి తీసుకుందా మనుకున్నారు వాళ్ళు.

ఇద్దరూ గుర్రాలు దిగి వాటిని చెట్లకు కట్టివేసి, ఏటిని సమీపించేంతలో, ఇసుకలో వారికి కొన్ని పాదాల గుర్తులు కనిపించినై. వాటిల్లో ముఖ్యంగా ఒకటి ధూమకుడి దృష్టిని ఆకర్షించింది. అది మామూలు పాదాల గుర్తు కాదు, పావుకోళ్ళు ధరించిన కాళ్ళ గుర్తులు. ధూమకుడు ఆశ్చర్యసంభ్రమాలతో వాటిని పరీక్షించసాగాడు. సాధారణంగా సాధువులూ, యోగులూ మాత్రమే పావుకోళ్ళు ధరిస్తారు. ఈ మహారణ్యంలో అలాంటివారి కేమి పనుంటుంది? పోతే, యివి మాంత్రికుడు కాలశంబరుడి పావుకోళ్ళ గుర్తులై వుండాలి. ఆ పక్కల నున్నవి శశికాంతుడి పాదాలగుర్తులై వుండొచ్చు.

"సోమూ, ఇవి కాలశంబరుడి పావుకోళ్ళ గుర్తులు, సందేహం లేదు," అన్నాడు

ధూమకుడు, పరధ్యానంగా ఏదో ఆలోచిస్తున్న సోమకుడితో.



సోమకుడు కనుబొమలు చిట్లించి, అడ్డంగా తలాడిస్తూ, "మనం తప్పుదారి పట్టాం ధూమూ! రాజకుమార్తెను ఎత్తుకుపోయింది రాక్షసుడు గదా? మనం వెతికి తెస్తామన్నది ఆమెని. మరి, ఈ మాంత్రికుడి కోసం గాలించటం ఎందుకు? మన కేమన్నా మతులు పోయినయ్యా!" అన్నాడు.

ధూమకు డతనికి తన అభిప్రాయం వివరించాడు. రాక్షసు డెటుపోయిందీ తెలుసుకునేందుకు ఆధారమేమీ లేదు. కాని, మంత్రదండం ఉన్నది గనక, అది తూర్పుదిక్కుకు ఎగిరిపోయేందుకు ప్రయత్నం చేసింది గనక, కాలశంబరుణ్ణి వెతికి పట్టుకోవడం కొంత తేలిక. అతడి ద్వారా కుంభీరుడు వుండే ప్రదేశం తెలుసుకోవచ్చు.

"అవును అదీ నిజమే!" అంటూ సోమకుడు తలవూపాడు. అయినా అతడి కిదేదో డొంకతిరుగుడు దారి అన్న అనుమానం పోలేదు. ధూమకుడు సెలయేటి ఒడ్డుకు పోయి దాహం తీర్చుకుని, నీళ్ళల్లో దిగి అవతలి ఒడ్డుకు పోయాడు, నీరు మోకాళ్ళ లోతు మాత్రమే వున్నది. ఏటి కవతల ఇసుకలో కూడా ధూమకుడికి పావుకోళ్ళ గుర్తులు కనిపించినై. అతడు సోమకుడికి ఏరు దాటి రమ్మని సంజ్ఞ చేశాడు. సోమకుడు దగ్గిరకు రాగానే, అతడికి ఆ గుర్తులు చూపిస్తూ, "మాంత్రికుడు యీ సెలయేరు దాటిపోయి ఎంతో కాలం అయి వుండదు. మనం ఇక్కడ భోజనం కోసం ఆగకుండా ముందుకు పోతే అతణ్ణి కలుసుకునే అవకాశం వుండొచ్చు," అన్నాడు.

"సరే అలాగే చేద్దాం. గుర్రాలను తీసుకొస్తాను," అంటూ సోమకుడు వెనక్కు తిరగబోయేంతలో, దాపులనున్న చెట్ల చాటు నుంచి ఎవరో పెద్దగా చప్పట్లు చరిచిన




శబ్దమైంది. ధూమక సోమకులు కత్తులు దూసి, ఆ శబ్దం వచ్చిన చెట్ల కేసి పరిగెత్తి వాటి వెనక వెతికారు, కాని అక్కడ ఎవరూ లేరు. వాళ్ళు ఆశ్చర్యపడుతూ వెనక్కు తిరిగేంతలో, మరొక వైపు నుంచి చప్పట్లూ, ఈలలూ వినిపించినై. ధూమక సోమకులు ఈసారి జాగ్రత్తగా అడుగులో అడుగు వేసుకుంటూ ఆ వైపుకు బయలుదేరారు. వాళ్ళా విధంగా కొద్ది దూరం వెళ్ళేసరికి, ఈసారి చప్పట్లు, వాళ్ళకు కుడివైపు నున్న చెట్ల చాటు నుంచి వినబడినై.

"సోమూ, మన నెవరో చుట్టుముట్టి హతమార్చాలని చూస్తున్నారు. మనం సెలయేటి దగ్గిరకు పోవటం మంచిది. అక్కడ మన మీద ఎవరూ దొంగచాటుగా వచ్చి దెబ్బతీయలేరు," అన్నారు ధూమకుడు. ఆ వెంటనే ఇద్దరూ పక్కకు తిరిగి ఏటి కేసి పరిగెత్త బోయేంతలో, ఈలలూ, చప్పట్లతోబాటు అరణ్యం ప్రతిధ్వనించేలా కేకలు వినిపించినై. ఆ వెంటనే నలుగురైదుగురు ఆటవికులు చెట్లకొమ్మల్లోంచి వాళ్ళ మీదికి దూకారు. మరి కొందరు ఆటవికులు చెట్లచాటు నుంచి పెడబొబ్బలు పెడుతూ వాళ్ళను చుట్టుముట్టారు.

ధూమక సోమకులు ఒకళ్ళ నొకళ్ళు హెచ్చరించుకునే అవకాశం కూడా లేదు. ఇద్దరూ ఒకేసారి, "జై, కాళేరమ్మా!" అంటూ ఆటవికుల మీద విరుచుకు పడ్డారు. వాళ్ళ చేతుల్లోని వాడికత్తులు మెరుపు వేగంతో ఎదురైన ఆటవికుల్ని తునాతునియలు చేయసాగినై. మీద పడి పట్టుకోవాలని చూసిన ఆటవికులు, ధూమక సోమకులు శరీరాలు విదిలించే సరికి గాలిలోకి లేచి అల్లంత దూరాన చెట్లల్లో దభీమంటూ పడసాగారు.

ఒకటి రెండు నిమిషాలు గడిచినై. ఎంత బలం, ధైర్యం, కత్తియుద్ధంలో నేర్పూ వున్నా, తోడేళ్ళ గుంపులా వచ్చి మీద పడే


CHITRA

ఆటవికుల ధాటికి ధూమక సోమకులు తట్టుకుని నిలబడటం కష్టమైంది. ఆటవికులు విసిరిన బల్లాల్లో ఒకటి రెండు వాళ్ళకు తగిలి, గాయాల నుంచి రక్తం కారసాగింది. చివరకు కత్తి తిప్పేందుకూడా వీలు లేకుండా ఆటవికులు గుంపుగా కట్టకట్టుకు వచ్చి మీద పడి, వాళ్ళిద్దర్నీ పట్టుకున్నారు.

ఆటవికుల ఆనందానికి మేర లేదు. వాళ్ళల్లో చచ్చినవాళ్ళు కొందరు చచ్చారు, కొందరు గాయపడి కేకలు పెడుతున్నారు, మరి కొందరు నడుములు విరిగి, కీళ్ళు తొలిగి మూలుగుతున్నారు. అయినా, మిగతా ఆటవికులు ధూమక సోమకుల్ని పట్టుకున్నామనే ఆనందంలో కేరింతలు కొడుతూ, వాళ్ళ చుట్టూ చేరి గంతులు వేయసాగారు. దూరంగా తప్పెట మోగిన ధ్వని అయింది. గంతులువేసే వాళ్ళల్లో కొందరు ఆ ధ్వని వచ్చిన దిక్కు కేసి తిరిగి, "విరూపా! విరూపా!" అని కేకలు పెట్టారు. కొద్ది సేపట్లో అక్కడికి ఒక అజానుబాహువయిన ఆటవికుడు చేతిలో బల్లెం పట్టుకు వచ్చి, "అష్టా, శాంభవి!" అంటూ భీకరంగా అరిచి, కళ్ళెర్రచేసి, పళ్ళు పటపటా కొరుకుతూ, బల్లెం ఎత్తి ధూమక సోమకుల్ని పొడిచేందుకు ముందుకురికాడు.

ధూమక సోమకులు తమ అంతం సమీపించిందని గ్రహించి, మనసులో పెళ్ళాం బిడ్డల్ని ఒక్కసారి తలుచుకుని, గుండె రాయిచేసుకుని కళ్ళు మూసుకున్నారు. గుండెల్లో ఆటవిక నాయకుడి బల్లెంపోటు పడుతుందని ఎదురు చూసిన వాళ్ళిద్దరికీ గొప్ప ఆశ్చర్యం కలిగింది. ఆటవికనాయకుడు విరూపుడు, బల్లెం ఎత్తిన వాడల్లా దాన్ని జారవిడిచి, "అయ్యా, దొరబాబులూ! నా వాళ్ళ తప్పులు మన్నించండి," అంటూ వాళ్ళ పాదాల ముందు సాష్టాంగ పడిపోయాడు. —(ఇంకావుంది)





# పాతాళదుర్గం

## 9

[సైనికదుస్తులు ధరించి ధూమక సోమకులు, కాంతిసేనను వెతుకుతూ కొంతదూరం వెళ్ళి, ఒక సెలయేటి దగ్గిర దాహం తీర్చుకునేంతలో, అటవికులు వాళ్ళను చుట్టు ముట్టి పట్టుకున్నారు. వాళ్ళ నాయకుడు విరూపు డనేవాడు వాళ్లను బల్లెంతో పొడవ బోయినవాడల్లా, 'దొరబాబులూ!' అంటూ వాళ్ళకు సాష్టాంగపడిపోయాడు. —తరవాత]

ధూమక సోమకులు ఒక క్షణకాలం నిశ్చేష్టులయారు. విరూపుడి ప్రవర్తన వాళ్ళకు చాలా వింతగా కనబడింది.

విరూపుడు లేచి నిలబడి, "కాలశంబర మాంత్రికదొర మిత్రులైన మీరు, మాకు ప్రభు సమానులు. తెలియక చేసిన మా తప్పులు మన్నించండి," అన్నాడు.

"మేము కాలశంబరుడి మిత్రులం కాదు, శత్రువులం!" అంటూ సోమకుడు కళ్ళెర్రచేసి, పళ్ళుకొరుకుతూ కింద పడి వున్న కత్తిని చేతికి తీసుకోబోయేంతలో, ధూమకుడు అతణ్ణి వారించి, "విరూపా! మేము మాంత్రికుడి మిత్రులం అని నీవెలా గ్రహించగలిగావు?" అని అడిగాడు.

విరూపుడు, ధూమకుడి నడుం నుంచి వేలాడుతున్న మంత్రదండాన్ని వేలితో చూపుతూ, "మాంత్రికదొర యీ ఉదయమే, మా గూడెంలో కొంచెంసేపు



విశ్రాంతి తీసుకుని వెళ్ళాడు. తన మంత్ర దండం వెంటతెచ్చిన వారిని ఆదరించి సహాయం చేయమనీ, అది వెంటలేని సైనికుల్నిగాని, పట్టణవాసుల్నిగాని ఒక్క అడుగైనా అరణ్యంలో ముందుకు రాకుండా హతమార్చమనీ ఆజ్ఞాపించాడు," అన్నాడు.

ఈ మాటలతో ధూమకుడికి ఆనందం, మాంత్రికుడి ఎత్తుగడ ఏమిటో అర్థంకాక భయమూ కూడా కలిగింది.

"మేం కాలశంబరుడి నివాసస్థానానికి పోతున్నాం. ఆయనకు ఒకానొక రాక్షసుడు—కుంభీరు డనేవాడు పరమశత్రువు. వాడు నివసించే చోటు నీకు తెలుసా? అంతేకాక కాలశంబర మాంత్రికుడు యీ రాత్రికి ఎక్కడ మజిలీ చేయబోతున్నాడు?" అని ప్రశ్నించాడు ధూమకుడు.

"మాంత్రికదొర యీ మహారణ్యంలో, ఏ మార్గాన ప్రయాణం చేసేదీ నాకూడా తెలియదు, అదంతా పరమరహస్యం. కాని, ఆ దొర నివసించే చోటు మీకూ తెలుసు కదా? దండకారణ్యంలో మహాకలి రాక్షసుడుండే పాతాళదుర్గ ప్రాంతాల. అక్కడికి మీతోపాటు కొంతదూరం వచ్చి, దారి చూపించగలను," అన్నాడు విరూపుడు.


ఎవరీ మహాకలి రాక్షసుడు? అనుకున్నాడు ధూమకుడు. సోమకుడు కళ్ళింత చేసుకుని ఆత్యాశ్చర్యంతో విరూపుణ్ణి ఏదో ప్రశ్నించబోయే సరికి, ధూమకుడు అతడి మాటలకు అడ్డంవచ్చి, "విరూపా! నీవు చేస్తానన్న సహాయానికి మేం యిద్దరం చాలా కృతజ్ఞులం. ముందు భోజనం చేసి, తరవాత ప్రయాణం సాగిద్దాం," అన్నాడు.

భోజనం అన్న మాట వింటూనే, విరూపుడు తన అనుచరుల కేసి తిరిగి, "అందరూ యిక్కడ నిలబడి వింత చూస్తున్నారా, లేక కొందరైనా పోయి, యీ దొరలకు భోజనం ఏర్పాట్లు చేస్తున్నారా?" అని గద్దిస్తూ ప్రశ్నించాడు.

"ఆ ఏర్పాట్లన్నీ పూర్తి కావచ్చినై, దొరా! అంతా భోజనాలకు రావచ్చు," అన్నాడొక యువ ఆటవికుడు.


ధూమకసోమకులకు, విరూపుడు రాజోచితమైన విందు చేశాడు. రకరకాల మాంసాలూ, అడవిఫలాలూ, తేనె సమృద్ధిగా వున్నాయి. బాగా ఆకలిగొనివున్న ధూమకసోమకులు తృప్తిదీరా భుజించారు. తరవాత అతిథుల వినోదం కోసం ఆటవిక యువతీయువకులు రకరకాల నాట్యాలు చేశారు, పాటలు పాడారు; కర్రా, కత్తి సాములూ, మల్లయుద్ధాలూ జరిగినై.

ధూమకసోమకులు తమ అదృష్టానికి ఎంతో ఆనందపడ్డారు. ఎంతో కష్టసాధ్యమనుకున్న పని, వాళ్ళకా క్షణంలో చాలా తేలిక అనిపించింది. ముందు కాలశంబర మాంత్రికుణ్ణి కలుసుకోవటం, అతడి ద్వారా కుంభీరుణ్ణి వెతికిపట్టుకుని వాడి చెర నుంచి కాంతిసేనను విముక్తిచేయటం— ఇదంతా సునాయాసంగా జరిగిపోయే కార్యంలా తోచింది వాళ్ళకు. కాని, ధూమకుణ్ణి అవగింజంత సంశయం బాధిస్తూనే వున్నది. కాలశంబరుడు తన మంత్రదండం కోసం, ఏదో యుక్తిపన్ని తమను హతమార్చ చూస్తున్నాడా?



ఏది ఏమైనా, ఎన్ని ఘోరప్రమాదాలను ఎదుర్కోవలసివచ్చినా, తాము రాకుమారి కాంతిసేనను రాక్షసుడి బారి నుంచి కాపాడక తప్పదు. ఇలాంటి దృఢనిశ్చయానికి వచ్చిన ధూమకుడు విందు ముగిసిన తరవాత కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని, తిరిగి ప్రయాణం సాగించాడు. ఈసారి ధూమకసోమకులకు తోడుగా విరూపుడు కూడా బయలుదేరాడు. అతడు వెంట బల్లెం, విల్లంబులతో పాటు, పాశవాటి తాడొకటి భుజానికి చుట్టచుట్టి తగిలించుకున్నాడు.

ముగ్గురూ అరణ్యంలో ఒక గంటకాలం ప్రయాణించి ఒక కొండప్రాంతం చేరారు.





కొండపాదాన్ని ఒరుసుకుంటూ నది ఒకటి ప్రవహిస్తున్నది. ముగ్గురూ దాన్ని దాట వలసివున్నది. ముందు నడుస్తున్న విరూపుడు నదిని సమీపించి, ఆశ్చర్యంగా ఒక చిన్న కేకపెట్టి, వెనక గుర్రాల మీద వస్తున్న ధూమకసోమకులను పిలిచాడు. ధూమకసోమకులు గుర్రాలు దిగి, విరూపుణ్ణి సమీపించి, అక్కడ ఎదురైన దృశ్యం చూసి వింతపడ్డారు.

నదీతీరంలో ఏదో భయంకర పోరాటం జరిగిన గుర్తుగా, విరిగిన ఈటెలూ, బాణాలూ, నేల మీద రక్తపుమరకలూ కనిపిస్తున్నవి. నదీతీర మంతా ఆ పోరాడిన వారెవరో కాళ్ళతో మట్టగించి, కలియ తొక్కారు. విరూపుడు అదంతా ధూమక సోమకులకు చూపుతూ, "ఈ ప్రాంతాల నివశించేవాళ్ళు మా జాతివాళ్ళు కాదు, భిల్లులు. వాళ్ళతో మాకు శత్రుత్వం లేక పోయినా, స్నేహం మాత్రం లేదు. ఇక్కడ యింత రక్తపాతానికి కారకులెవరో తెలియటం లేదు. కొంచెం నది దిగువకు వెళ్ళి వస్తాను, మీ రిక్కడే వుండండి," అంటూ తీరం వెంట ముందుకు వెళ్ళాడు.

ఆ ప్రాంతానా విరూపుడికి కొన్ని కాలి గుర్తులు కనిపించినై. హఠాత్తుగా అతడికి కాలకంబరుడు గుర్తుకొచ్చాడు. ఆయన కేమైనా హాని జరిగిందా? అనుకుంటూ విరూపుడు అతడి పావుకోళ్ళ గుర్తు లేమైనా కనబడతవేమో అని నేల మీదికి వంగి చూసేంతలో, జుయ్యిమంటూ ఈటె ఒకటి అతడి తలను రాచుకుంటూపోయి, అడుగు దూరంలో నేలలో బలంగా గుచ్చుకున్నది.

విరూపుడు ఒక్క వూపున లేచి నిలబడి వెనక్కు తిరిగి చూసేంతలో మరొక ఈటె అతడి గుండెల మీదికి మెరుపులా దూసుకు రాసాగింది. అతడు చప్పున పక్కకు పడి పోయాడు. ఈటె నదిలో బుడుంగు మంటూ పడిపోయింది. విరూపుడు లేవ


CHITRA



బోయేంతలో, "రాకసబంటూ, దొరికావు! నీ పేగులు తీసి మెడలో వేసుకుంటాను," అంటూ ఒక మహాకాయుడైన ఖిల్లుడు ఆతడి మీదికి ఎనుబోతులా వచ్చిపడ్డాడు.


విరూపుడు యీ దాడికి సిద్ధంగా లేక పోవటంతో ఖిల్లు డతన్ని నడుం పట్టుకుని ఒక్క విసురు విసిరేసరికి నీటి ఒడ్డుకు వెళ్ళిపడ్డాడు. మరుక్షణంలోనే ఖిల్లుడు అతడి గుండెల మీద కూర్చుని, తన బల మైన చేతులతో విరూపుడి కంఠం బిగించి పట్టుకున్నాడు. ఆ సరికి విరూపుడు తెప్ప రిల్లి, కాళ్ళతో ఖిల్లుడి మెడను అడకత్తెరలో బిగించినట్టు బిగించి, బలంగా ఒక్క తోపు తోశాడు. ఖిల్లుడు కాస్త వెళ్ళి నదీజలంలో పడ్డాడు. వాడు నీటి నుంచి లేవకముందే విరూపుడు పులిలా వెళ్ళి మీదపడి, అతడి తలను నీటిలో అదిమి పట్టుకున్నాడు. ఊపిరాడక ఖిల్లుడు గిలగిలకొట్టుకుంటూ, తల నీటి పైకి వచ్చినప్పుడల్లా, "విరూపా, నన్ను చంపకు. నేను పులిందుణ్ణి!" అంటూ అరవసాగాడు.

ధూమకసోమకులు యీ అరుపులు విని అక్కడికి పరిగెత్తుకు వచ్చారు. వాళ్ళు వచ్చేసరికి విరూపుడు, ఖిల్లుణ్ణి నీటిలో నుంచి కాళ్ళు పట్టుకుని ఒడ్డుకు యీడ్చు కొస్తున్నాడు. ధూమకు డది చూసి, "విరూపా, ఎవడు వాడు? ఖిల్లజాతివాడా? ఏం జరిగింది?" అని ప్రశ్నించాడు.

"వీడు నన్ను దొంగచాటుగా చంపాలని చూశాడు. తగిన శాస్తి చేశాను. వీడు చెప్పే పేరు నిజమైతే, వీడు సామాన్య ఖిల్లుడు కాదు, ఖిల్లుల నాయకుడు!" అన్నాడు విరూపుడు.

ధూమకసోమకులు ఖిల్లుణ్ణి సమీపించి, "ఎవడివి నీవు? విరూపుణ్ణి ఎందుకు చంపాలని చూశావు?" అని ప్రశ్నించాడు.

ఖిల్లుడు బొళుక్కుమంటూ యిన్ని నీళ్ళు కక్కి, ఆయాసపడుతూ, "రాజ



భటులు నాకు న్యాయం కలిగించాలి! నా పేరు పులిందుడు, భిల్లనాయకుణ్ణి. ఇంతకు ఓగంట ముందు నా పడుచు పదో పెళ్ళాన్ని యీ విరూపుడూ మరికొందరూ కలిసి అపహరించుకుపోయారు. అడ్డొచ్చిన నా వాళ్ళను కొందరిని చంపి, శవాలను నదిలో పారేశారు. ఇతడూ యితడి పరివారం నా భార్యను ఎవరో రాక్షసుడి కోసం ఎత్తుకుపోతున్నట్టు, వాళ్ళ మాటలద్వారా బతికి బయటపడ్డ నా అనుచరులు గ్రహించి, నాకు చెప్పారు," అన్నాడు.

పులిందుడి మాటలు విని అందరూ చాలా ఆశ్చర్యపడ్డారు. ధూమకుడు ఏదో ప్రశ్నించబోయేంతలో విరూపుడు, పులిందుణ్ణి సమీపించి, "నీ భార్యను అపహరించుకుపోయినవాళ్ళల్లో నేనున్నట్టు నీ అనుచరులు చూశారా? వాళ్ళు లోగడ నన్ను ఎరుగుదురా? ఛీ, అబద్ధాలాడకు, యీ బల్లెంతో పేగులు తోడగలను," అంటూ బల్లెం ఎత్తాడు.


ధూమకుడు, విరూపుడి చేయి పట్టుకుని ఆపి, "పులిందా! నీవేదో పొరబడుతున్నావ్. విరూపుడు గత అయిదారు గంటలుగా మాతోనే వున్నాడు. నీవేదో రాక్షసుడన్నావే—వాడి ముఠావాళ్ళు విరూపుణ్ణి అపఖ్యాతి పాలు చేసేందుకు, అతడి పేరు చెప్పి వుంటారు. అంతేకాక, మీ రెండు తెగల మధ్యా శత్రుత్వం రెచ్చకొట్టటం కూడా వాళ్ళ వుద్దేశం అయివుంటుంది. నీవు చెప్పే రాక్షసు డెవరో మాకు తెలుసు. వాణ్ణి హతమార్చటానికే బయలుదేరాం. నీ భార్యను కూడా తప్పక వాడి చెర నుంచి విడిపించుకు వస్తాం," అన్నాడు.

ధూమకుడిలా అనే సరికి పులిందుడు తన పొరపాటు గ్రహించి, విరూపుడి దగ్గిరకు వెళ్ళి క్షమించవలసిందిగా కోరాడు. ధూమకసోమకుల ప్రోత్సాహంతో వాళ్ళిద్దరూ పరస్పరం ఆలింగనం చేసుకుని

మిత్రులయారు. ఆ తరవాత ధూమకసోమకులు నది దాటబోతున్నారని తెలిసి, పులిందుడు, "అయ్యా, మీ రిక్కడే వుండండి. నేను మా పల్లె రేవు నుంచి రెండు తెప్పలు పంపుతాను. వాటి మీద మీరూ, మీ గుర్రాలూ క్షేమంగా నది దాట వచ్చు," అని చెప్పి పరుగుపరుగున తన పల్లె కేసి వెళ్ళాడు.

కొద్దిసేపటి తరవాత ఇద్దరేసి భిల్లులు రెండు తెప్పలను నదిలో తోసుకుంటూ వచ్చారు. ధూమకసోమకులు ఒక తెప్ప మీద ఎక్కారు. విరూపుడు గుర్రాలతో మరొక తెప్ప ఎక్కాడు. తెప్పలు రెంటినీ భిల్లులు తెడ్లు వేసి తోస్తూ ఆవతలి ఒడ్డుకు నడపసాగారు. అవి సరిగా నది మధ్యలో వుండగా, ధూమకుడి నడుం నుంచి వేలాడుతున్న కాలశంబరుడి మంత్రదండం, చప్పున పాములా పైకి లేచి, తూర్పు దిక్కు కేసి ముఖంపెట్టి ఏవో కీచుధ్వనులు చేయసాగింది. ఆ వింత చూసి విరూపుడు నివ్వెరపోతూ, ఏమో అనబోయేంతలో, దాపులనున్న కొండశిఖరం మీది నుంచి ఒక నల్లని గరుడపక్షి రివ్వుమంటూ ఆకాశంలోకి లేచి, బాణవేగంతో వచ్చి మంత్రదండాన్ని పామనుకుని ఒక్క తన్నుతో గోళ్ళ మధ్య యిరికించుకుని ఆకాశంలోకి ఎగిరింది. మంత్రదండాన్ని కట్టివుంచిన తాడు బలమైనది కావటంతో, ధూమకుడు కూడా దానితోపాటు పైకి లేచాడు. సోమకుడు ఒక్క కేకపెట్టి బాణం ఎక్కుపెట్టి కూడా, బాణం ధూమకుడికి తగలవచ్చునన్న భయంతో కొయ్యబారిపోయాడు. ఈలోపల విరూపుడు బెదిరిన గుర్రాలను సముదాయించి, "శాంభవీ!" అంటూ కొండలు ప్రతిధ్వనించేలా అరిచి, భుజాన్నుంచి వేలాడుతున్న తాడు ఉచ్చును, గరుడపక్షికి గురిచేసి పైకి విసిరాడు. —(ఇంకా వుంది)





# పాతాళదుర్గం

## 10

[ధూమక సోమకులకు విరూపు డనే ఆటవికుడితో స్నేహం అయింది. అతడితో కలిసి వాళ్ళు ఒక నది దగ్గిర భిల్లనాయకు డొకడితో పరిచయం చేసుకుని, తెప్పల మీద నది దాటుతూండగా, మంత్రదండాన్ని ఒక పెద్ద గరుడపక్షి వచ్చి తన్ని, ఆకాశంలోకి లేచింది. విరూపుడు తన దగ్గిరున్న తాడును గరుడపక్షికి గురిచేసి విసిరాడు. —తరవాత]

విరూపుడు విసిరిన తాటిఉచ్చు గరుడపక్షి రెక్క కొకదానికి తగులుకున్నది. అదే అదనుగా విరూపుడు తాడును బలంగా కిందికి గుంజాడు. పక్షి వేగంగా పైకి పోతూండటంతో ఉచ్చు గట్టిగా బిగుసుకు పోయింది. గరుడపక్షి ఒక్క త్రుటికాలం గాల్లో కదలకుండా వుండిపోయి, అంతలోనే కర్ణకఠోరంగా అరుస్తూ, రెక్కల్ని బలంగా ఆడించి పైకెగరబోయింది. విరూపుడు రెండు చేతులతోనూ గట్టిగా తాడును కిందికి లాగుతూ, తెడ్లు వేసే భిల్లులను కూడా సహాయం రమ్మని కేక వేశాడు. వాళ్ళు తెడ్లు వదిలి విరూపుణ్ణి సమీపించేసరికి రెచ్చిపోయిన గరుడపక్షి అతణ్ణి తెప్ప మీది నుంచి ఒకటి రెండడుగులు గాల్లోకి లేపింది.


"విరూపా! తాడు వదలకు. నేనూ వస్తున్నాను," అంటూ సోమకుడు పెద్దగా అరిచి, తన తెప్పతో, విరూపుడి తెప్పను



సమీపించారు. ఆ సరికి గరుడపక్షి బలం క్షీణించింది. ముగ్గురు బలశాలులు తాడును కిందికి గుంజుతూండటంతో అది, ఆకాశంలో ఒక పక్కకు ఒరిగి రెక్కలను టపటప లాడిస్తూ కింద పడసాగింది. ధూమకుడు కత్తి దూసి పక్షి మెడకు గురిచేసి బలంగా విసిరాడు. ఆ దెబ్బ గురితప్పి దాని గుండెల మీద తగిలింది. దానితో అది, మంత్ర దండాన్ని వదిలి విలవిల కొట్టుకుంటూ నదిలో వచ్చి పడింది.

సోమకుడు పరమానందం చెంది, "ధూమూ, భయంలేదు, తెప్ప తెస్తున్నాను," అంటూ ఒక కేక పెట్టి, ధూమకుడు నదిలో పడిన చోటుకు తెప్పను నడిపించారు. ఈ లోపల విరూపుడి తెప్ప మీద వున్న గుర్రాలు రెండూ బెదిరి తెప్ప మధ్యనున్న వల్లా ఒక చివరకు పరిగెత్తటంతో, అది తల్లక్రిందులైపోయి నీళ్ళలో పడినై. వాటితోపాటు విరూపుడూ, ఇద్దరు భిల్లులూ నీట పడ్డారు. ఆ ఇద్దరూ ఈత తెలిసినవాళ్ళయినా ప్రవాహ వేగానికి భయపడి, మునిగి పోతున్నామంటూ కేకలు పెట్టసాగారు. విరూపుడు నీటి వాలుకు కొట్టుకుపోతున్న తెప్పను నాలుగు బారలు వేసి అందుకుని, "భిల్లులు యింత పిరికి సన్నాసులనుకో లేదు. అదుగో, తెప్ప ఎక్కండి," అని అరిచి, "సోమకబాబూ! మీరు ధూమక దొర దగ్గిర కెళ్ళండి. నేను ఈదగలను. అంత కష్టానికీ కారణం అయిన నల్లగరుడ పక్షి ఉచ్చులోంచి బయట పడకుండా పట్టుకోవాలి. దాని గుండెకాయ కాల్చుకు తినందే నా పగ తీరదు," అంటూ దాని కేసి ఈదుకుపోయాడు.

సోమకుడు తన తెప్పతో ధూమకుణ్ణి సమీపించగానే, అతడు తెప్ప అంచు పట్టుకుని దాని మీదికి ఎక్కి కూర్చున్నారు. నీట పడిన భిల్లులిద్దరూ మళ్ళీ తమ తెప్ప ఎక్కి విరూపుడి కేసి దాన్ని నడిపారు.


CHITRA



ఈ లోపల విరూపుడు, గరుడపక్షిని చేరి, దాని మెడ పట్టుకోబోయేంతలో, అది కాళ్ళతో అతణ్ణి ఒక్క తన్ను తన్నింది. వాడి అయిన దాని గోళ్ళు శరీరానికి తగిలే సరికి, విరూపుడికి ఎక్కడలేని రౌద్రం వచ్చి, ముందూ వెనుకలు చూడకుండా దాని మీదికి ఎగిరి కలియబడ్డాడు. ఆకాశంలో తిరిగే పక్షికీ, నేల మీద నడిచే మనిషికీ నీటిలో జరుగుతున్న చావుబతుకుల పోరాటం చూసి, ధూమక సోమకులు చాలా అబ్బురపడ్డారు.

"ఏ మొసలో చూసిందంటే యిద్దర్నీ ఒక గావు పట్టుపట్టి మడుగులో వున్న తన సొరంగంలోకి లాక్కుపోతుంది. తెప్పల్ని త్వరగా విరూపుడి కేసి నడపండి," అని ఆజ్ఞాపించాడు ధూమకుడు.

క్షణంలో తెప్పలు రెండూ విరూపుణ్ణి సమీపించాయి. ఆ సరికి అతడు ఒక చేత్తో గరుడపక్షి మెడ విరిచి పట్టుకుని, రెండవ చేత్తో దాని కాళ్ళను గుప్పెట బిగించేందుకు నానా ప్రయాసపడుతున్నాడు. తెప్ప అతణ్ణి సమీపించగానే ధూమకుడు, "విరూపా! నువ్వు తెప్ప మీదికి రా. ఉచ్చులో దొరికిన పక్షి ఎక్కడికి పోతుంది?" అంటూ అతడి భుజాలు పట్టుకుని బలవంతంగా తెప్ప మీదికి లాగాడు. విరూపుడి శరీరంలో చాలా చోట్ల పక్షి గోళ్ళు తగిలి గాయాలయినై. ధూమకుడూ సోమకుడూ కలిసి గరుడపక్షిని తెప్ప మీదికి చేర్చారు.

"ఇది గరుడపక్షి కాదు, ఏదో రాక్షసుడు!" అన్నాడు సోమకుడు పక్షి కేసి కత్తి ఝళిపిస్తూ.

"దొరా, యింతకన్న భయంకరం అయిన పక్షులు యీ కొండల్లో వున్నవి. మేం అప్పుడప్పుడూ వీటిని ఉచ్చులు వేసి పట్టుతూంటాం. మా వాళ్ళల్లో కొందరు చిన్న పిల్లలుగా వుండగానే వీటిని పట్టుకుని పెంచుతూంటారు. అలవాటు చేస్తే



వేటలో సహాయంగా వుంటుంది." అన్నాడు విరూపుడు, గరుడపక్షి కేసి ప్రేమగా చూస్తూ.

ధూమకుడా మాటలకు పెద్దగా నవ్వి, "దాని గుండెకాయ తీసి కాల్చుకు తింటానన్న నీ ప్రతిజ్ఞ ఏమయింది? ఒళ్ళు చూసుకున్నావా, ఎన్ని గాయాలయినయ్యో, ఎంత రక్తం కారిందో?" అన్నాడు.

విరూపుడు తన గాయాల కేసి చూసుకుని, "నది దాట నివ్వండి దొరా. ఈ గాయాలు నిమిషాల మీద నయం చేసుకుంటాను," అన్నాడు.


ఈ లోపల భిల్లులు తెడ్లు వేసి రెండు తెప్పలనూ అవతలి ఒడ్డు చేర్చారు. నదిలో పడి యీదుకు పోయిన గుర్రాలు రెండూ, నది ఒడ్డు నున్న చెట్లకింద నిలబడి సకిలిస్తున్నవి. "బతికి పోయాం. రెండూ మహారణ్యంలోకి పారిపోలేదు, నయం," అంటూ సోమకుడు వాటిని సమీపించి కళ్ళాలు పట్టుకుని, దాపుల నున్న పచ్చిక దగ్గిరికి తీసుకుపోయాడు.

విరూపుడు, గరుడపక్షిని ఉపాయంగా తెప్ప మీంచి ఒడ్డుకులాగి, తాడు కొనను ఒక చెట్టుకు కట్టి, తన గాయాలకు ఆకు పసరు పూసుకునేందుకు అక్కడ వున్న పొదల కేసి వెళ్ళాడు. ఈ లోపల ధూమకుడు తన తడిసిన బట్టలను పిండుకుని ఆరపెట్టుకోసాగాడు.

ఒక పావు గంట గడిచింది. హఠాత్తుగా విరూపుడు చెట్ల చాటు నుంచి, "దొరా, దొరా! ఘోరం జరిగిపోయింది," అంటూ ఒక పావుకోడు చేతబట్టుకుని ధూమకుడి దగ్గిరకు పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"ఇది కాలశంబర మాంత్రికుడి పావుకోడు, అవునా?" అన్నాడు ధూమకుడు.

"అవును, దొరా. నాకు బాగా గుర్తు. ఆ దొర కేదో ప్రమాదం జరిగింది. కుంభీరుడనే రాక్షసు డాయన శత్రువన్నారే-వాడు ఆయన్ని చంపేసి వుంటాడని నాకు అను



మానం కలుగుతున్నది," అన్నాడు విరూపుడు భీతి చెందినవాడిలా.

"కాలశంబర మాంత్రికుడు అంత తేలిగ్గా చచ్చేరకం కాదు. రాక్షసుడైనా, కుంభీరుడు అంత దుర్మార్గుడేం కాదు. వాడి మాటల ధోరణీ, ప్రవర్తనా నేను చూశాను. కాని... మొత్తం మీద మాంత్రికుడి కేదో ప్రమాదం జరిగింది. అందులో సందేహానికి తావు లేదు," అన్నాడు ధూమకుడు.


విరూపుడు ఏమో చెప్పబోయేంతలో సోమకుడు, "ధూమూ, త్వరగా యిటురా!" అంటూ కత్తిదూసి దగ్గిరలో వున్న పొదల కేసి బయలుదేరాడు. గుర్రాల్లో ఒకటి ముక్కులు పెద్దవి చేసి, వెనక కాళ్ళ మీద నిలబడి, సోమకుడి కళ్ళెం తాడు పట్టు నుంచి పారిపోవాలని చూస్తున్నది.

ధూమకుడూ, విరూపుడూ గబగబా సోమకుడున్న చోటుకు పరిగెత్తారు. సోమకుడు పొదల కేసి చూపిస్తూ, "వాటి వెనక నుంచి మూలుగులో, మాటలో వినబడుతున్నవి. మొదట్లో నేను గుర్తించలేదు. గుర్రం భయపడి పారిపోవాలని చూస్తూంటే నాకు అనుమానం కలిగింది," అన్నాడు.

ధూమకుడు కత్తిదూసి, "జై కాళీ రమ్మా!" అంటూ పొదల్లోకి జొరబడ్డాడు. అతడి వెనకనే, "శాంభవీ!" అని కేక పెడుతూ విరూపుడు వెళ్ళాడు.

"అయ్యో, చస్తున్న వాడి మీద కత్తి కఠారు లెత్తుతారెందుకు? నేను రాక్షసుణ్ణి కాదు... అట్లని మనిషినీ కాదు. పాతికేళ్ళ, కాలకలిరాక్షసుడి చెర నాకు యీ రెండూ కాని మరేదో వికారరూపాన్నిచ్చింది," అన్న మాటలు వినిపించినై.

ఆ మాట్లాడిన వాడి ఆకారవిశేషాలు చూసి ముగ్గురూ దడుచుకున్న వాళ్ళలా ఆగిపోయి, ఒక్కొక అడుగే వెనక్కు వేయసాగారు. మిడిగుడ్లూ, బట్టతలా, అక్కడక్కడా సూదుల్లా నిలబడి వున్న వెంట్రు



కలూ—ఆ మనిషి మాట్లాడే శవంలా వున్నాడు. అతడి శరీరం మీద బలంగా తగిలిన గాయాల గుర్తులు కనబడుతున్నవి.

"ఆ పావుకోడెవరిది? ఆ మంత్రదండం ఎవరిది? ఆ రెండూ కాలశంబర మాంత్రికుడివేనా?" అని ప్రశ్నించారు, ఆ వికారాకారుడు ఆయాసపడుతూ.

"అవును, కాలశంబరుడివే! నువ్వెలా గుర్తించగలిగావు? నువ్వెవరివి?" అని అడిగాడు ధూమకుడు.

"ఇప్పుడో యింకా సేపటికో చావనున్న నే నెవరినైతే మాత్రం మీకేం? ఒకప్పుడు నే నీ ప్రాంతాలవాణ్ణే. కాలకలిరాక్షసుడి బంట్లకు దొరికి పాతికేళ్ళుగా వాడి చెర అనుభవించాను. వాళ్ళు నాకు ప్రాణ భయం పెట్టి, యీ ప్రాంతాలవాణ్ణి గనక—యిక్కడ మనుషుల్ని ఎత్తుకు పోవటానికి వచ్చినప్పుడల్లా, దారిమార్గం చూపేందుకు నన్ను వెంటబెట్టుకు వచ్చేవాళ్ళు. ఇప్పుడూ ఆ పని మీదే నన్ను వెంట తెచ్చారు. పారిపోవాలని ప్రయత్నించాను, ఫలితం యీ గాయాలు!" అంటూ వికారాకారుడు కళ్ళు మూసుకుని ఆయాసపడసాగాడు.

అతడు మరెంతో సేపు బతకడన్న అనుమానం కలిగిన ధూమకుడు, అతణ్ణి సమీపించి, "మేం ఆ కాలకలి మీద పగ తీర్చుకునేందుకు వెళుతున్నాం. అతణ్ణి హతమార్చి నీ ఆత్మకు శాంతి కలిగిస్తాం. ఈ ఒక్క మాటకు జవాబు చెప్పు; కాలశంబరుణ్ణి ఆ రాక్షసుడి బంట్లు పట్టుకుని చంపారా?" అని అడిగాడు.

"ఆ సంగతి నేను నమ్మకంగా చెప్పలేను. అతడూ, అతడి వెంట వున్న ఒక యువకుడూ, ఆ దుర్మార్గుల్ని ఎదిరించి పోరాటం సాగించారు. ఆ గందరగోళంలో నేను పారిపోయేందుకు ప్రయత్నించాను. నన్ను కత్తులతో పొడిచి యిక్కడ పారవేశారు," అన్నాడా వికారాకారుడు.

"ఆ క్రూరులు ఎటుగా పోయారో చెప్ప గలవా ?" అన్నాడు ధూమకుడు.

"చెప్పలేను...కాని...వాళ్ళు ఎక్కి వచ్చిన పడవ నది కొండమలుపు తిరిగే రేవులో వున్నది...మీరు వాగ్దానం చేసినట్టు, ఆ కాలకలిని చంపి నా ఆత్మకు శాంతి కలిగించండి," అంటూ వికారాకారుడు నిలువెల్లా ఓసారి కంపించి, కట్టెలా బిగ దన్నుకుపోయాడు.

ధూమకుడు తన దగ్గిరున్న వస్త్రాల్లో ఒక దాన్ని అతడి శరీరం మీద కప్పి, "విరూపా! నీ కితడు చెప్పిన నది మలుపు తెలుసునా ?" అని అడిగాడు.

"తెలుసుదొరా! అది ఎంతో దూరం కూడా లేదు, బయలుదేరండి," అన్నాడు విరూపుడు.

గుర్రాలను జాగ్రత్తగా చూస్తూండమని భిల్లులకు చెప్పి ముగ్గురూ నది మలుపు కేసి బయలుదేరారు. నాలుగైదు నిమిషాలు గడిచేసరికి వాళ్ళకు కొండను చుట్టి పోతున్న నదీ, అక్కడ రేవులా వున్న ఒక ప్రదేశంలో పెద్ద పడవా కనిపించింది. వాళ్ళు చెట్ల చాటున దాక్కుంటూ ముందుకు పోయి, రేవును సమీపించగానే, దాని ఒడ్డు నున్న చెట్లు ఎక్కి పడవ కేసి పరీక్షగా చూశారు. పడవ మీద ఎవరూ లేరు. కాని, పడవ చుట్టూ ఎన్నో మొసళ్ళు యీదుతూ కని పించినై. "సోమూ! బాణం గురిపెట్టి ఒక దాని శిరస్సు బద్దలయ్యేలా కొట్టు," అన్నాడు ధూమకుడు.

సోమకుడు బాణం గురిపెట్టి వదల బోయేంతలో, విరూపుడు, "దొరా!" అంటూ ఏదో చెప్పబోయాడు. కాని, యీ లోపలే సోమకుడు వదిలిన బాణం రివ్వుమంటూ పోయి, ఒక మొసలి తలను తపీమంటూ తాకింది. మొసలి నీళ్ళల్లో అంత ఎత్తున ఎగిరి పడి మనిషిలా కీచు మంటూ అరిచింది. —(ఇంకావుంది)





# పాతాళదుర్గం

## 11

[విరూపుడి సహాయం వల్ల, ధూమకుడు గరుడపక్షి బారి నుంచి బతికి బయటపడ్డాడు. తరవాత వాళ్ళకు అరణ్యంలో వికృతాకారుడొకడు కనిపించాడు. అతడు చెప్పిన దారి వెంట వెళ్ళి, ధూమకుడూ అతడి మిత్రులూ నదిలో పడవనూ, దాని చుట్టూ ఈదులాడే మొసళ్ళనూ చూశారు. సోమకుడు బాణంతో ఒక మొసలిని కొట్టాడు. —తరవాత]

సోమకుడి బాణం దెబ్బతిన్న మొసలి కీచుమని అరుస్తూ, నీళ్ళల్లో విలవిలా తన్నుకోసాగింది. ఆ తన్నుకోవటంలో పైన ధరించిన మొసలిచర్మపు తొడుగు పోయి ఒక మానవాకారం బయట పడింది. అప్పటి వరకూ పడవ చుట్టూ ఈదుతున్న మొసళ్ళన్నీ ఒక్కసారిగా తమ పై తొడుగులను తొలగించివేసి, కేకలు పెడుతూ ఒడ్డుకు ఈదుకు రాసాగినై. అవి మొసళ్ళు కాదు, మొసళ్ళ లాగా వేషాలు ధరించిన దృఢకాయులైన మనుషులు!

సోమకుడు ఆ వింత చూసి ఆశ్చర్య పోతూ, "విరూపా, ఇది ఆశ్చర్యంగా లేదా? ఎవరీ మొసలి మనుషులు? ఎవరిదీ పడవ?" అన్నాడు.

ధూమకుడు అతణ్ణి మెల్లిగా మాట్లాడమని హెచ్చరించి, "చనిపోయే ముందు ఆ వికృతాకారుడు చెప్పిన మాటలు అప్పుడే



మరిచిపోయావా? వీళ్ళు కాలకలి రాక్షసుడి బంట్లు. పడవ దగ్గిర కెవరూ రాకుండా వుండేందుకు వాళ్ళు ముసళ్ళలా కపట నాటకం ఆడుతున్నారు. వాళ్ళల్లో ఒకడి తల చితికేలా కొట్టి మనం చిక్కులో పడబోతున్నాం. చూడు, వాళ్ళంతా ఒడ్డెక్కి మనం వున్న చెట్ల కేసే పరీక్షగా చూస్తున్నారు," అన్నాడు.

"అవును, దొరా! బాణం వదలబోయే ముందే నాకు వాళ్ళు మనుషులై వుంటారన్న అనుమానం కలిగింది. కాని నా హెచ్చరిక్కి ముందే సోముదొర బాణం వదిలేశాడు," అన్నాడు విరూపుడు.


ధూమకుడు ఓ క్షణకాలం వూరుకుని, ఏదో ఒక గట్టి నిర్ణయానికి వచ్చినవాడిలా తలాడించి, "ఆ ముసలిగాళ్ళు బాణం వచ్చిన దిక్కు కనుక్కున్నారు గాని, మనం యీ చెట్టు పైన దాగివున్నట్టు గ్రహించ లేదు, అది అసంభవం. వాళ్ళిక్కడికి వచ్చే లోపలే మనం చెట్టు దిగి, పొదలమాటున పడి, కొండ మలుపులో వున్న చెట్లగుంపు చేరదాం," అన్నాడు.

మరుక్షణంలో ముగ్గురూ కొమ్మలూ రెమ్మలూ కదలకుండా అతి జాగ్రత్తగా కిందికి దిగి, కొంత దూరం పోయి, గుబురుగావున్న పొదల వెనక భాగానికి చేరారు.

అంతలో ముసలిమనుషులు రెండు ముఠాలుగా చీలారు. ఒక ముఠావాళ్ళు ధూమకుడూ వాళ్ళు వదిలిన చెట్టు కేసి బయలుదేరారు. రెండో ముఠా ఆయుధాలు సర్వసన్నద్ధంగా పట్టుకుని, మరొక వైపుగా పొదలన్నీ గాలిస్తూ కొండ మలుపును చుట్టి రాసాగారు.

"ధూమూ, యీ రాక్షసబంట్లు...రెండు పదులు...ఆరవైమంది వున్నారు. మనం ముగ్గురం—మొత్తం మీద గట్టి చిక్కులోనే పడ్డాం," అన్నాడు సోమకుడు పళ్ళు కొరుకుతూ.


"ఏ చిక్కుల్లోనూ పడకుండా మనం రాజకుమార్తె కాంతిసేనను రాక్షసుడి బారి నుంచి కాపాడి తేగలమా ? నీ ధైర్యసాహసాలను గురించి నాకు ఎలాటి అనుమానమూ లేదు. అంత తప్పనిసరైతే, యీ పొదలూ, పుట్టలూ గాలించే పది మందినీ మనం హతమార్చి కొండ మీదికి పారిపోలేమా ?" అన్నాడు ధూమకుడు కత్తిదూస్తూ.



ఆ వెంటనే విరూపుడు ఈటెను గుప్పెట బిగించి, ముందుకుచాచి పట్టుకున్నాడు. సోమకుడు విల్లుకు అంబు సంధించి ధూమకుడి కేసి చూశాడు. మొసలిమనుషులు తమ చేతుల్లో వున్న యీటెలతో పొదల మీద కొడుతూ, గుబురుచెట్లలోకి ఈటెలను బారుచేసి పొడుస్తూ, గొంతెత్తి, "ఎవర్రా మీరు? ఒకళ్ళా యిద్దరా? బయట పడండి. ప్రాణాలతో మా నుంచి పారిపోలేరు. కాలకలి రాక్షసేంద్రుడి మానవబంట్లల్లో ఒకణ్ణి చంపిన మీ దుస్సాహసానికి ప్రతిఫలం—నిలువునా చర్మాలు వలిపించుకోవటం!" అంటూ గావుకేకలు పెట్టసాగారు.

ధూమకుడు తతిమ్మా యిద్దర్నీ హెచ్చరించి, తా మున్నచోటు కేసి వస్తున్న మొసలి మనుషుల్నుంచి తప్పుకునేందుకు పొదల చాటుగా నక్కుతూ కొండమలుపు కేసి బయలుదేరాడు. మొసలిమనుషుల్లో ఒకడు ధూమకుడూ వాళ్ళూ వున్న దిక్కు కేసి పరీక్షగా చూసి, "అక్కడేదో పొద కదులుతున్నది. మన వాణ్ణి చంపిన దుర్మార్గులు దానిచాటు నున్నారని నా అనుమానం," అంటూ గబగబా అటు కేసి రాసాగాడు.

రానున్న ప్రమాదాన్ని పశికట్టిన విరూపుడు, ధూమక సోమకులను ముందుకు పోవలసిందిగా హెచ్చరించి, చప్పున అరచేతుల మీదా, మోకాళ్ళ మీదా వంగి, తాను



దాగి వున్న పొదను తలతో, చేతులతో అల్లల్లాడిస్తూ, పులిలా భయంకరంగా ఒక్క రంకె వేశాడు.

అడవిలో పుట్టి పెరిగిన అటవికుల్లో చాలామందికి అడవి జంతువుల అరుపులూ, పక్షుల కేకలూ వేయటంలో చాలా నేర్పు వుంటుంది. విరూపుడు ఆ విద్యల్లో అందె వేసిన చేయి. అతడు పెట్టిన రంకె వింటూనే, మొసలిమనుషులందరూ భయంతో కంపించిపోయి వున్న చోటునే ఆగిపోయారు. అందరికన్న ముందు పొద దగ్గిరకు పరిగెత్తు కొస్తున్నవాడు ఆ రంకెకు అదురుకుని బోర్లాపడిపోయి, లేస్తే పులి మీద పడుతుందన్న భయంతో వెనక్కు దొర్లుకుంటూ పోసాగాడు.


"పులి! వెనక్కు తగ్గండి," అన్నాడొక మొసలిమనిషి.

"అది మామూలు పులికాదు, బాగా ఆకలిగొన్న పోతుపులి!" అన్నాడు మరొకడు.

"నీ తెలివి అఘోరించినట్టుంది. ముందు పొదల్నించి దూరంగా పరిగెత్తండి. అది అప్పుడే పిల్లల్నీనిన ఆడపులి, అరుపు తెలియటంలేదా?" అన్నాడింకొకడు.

వాళ్ళీ విధంగా మల్లగుల్లాలు పడుతూంటే, అది అవకాశంగా తీసుకుని ధూమకుడూ అతడి మిత్రులూ పొదల మాటున దాక్కుంటూ కొండమలుపు కేసి పోసాగారు. ప్రస్తుతానికి ప్రమాదం తప్పిందన్న నమ్మకం ఆ ముగ్గురికీ ఎంతో ఉత్సాహం కలిగించింది. సోమకుడు, విరూపుడి భుజం తడుతూ, "విరూపా! ఆ దుష్టుల్ని భలే హడల కొట్టావ్ చూడు, వాళ్ళెలా వణికిపోతున్నారో," అన్నాడు.

ముందు నడుస్తున్న ధూమకుడు మొసలి మనుషుల కేసి ఓ మారు చూసి, "వీళ్ళ మాట సరే. ఆ రెండో ముఠా ఏమయింది?" అంటూ తాము దిగి పారిపోయి వచ్చిన మహావృక్షాని కేసి చూశాడు. ఆ క్షణంలోనే



అతడి శరీరం భయంతో కంపించిపోయింది. మొసలిమనుషుల రెండో ముఠా వాళ్ళిద్దరు ఆ వృక్షం చిటారుకొమ్మల మీద నిలబడి, ఎండపొడ పడకుండా కళ్ళకు చేతులడ్డం పెట్టుకుని, అంత ఎత్తు నుంచి సూటిగా తమ కేసే చూస్తున్నారు.


"సోమూ, విరూపా. మనం ఎక్కడున్నామో వాళ్ళకు తెలిసిపోయింది. క్షణంలో ఆ రెండుముఠాలూ ఏకమై మనను చుట్టుముడతారు. ఆ చిటారుకొమ్మల్లో వున్న దుర్మార్గులిద్దర్నీ చూశారా?" అన్నాడు ధూమకుడు.

ధూమకుడు మాట ముగించేలోపలే, కొమ్మల్లో వున్న మొసలిమనుషు లిద్దరూ పోలోమంటూ పెద్ద కేక పెట్టి, "పులీ లేదు గిలీ లేదు, భయపడకండి. ఆ దుష్టులు ముగ్గురూ కొండముచ్చుల్లా పొదల వెనక దాక్కొని వున్నారు. వాళ్ళు కొండమలుపు తిరిగి కీకారణ్యంలోకి పారిపోకుండా, ఇక్కడే చుట్టుముట్టి పట్టుకోండి," అన్నారు.

"అమ్మా, రాక్షసబ్బంటుల్లారా! మీరు మమ్మల్ని కనిపెట్టే వున్నారన్న మాట. ఆ ఇద్దర్నీ ఒకే బాణంతో కింద పడకొడతాను," అంటూ సోమకుడు విల్లంబు ఎక్కుపెట్టాడు.

"ఇద్దరో ఒకడో......ముందు బాణం వదులు. వాళ్ళు హడలుకుని చెట్టు దిగుతారు. అప్పుడు మనల్ని ఎత్తు నుంచి చూసి, మనం పారిపోయే దారి తతిమ్మా వాళ్ళకు చెప్పేవాళ్ళు వుండరు," అంటూ ధూమకుడు, సోమకుణ్ణి తొందరపెట్టాడు.

ఈ లోపల సోమకుడు గురి చూసి బాణం వదలనే వదిలాడు. అది కొమ్మల్లో వున్న ఒక మొసలి మనిషి గుండెల్లో బలంగా నాటింది. వాడు కెవ్వుమని అరుస్తూ, కింద పడబోయే సమయంలో ఆధారం కోసం ఎగిరి, పక్కనున్న రెండవవాడి నడుం పట్టుకున్నాడు. ఆ వూపుకు ఆ రెండవవాడు



చేతుల్లో వున్న చెట్టుకొమ్మ పట్టుజారి, గాయపడిన వాడితోపాటు, అంత ఎత్తు నుంచి దభీమంటూ కింద పడిపోయాడు.

"ఒక్క వేటుకు రెండు పక్షులంటే, యిదే సాముదొరా!" అంటూ విరూపుడు ముంచుకొస్తున్న ప్రమాదాన్ని మరిచిపోయి, ఉత్సాహంగా కేకపెట్టాడు.

"పరిగెత్తండి. కొండమలుపు తిరిగితే కీకారణ్యం. అక్కడికి పారిపోగలిగామంటే, యిక మనని యీ రాక్షసబ్బంట్లు పట్టుకోలేరు. మన దారిని అడ్డగించకుండా, వెనక నుంచి ఈటెవేటు దూరంలోకి రాకుండా మాత్రం, మనం వాళ్ళను ప్రతిఘటించాలి," అన్నాడు ధూమకుడు.

కొండమలుపు కేసి బాగా నలిగిన కాలిబాట ఒకటున్నది. ఆ బాట తొక్కినవాళ్ళు కాలకలి రాక్షసుడిబంట్లు. వాళ్ళు గూడేల మీద పడి జనాన్ని పట్టుకుపోయేందుకు వచ్చినప్పుడల్లా, యీ ప్రాంతాలనే నదిని దాటుతూంటారు. ధూమకుడూ అతడి మిత్రులూ ఆ బాట వెంట కొండమలుపు కేసి పరిగెత్తసాగారు. ఆ మలుపులోనే శత్రువుల పడవ నది ఒడ్డునున్న పెద్ద చెట్టుబోదెకు బలమైన మోకుతో బంధించబడి వున్నది.



ధూమకుడు వూహించినట్టు శత్రుముఠాలు రెండూ ఏకమై వాళ్ళ వెంటబడలేదు. వాళ్ళల్లో ఒక ముఠా కొండమలుపు కేసి పరిగెత్తసాగింది. అక్కడ ధూమకుడూ వాళ్ళ దారిని అటకాయించాలని వాళ్ళ ప్రయత్నం. ఇక రెండవ ముఠా వెనక నుంచి కాలిబాట వెంట వాళ్ళను తరుముకురాసాగింది.

ధూమకుడు యీ రెండు గుంపుల్లో దేనికి చిక్కకుండా కొండ ఎక్కి పారిపోయే మార్గం ఏదైనా వున్నదేమో అని చుట్టూ కలయచూశాడు. అది సాధ్యమయేలా అతడికి కనిపించలేదు.

ఆ ప్రాంతాల కొంత భాగం పెద్ద పెద్ద రాళ్ళతో, పొదలతో కాలు మోపేందుకే వీలులేకుండా వున్నది. ఇక వున్న చోటునే నిలిచి శత్రువులతో పోరాడటం తప్ప ధూమకుడికి మరో మార్గం తోచలేదు.


"సోమూ, మనము వెనక నుంచి తరుముకు వస్తున్న వాళ్ళ మీద బాణాలు వదులు. నేనూ, విరూపుడూ ముందుండి వాళ్ళు విసిరే ఈటెలు నీకు తగలకుండా చూస్తుంటాం," అన్నాడు ధూమకుడు.

సోమకుడు చప్పున మోకాలి మీద వంగి, విల్లంబు ఎక్కుపెట్టి పరిగెత్తుకు వస్తున్న మొసలిమనుషుల్లో ఒకణ్ణి కొట్టాడు. బాణం తగలగానే వాడు ఒక దాపు కేక పెట్టి కింద పడిపోయాడు. అదే అదనుగా సోమకుడు మరొక బాణంతో ఇంకో శత్రువును కొట్టాడు. కాని, యీసారి బాణం మొసలిమనిషి గుండెల్లో కాకుండా, భుజంలో గుచ్చుకున్నది. వాడు కెవ్వున అరిచి చతికిల బడ్డాడు. మొసలిమనుషులు భయపడి కాలిబాట వదిలి తుప్పలచాటుకు పరిగెత్తారు.

"సోమూ, విరూపా! కొండమలుపులో మనను అటకాయించేందుకు పరిగెత్తుతున్న దుర్మార్గుల మీదా యిదే మంత్రం ప్రయోగించాలి. ఏవి, శత్రువులు మన మీద విసిరిన ఈటెలు?" అంటూ ధూమకుడు ఆ ప్రాంతాల పడివున్న ఈటెలు రెండు తీసుకుని ముందుకు పరిగెత్తసాగాడు. విరూపుడూ, సోమకుడూ కూడా కొన్ని ఈటెలు తీసుకుని అతణ్ణి అనుసరించారు.

ఆ సరికి మొసలిమనుషుల్లో రెండో ముఠా కొండమలుపును చేరింది. వాళ్ళు ఈటెలు పైకెత్తి ఆడిస్తూ, "లొంగిపొండి! మిమ్మల్ని చంపకుండా కాలకలి రాకాసేంద్రుడి పాతాళదుర్గానికి తీసుకుపోతాం. అలా చేయకపోయారో యివ్వాళతో మీకు భూమ్మీద నూకలు నిండుకున్నట్టే," అంటూ కేకలు వేశారు. —(ఇంకావుంది)






# పాతాళదుర్గం

## 12

[ధూమకుడూ అతని మిత్రులూ దాగివున్న చెట్టును మొసలిమనుషులు చూశారు. వాళ్ళు తమను సమీపించే ముందే, ధూమకుడూ వాళ్ళు చెట్టు దిగి కొండమలుపు కేసి పరిగెత్త సాగారు. వాళ్ళను పట్టుకునేందుకు శత్రువులు వెంటబడ్డారు. వాళ్ళల్లో ఒక ముఠా యీటెలు పట్టుకుని ఎదురుగా వచ్చి, లొంగిపోవలసిందిగా కేకలు వేశారు. —తరవాత]

ధూమకుడు ఏ మాత్రం భయపడక ఒక సారి వెనక్కు తిరిగి చూశాడు. చావగా మిగిలిన మొసలిమనుషులు తిరిగి కాలి బాట పట్టుకుని వాళ్ళ వెన్నంటి పరిగెత్తుకు వస్తున్నారు.

"స్వామీ, యీ వెనక వచ్చే దుర్మార్గుల పని నే పడతాను. నువ్వూ, విరూపుడూ ఆ కాకిగోల చేస్తున్న వాళ్ళ మీద బాణాలూ, ఈటెలూ ప్రయోగించండి," అని హెచ్చరించి ధూమకుడు ఈటె ఎత్తి మొసలి మనుషుల మీదికి బలంగా విసిరాడు. ఈటె తమ కేసి రావటం చూస్తూనే, వాళ్ళు ఒక్క కేకపెట్టి, మళ్ళీ కాలిబాట వదిలి పక్కలకు పరిగెత్తారు. ఈ లోపల సోమకుడూ, విరూపుడూ వదిలిన ఆయుధాలు కొండమలుపులో పడప దగ్గిర వున్న మొసలి మనుషుల మీదికి వెళ్ళిపడినై. "ఆః, ఎంత సాహసం!" అంటూ మొసలిమనుషుల్లో



ఒకడు పెద్దగా అరిచాడు. వాడు బాగా ఒడ్డూపొడుగూ వున్నాడు; వాడు ఆ ముఠా నాయకుడు.

"ఊఁ చంపండి, నరకండి! ముందుకు దూకండి! ఏం భయంలేదు, నేనిక్కడే వుంటాను," అంటూ వాడు కేకలు పెట్టాడు. మొసలిమనుషులు ఈటెలు బారుచేసి దూముకుతూ వాళ్ళ కేసి దూకబోయేంతలో, కొండమలుపు నుంచి భిల్లులు కొందరు రణగొణ ధ్వని చేస్తూ వాళ్ళ మీదికి పరిగెత్తుకు రాసాగారు.

"మోసం, చచ్చాం, ఘోరం, ప్రమాదం, రాక్షసేంద్రులవారికీ, జై! అంతా మోకు పట్టుకుని పడవ మీదికి చేరండి. దారి చూపేందుకు ముందు నన్ను పోనివ్వండి," అంటూ మొసలిమనుషుల నాయకుడు చెట్టుకు కట్టివున్న పడవ మోకును పట్టుకుని వేళ్ళాడుతూ, పడవ కేసి పోసాగాడు. అతడి అనుచరులు ఒకళ్ళనొకళ్ళు పక్కకు తోసుకుంటూ వెళ్ళి మోకు పట్టుకుని, కోతుల్లా వేళ్ళాడుతూ పడవ దగ్గరకు బయలుదేరారు.

"ఆ మోకు నరకండి! ఈ దుర్మార్గులకు నీటి చావే తగిన శిక్ష!" అంటూ భిల్లుల్లో నుంచి ఒకడు కేక వేశాడు. ఆ కేక వేసినవాడు భిల్లనాయకుడైన పులిందుడు. మరుక్షణం భిల్లుల్లో ఒకడు ముందుకు దూకి, చెట్టుబోదెకు కట్టి వున్న మోకును ఒక్క వేటుతో నరికాడు. మొసలిమనుషులు ఆహాకారాలు చేస్తూ, నదీజలంలో పడ్డారు. అంతవరకూ కదలకుండా బంధించి వుంచిన మోకు తెగిపోవటంతో, పడవ ప్రవాహవేగానికి చప్పున ఒక పక్కకు ఒరిగిపోయింది. పడవలో నుంచి ఒక స్త్రీ కంఠం "రక్షించండి!" అంటూ పెద్దగా ఆర్తనాదం చేసింది.


ఆ ఆర్తనాదం వింటూనే పులిందుడు ఎగిరి గంతేసి, "ఆ కేకలు పెడుతున్నది

నా చిన్న పెళ్ళాం. పడవ మునిగిందో చచ్చి పోతుంది. ఎలాగైనా పడవను పట్టుకోవాలి. వెళ్ళి తెప్పలు తీసుకురండి," అంటూ తన అనుచరులను ఆజ్ఞాపించాడు.

ఇంతలో ధూమకుడూ అతడి మిత్రులు నది ఒడ్డుకు చేరారు. వాళ్ళను చూసి పులిందుడు పొందిన ఆనందం అంతా యింతా కాదు. అతడు పరుగు పరుగున ముందుకు వచ్చి ధూమకుణ్ణి కావిలించుకుంటూ, "ధూమకదొరా! నా చిన్న పెళ్ళాం యీ పడవలోనే బంధించబడి వుంది. రక్షించమని కేకలు వేస్తున్నది. మనం పడవను పట్టుకోవటం ఎలా?" అని ప్రశ్నించాడు.

ధూమకు డొసారి పడవ కేసి చూశాడు. మొసలిమనుషుల్లో కొందరు ఈదుతూ, ప్రవాహవేగానికి మునుగుతూ తేలుతూ పడవను వాటి ముందుకు కొట్టుకుపోతున్నారు. మరికొందరు ఆయాసపడుతూ పడవ కేసి ఈదుకు పోతున్నారు.

"పులిందా, నీవు చెట్టుకు కట్టి వున్న పడవ మోకును నరకవలసింది కాదు. ఆ మోకుతో మనం పడవను ఒడ్డుకు లాగే పని. రాక్షసబ్బంట్లు చాలామంది నది వాలుకు కొట్టుకుపోయి మునిగిచావటం ఖాయం. పడవ కేసి ఈదుకుపోయే కొద్ది



మంది దాన్ని చేరగలరన్న నమ్మకం నాకు లేదు. ఇంతకూ పడవలో ఒక్కగా నొక్కడైనా లేకుండా అంతా ఒడ్డు కెలా వచ్చేశారు?" అంటూ ధూమకుడు మాట్లాడుతున్నంతలో, పడవ లోపలి గదుల్లో నుంచి పొట్టిగా వామనుడిలా వున్న రాక్షసుడొకడు గెంతుతూ పడవ చుక్కాని వద్దకు వచ్చాడు. వాడు చుక్కాని చేత పట్టుకుని అటూ యిటూ గుంజగానే పడవ ఊగటం మాని, ఎప్పటిలా నీళ్ళ మీద తేలసాగింది.

పొట్టిరాక్షసుడు పళ్ళుకొరుకుతూ ఒకసారి ఒడ్డు నున్న ధూమకుడూ వాళ్ళ కేసి చూసి, దాపుల నున్న తెప్ప తీసుకుని, దానితో పడవ



కేసి యీదుకు వస్తున్న మొసలిమనుషుల్లో ఒకడి తల మీద గట్టిగా కొట్టి, "పొండి చవటల్లారా, దూరంగా పొండి. మీకూ, కాల కలిగాడికీ ఒక్క దణ్ణం. పడవ నాది, పడవలో వున్న భామామణి నాది. మేం యిద్దరం యీ మహారణ్యంలో ఎక్కడో ఒక మారుమూల కొంప కట్టుకుని, ఎవరి గొడవా లేకుండా హాయిగా బతుకుతాం," అన్నాడు.

ఆ మాటలు వింటూనే పులిందుడు ఉగ్రుడై పోయి, "ఒరే, దుర్మార్గుడా! మొగుణ్ణి నేను బతికుండగానే, నా పెళ్ళాన్ని మారుమనువు కట్టుకుంటావా?" అంటూ నదిలో దూకి పడవ కేసి ఈదబోయాడు.

కాని, విరూపుడు చప్పున అతణ్ణి పట్టుకుని బయటికిలాగి, "తొందరపడకు పులిందా. ఇప్పుడు నీవు ఒంటరిగా పడవ దగ్గిరకు పోవటం అంటే, ఆ రాక్షసుడి చేతిలో చావటమే. మన తెప్పలు రానియ్, పడవను వెంటాడి, ఆ రాక్షసుణ్ణి హతమార్చి నీ పెళ్ళాన్ని కాపాడదాం," అన్నాడు.

పొట్టి రాక్షసుడు గాడిద ఓండ్ర పెట్టినట్టుగా పెద్దగా ఓసారి నవ్వి, "ఒకళ్ళనొకళ్ళు మోహించి పెళ్ళాడటం మాకు మనుపవుతుందిరా, మనిషీ?" అని తెడ్డుతో పడవను సమీపించబోతున్న మరొక మొసలి మనిషి నెత్తిన బలంగా కొట్టి, పడవను నీటివాలుకు తిప్పాడు.


"పోయె, నా చిన్న పెళ్ళాం, చేజారి పోయె!" అని అరుస్తూ పులిందుడు మళ్ళీ నీట్లో దూకబోయేంతలో విరూపుడు అతడి నడుం పట్టుకుని వెనక్కులాగాడు. ఈలోపల సోమకుడు బాణం ఎక్కుపెట్టి రాక్షసుడి మోకాలి చిప్పకు గురిచేసి కొట్టాడు. బాణం మోకాలికి తగలగానే రాక్షసుడు చుక్కాని వదిలి రెండు చేతులతో మోకాలు పట్టుకుని పడవ మీద పడి పోయాడు.

"అదీ కొట్టవలసిన దెబ్బ! వాడు చావడు, పడవనూ అంత వేగంగా యిష్టం వచ్చిన

వైపుకు నడవలేదు, ఛలే!" అన్నాడు ధూమకుడు.

నీటిలో సుడిగుండంలాంటి దాంట్లో చిక్కుకుని పడవ గిర్రున తిరగసాగింది. పొట్టిరాక్షసుడు లేచి నిలబడి, మోకాల్లో దిగిన బాణాన్ని లాగి దూరంగా విసిరివేసి, కుంటుతూపోయి మళ్ళీ చుక్కాని పట్టుకుని పడవను నీటి వాలు కేసి తిప్పాడు. అంతలో భిల్లులు తెడ్లువేసి నడుపుతున్న రెండు తెప్పలు అటు కేసి వచ్చినై. ఆ రెండూ యింతకు ముందు ధూమకుడూ అతడి అనుచరులకు నది దాటటానికి సహాయ పడిన తెప్పలే. వాటిల్లో ఒక దాని మీద నల్ల గరుడపక్షి కూడా వున్నది.


తెప్పలు రెండూ తీరానికి రాగానే ధూమకుడూ, విరూపుడూ ఒక దాని మీదికి ఎగిరి దూకారు. సోమకుడూ, పులిందుడూ మరో దాని మీదికి ఎక్కారు. పులిందుడు తీరంలో వున్న తన భిల్లానుచరులతో, రాక్షసుడి పడవకు తగలకుండా, దాని వేగాన్ని తగ్గించేందుకు మాత్రం, దాని కేసి రాళ్ళు విసర మన్నాడు. "పడవకు దెబ్బ తగిలి అది నదిలో మునిగిందో, మిమ్మల్ని నిలువునా చీల్చేస్తాను," అని హెచ్చరించాడు పులిందుడు వాళ్ళను.



బలంగా తెడ్లువేసి పడవను వెంట తగలమని ధూమకుడు భిల్లులను హెచ్చరించి, పులిందుడితో, "పడవ మునిగినా ఫరవా లేదు, మనం ఆ పొట్టిరాక్షసుణ్ణి ప్రాణాలతో పట్టుకోగలిగితే చాలు. వాణ్ణించి మనం కాలకలి వుండే పాతాళదుర్గానికి దారి తెలుసుకోవచ్చు," అన్నాడు.

"పడవ మునిగితే, నా చిన్న పెళ్ళాం గతేం కాను!" అన్నాడు పులిందుడు వణుకుతున్న గొంతుతో.

"ధూందొరా! పడవలో కాలశంబర మాంత్రికదొర కూడా ఖైదీగా వున్నాడని నా అనుమానం. మనం పడవను చెక్క




చెదరకుండా పట్టుకోవాలి. పొట్టిరాక్షసుణ్ణి మనం నలుగురం మీద పడి పట్టుకోవటం ఏమంత పని?" అన్నాడు విరూపుడు.

పడవ నదీ వాలున పడి వేగంగా పోతున్నది. రాక్షసుడు తనను వెంబడిస్తున్న వాళ్ళ ఎత్తుగడ తెలిసినవాడిలా, చుక్కానిని నైపుణ్యంగా కదిలిస్తూ, పడవను వాళ్ళ కందకుండా నడుపుతున్నాడు. కాని, ఈలోపల పులిందుడి అనుచరులు నది పక్కనే వున్న కొండగుట్టల మీది నుంచి పెద్దపెద్ద రాళ్ళను పడవ కేసి విసరసాగారు. ఆ రాళ్ళు పడవ ముందూ, పక్కలనా పడి నీటిని అల్లకల్లోలం చేస్తున్నవి. పడవను ముంచేందుకే వాళ్ళా పని చేస్తున్నారని భయపడ్డాడు రాక్షసుడు.

క్రమక్రమంగా పడవకూ, తెప్పలకూ మధ్యనున్న దూరం తగ్గసాగింది. పులిందుడి అనుచరులు పడవ కేసి బండరాళ్ళు విసురుతూనే వున్నారు. ఇక పడవను పట్టుకోవటం క్షణాల మీద జరిగిపోతుంది అన్న ధైర్యంలో వున్నారు, ధూమకుడూ అతడి అనుచరులు. విరూపుడు ఎంతో ఉత్సాహంగా నల్ల గరుడపక్షిని సమీపించి చిటికెలు వేశాడు. అది తల వంచి బుసకొట్టుతున్నట్టు సన్నగా ఈల వేసింది.

"ఈ గరుడుణ్ణి కాస్త మాలిమి చేసుకుంటే, ఆ పొట్టిరాక్షసుడి తల భుజాల మించి ఎగిరిపోయేలా దీనిచేత దెబ్బ కొట్టించవచ్చు," అన్నాడు విరూపుడు. అంతలో భిల్లులు విసిరే రాళ్ళలో ఒకటి గురితప్పి వచ్చి విరూపుడున్న తెప్పకు తగిలింది. ఆ దెబ్బకు తెప్ప తలకిందులై పోయింది. విరూపుడూ, ధూమకుడూ, భిల్లులిద్దరూ నీళ్ళలో పడి తెప్ప తిరిగి నీటిపైకి లేవగానే దాని మీది కెక్కారు. గరుడపక్షి కూడా నీళ్ళల్లో పడి రెక్కలల్లల్లాడిస్తూ లేచి విరూపుడి భుజాల మీద వాలింది. విరూపుడు సంతోషంతో మైమరిచిపోయాడు.



హఠాత్తుగా నీటి వేగం హెచ్చింది. అంతే కాక నదిలో అక్కడక్కడా పెద్దపెద్ద గండ శిలలు కనిపించినై. పాట్టిరాక్షసుడు ఆ శిల లకు పడవ తగలకుండా నేర్పుగా దాన్ని నడుపుతున్నాడు. పులిందుడి అనుచరులు యింకా రాళ్ళు విసురుతూనే వున్నారు.


"ఈ సమీపంలోనే నది ఎత్తు నుంచి కిందికి జలపాతంలా దూకుతుందని నా అను మానం. అందువల్లనే నీటి ఉరవడి ఎక్కు వైంది. మనం తెప్పలను ఒడ్డు కేసి నడ పటం మంచిది," అన్నాడు విరూపుడు.

"ఆ రాక్షసుడి మాటేమిటి? నా చిన్న భార్య ఏం కాను?" అంటూ పులిందుడు ఆక్రోశించాడు.

"వాడూ యీ దాపులనే ఎక్కడో ఒడ్డు చేరక తప్పదు. లేకపోతే..." అంటూ విరూపుడు ఏమో చెప్పబోయేంతలో, పడవ నదిలో వున్న ఒక రాతికి తగిలి ఫెళఫెళ మంటూ పగిలి ఛిన్నాభిన్నమై పోయింది.

పాట్టిరాక్షసుడు నీటిలో దూకి యీదుతూ, పగిలిన పడవ నుంచి నదిలో పడి మునక లేస్తున్న ఒక స్త్రీని సమీపించి పట్టుకుని, భుజాన వేసుకుని వడివడిగా ఒడ్డు కేసి ఈదుకు పోసాగాడు.

"తెప్పల్ని త్వరగా ఒడ్డుకు నడపండి," అని ఆజ్ఞాపించాడు ధూమకుడు. భిల్లులు వాటిని ఒకటి రెండు నిమిషాల తరవాత ఒడ్డు చేర్చారు. కాని, పాట్టిరాక్షసుడు యీలోపల నీటి వాలున చాలా దూరం ఈదుకు పోయి, అక్కడ ఒడ్డు చేరాడు. ధూమకుడూ వాళ్ళూ వున్న చోటుకూ, రాక్షసుడున్న ప్రదేశానికీ మధ్య ఒక శిథిల మైన దేవాలయం వున్నది. దాని ఆవరణలో ఒత్తుగా పెరిగివున్న వృక్షాల మీద కొన్ని నరవానరాలూ, ఎలుగుబంట్లూ కొమ్మలను పట్టుకుని ఊగుతున్నవి. వాటిల్లో ఒక పెద్ద నరవానరం అరుస్తూ ధూమకుడూ వాళ్ళ కేసి రాసాగింది. —(ఇంకావుంది)





# పాతాళదుర్గం

## 13

[పాల్గిరాక్షసుడు పడవను నదివాలు కేసి నడిపాడు. భిల్లులు దాని మీద రాళ్ళు విసర సాగారు. పడవ నదిలో వున్న గండశిల కొక దానికి తగిలి బద్దలైపోయింది. పాల్గి రాక్షసుడు ఒక స్త్రీతో సహా ఒడ్డుకు చేరాడు. ధూమకుడూ వాళ్ళు కూడా ఒడ్డు చేరేంతలో, శిథిలదేవాలయం నుంచి ఒక పెద్ద నరవానరం వాళ్ళ పైకి రాసాగింది. తరవాత—]

ధూమకుడు అందరికన్న ముందున్నాడు. అతడు తమ పైకి వస్తున్న నరవానరం కేసీ, దాని వెనక చెట్లమీద వున్న యితర మృగాల కేసీ ఓమారు చూశాడు. చెట్టు కొమ్మల్లో వున్న చిన్నాపెద్ద నరవానరాలూ, ఎలుగుబంట్లూ—అన్నీ కళ్ళప్పగించి తమ వైపే చూస్తున్నట్టు అతడు గ్రహించాడు.

"విరూపా! ఇది వింతగా లేదా? మనిషంటే ఎంతటి క్రూరమృగమైనా భయపడి పారిపోతుంది. కాని, వీటి ప్రవర్తన అందుకు భిన్నంగా వుంది. బహుశా, యీ మృగాలు యీనాటివరకూ మానవమాత్రుణ్ణి చూసి వుండవేమో," అన్నాడు ధూమకుడు.

విరూపుడు, ధూమకుడి మాటలేవీ ఆలకించటం లేదు. అతడు తన భుజం మీద వున్న నల్ల గరుడపక్షిని దువ్వుతూ, ఒక్కొక్క అడుగే ముందుకేస్తూ, వికృతంగా అరుస్తున్న నరవానరం కేసి చూడసాగాడు. సోమకుడు



బాణం ఎక్కుపెట్టి, ధూమకుడి ఆజ్ఞ కోసం ఎదురు చూస్తున్నాడు. పులిందుడు యివేమీ గమనించటం లేదు, అతడి దృష్టి నదికి కొంచెం దిగువగా ఒడ్డు చేరిన పొట్టిరాక్షసుడి పైనా, అతడి పక్కనే నీటి ఒడ్డున సొమ్మసిల్లి పడివున్న స్త్రీమీదా వున్నది. ఇక, తెప్పలను నడిపిన నలుగురు భిల్లులూ భయంతో వణికిపోతూ, తమ నాయకుడు ఊఁ అంటే నదిలో వున్న తెప్పల మీదికి పారిపోయేందుకు సిద్ధంగా వున్నారు.

ధూమకుడు నిర్భయంగా నిలబడి నరవానరాని కేసి ఈటె గురిచేసి, సోమకుణ్ణి బాణం వదల వద్దని వారిస్తూ, "ఈ వానరం ఆ చెట్ల మీద వున్న మృగాలకన్నిటికీ నాయకుడులా వున్నది. దీన్ని చంపామో, అవన్నీ మన మీద వచ్చి పడొచ్చు. దీన్ని భయపెట్టి తరుముదాం. శిథిలాలయంలో మరెన్ని మృగాలున్నవో తెలియదు," అన్నాడు.


ఇంతలో పులిందుడు ఒక పెద్ద గావుకేక పెట్టి, తెప్పల కేసి పరిగెత్తుతూ, "ఆ పొట్టి రాక్షసపు వెధవ నా పెళ్ళాన్ని తీసుకుని అరణ్యంలోకి పారిపోబోతున్నాడు. ఇక్కడ మనకేం పని? ముందు ఆ దుర్మార్గుణ్ణి పట్టుకుని, నా పెళ్ళాన్ని వాడి చెర నుంచి విడిపించాలి," అన్నాడు.

భిల్లనాయకుడైన పులిందుడి మాటలు ధూమకుడికి సబబుగానే కనిపించినై. తాము పొట్టిరాక్షసుణ్ణి పట్టుకుంటే, అతడి ద్వారా మహాకలిని గురించిన ఎన్నో రహస్యాలు తెలుసుకోవచ్చు. రాజకుమార్తె కాంతిసేనను వెతికి తెచ్చే బాధ్యత మీద వేసుకున్నది తనూ, సోమకుడూ. ఆ ప్రయత్నంలో పులిందుడూ, విరూపుడూ తమకు సాయం చేయాలంటే, పులిందుడికి అతడి పడుచు భార్యను తిరిగి సంపాదించేందుకూ, విరూపుడికి మాంత్రికుడైన కాలశంబరుడి యోగక్షేమాలు తెలుసుకునేందుకూ తాము తోడ్పడక తప్పదు...

"పులిందా, ఆగు! మేమూ వస్తున్నాం. అనవసరంగా యీ అడవి మృగాలతో గిల్లికజ్జాలు పెట్టుకోవటం ఎందుకు? తెప్పల మీద పోయి, ఆ రాక్షసుడున్న చోటనే తీరం చేరుదాం. వాడు, యీలోపల అరణ్యంలోకి ఎంతో దూరం పారిపోలేడు," అన్నాడు ధూమకుడు.


ఆ వెంటనే అందరూ తెప్పల కేసి బయలుదేరారు. ధూమకుడూ, సోమకుడూ మాత్రం నరవానరానికి వెన్ను చూపక, జాగ్రత్తగా వెనక్కు నడవసాగారు. కాని, వాళ్ళావిధంగా తెప్పల కేసి పోవటం చూస్తూనే, నరవానరం రొమ్ము చరుచుకుని భయంకరంగా అరిచి కుప్పిగంతేసి ముందుకు దూకింది. చెట్ల మీద వున్న మృగాలన్నీ బిలబిల మంటూ కొమ్మల మీంచి కిందికి దూకి ధూమకుడూ వాళ్ళ కేసి పరిగెత్తుకు రాసాగినై.

ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. వెన్నిచ్చి పరిగెత్తటం ప్రారంభిస్తే, తాము తెప్పలను చేరకముందే నరవానరాలూ, ఎలుగుబంట్లూ తమ మీదికి వచ్చి పడతై. అలాకాదని నిలబడి దెబ్బ తీయాలని చూసినా, యిన్ని క్రూరమృగాలను ఎదిరించి జయించటం సాధ్యమయే పనికాదు...



ధూమకుడిలా ఆలోచిస్తూ, పక్కకు తిరిగి సోమకుడితో ఏదో చెప్పబోయేంతలో, వెనక్కు అడుగులేస్తున్న సోమకుడు కాలు జారి ముందుకు తూలాడు. అది చూస్తూనే నరవానరం అతడి కేసి దూకబోయింది. కాని, యింతలో విరూపుడు పెద్దగా, "అష్ట, శాంభవీ!" అంటూ బొబ్బరించి, "కాల గరుడా! నీ కాలిబలం, ముక్కు వాడి చూపించు! అందుకు యిదే మంచి తరుణం," అంటూ భుజం మీద వున్న నల్ల గరుడపక్షిని, నరవానరం కేసి విసిరాడు.

గరుడపక్షి రెక్కలు చాచి లేస్తూనే మెరుపులా పోయి నరవానరం తల మీద



బలంగా ఒక్క తన్ను తన్నింది. వానరం ఆ తన్నుకు వెల్లకిలాపడి అరుస్తూ లేచి, గరుడపక్షి కేసి చేతులు చాచబోయేంతలో, పక్షి అంత ఎత్తునుంచి రెక్కలు టపటప లాడిస్తూ వచ్చి, వానరం మెడమీద గట్టిగా ఒక దెబ్బ కొట్టింది.


ఆ దెబ్బకు నరవానరం ఎగిరి అల్లంత దూరానవున్న రాళ్ళమీద పడి, పల్లానికి దొర్లుకుపోయింది.


తమ నాయకుడు మట్టికరవటం చూస్తూనే, తతిమ్మా మృగాలు ఎక్కడి వక్కడ నిలిచిపోయాయి. అదే అదనుగా ధూమకుడూ అతడి అనుచరులూ పరిగెత్తుకుంటూ పోయి తెప్పలను చేరారు. అందరి కన్న వెనకగా తెప్ప ఎక్కినవాడు, విరూపుడు. అతడు, ఈలలు కొడుతూ, చిటికెలు వేస్తూ, నల్ల గరుడపక్షిని తిరిగి పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. కాని, గరుడపక్షి ఎగురుతూపోయి, శిథిల దేవాలయం మీద కొద్దిసేపు కూర్చుని, కీ అని అరుస్తూ లేచి, గాయపడిన నరవానరం చుట్టూ చేరిన మృగాల తలల మీదుగా రివ్వు రివ్వుమని ఎగరసాగింది.

"విరూపా! ఆ పక్షి యిక నీదికాదు, దాని సంగతి మరిచిపో. అది మనకు చేయగల సహాయం ఏదో చేసింది. మనం తీరం వెంట పోయి, ఆ పొట్టి రాక్షసుణ్ణి చేజిక్కించుకోవాలి," అన్నాడు ధూమకుడు.

విరూపుడు యింకా ఆశగా గరుడపక్షి కేసి చూస్తున్నాడు. దాని కాలి నుంచి అతడు కట్టిన దారు కిందికి జీరాడుతూనే వున్నది. "అది, నా పెంపుడు పక్షి. నన్ను వదిలిపోదు, చూస్తూండండి...నా చిన్న బాబువుకదూ, కాలగదురా, యిటురా!" అంటూ విరూపుడు చప్పట్లు చరిచి కేకలు వేయసాగాడు.

తెప్పలు రెండూ ముందుకు కదిలినై. పులిందుడు తన అనుచరులను త్వరగా


CHITRA



తెప్లు వేయమని తొందరపెడుతున్నాడు. తాము సమీపించే లోపలే పొట్టిరాక్షసుడు, తన పడుచు పెళ్ళాన్ని ఎత్తుకుని అరణ్యం లోకి పారిపోతాడని పులిందుడికి చెడ్డ భయంగా వున్నది.

కాని, పొట్టిరాక్షసుడు పారిపోయే ప్రయత్నం ఏమీ చేయకపోగా, తన వెంట వున్న స్త్రీ భుజాల మీద చేయివేసి చిరునవ్వు నవ్వుతున్నాడు. అంతేకాక తానున్న ప్రదేశాన్ని సమీపిస్తున్న తెప్పలను ఆవిడకు చూపిస్తూ, వేలితో పులిందుణ్ణి ప్రత్యేకంగా గుచ్చెత్తి చూపి ఏదో అడిగాడు. స్త్రీ ఏమో చెప్పి నవ్వింది. పొట్టిరాక్షసుడు పొట్ట చెక్కలయేలా నవ్వుతూ తీరం వెంట కొంత దూరం ముందుకు పరిగెత్తుకుంటూ వచ్చి, "మీరు వస్తున్నది నన్ను పట్టుకోవటానికా, నా పెళ్ళాన్ని పట్టుకోవటానికా?" అని కేక వేసి అడిగాడు.

తెప్పల్లోవున్న అందరి దృష్టి, పులిందుడి కేసి మళ్ళింది. పులిందుడు ఒక్క రంకె వేసి రాక్షసుడి మీద కలియబడేందుకు నీళ్ళల్లో దూకి ఒడ్డుకు ఈదుకుపోతాడని వాళ్ళు భావించారు. కాని, పులిందుడిలో ఎలాంటి చలనమూ లేదు. అతడు గుడ్లప్పగించి నది ఒడ్డునున్న స్త్రీకేసి ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"అది నా పడుచు పదోపెళ్ళాం కాదు. నా పెళ్ళాం పడవ మునిగినప్పుడు నదిలో పడి చచ్చిపోయయినా వుంటుంది, లేదా ఆ బుడంకాయ రాక్షసుడు దాని మీద మంత్ర ప్రయోగం చేసి రూపయినా మార్చి వుంటాడు. నా శ్రమ అంతా వృధా అయింది," అన్నాడు పులిందుడు, ఎక్కడ లేని నిరాశా నిస్పృహలు కనబరుస్తూ.

తెప్పలు రాక్షసుడున్న చోటు చేరగానే, ధూమకుడు అందరికన్న ముందు ఒడ్డుకు దూకాడు. రాక్షసుడు స్త్రీతోపాటు ఒడ్డు నుంచి ఒక అరవై అడుగుల దూరం

వెనక్కుపోయి నిలబడి, "మీతో నాకు శత్రుత్వం ఏమీలేదు. ఈ ఆడది మీలో ఎవరి పెళ్ళామూకాదు. దీని కోసమేగదా మీరింత దూరం నా వెంటబడి వచ్చింది? ఇక మీదారిన మీరుపొండి, నా దారిన నేను పోతాను," అన్నాడు.

ఆ మాటలకు ధూమకుడు నవ్వి, "మా మనుషుల్లో ఒక సామెతవుంది; పొట్టివాడికి పుట్టెడు జిత్తులని! నువ్వు రాక్షసుల్లో వామనుడివి, నీ దగ్గిర పది పుట్ల జిత్తులుండవచ్చు. మాకూ నీతో ఎలాంటి శత్రుత్వమూ లేదు. మాకు కావలసిందల్లా, మహాకలిరాక్షసు డుండే పాతాళదుర్గానికి దారి. ఆ దారిమార్గం ఎక్కడో మాకు చెప్పి. నీ దారిన నువ్వుపో, మా దారిన మేముపోతాం," అన్నాడు.

"పాతాళదుర్గానికి వెళ్ళినవా రెవరూ ప్రాణాలతో బయుట పడలేదు. అంత కావా లనుకుంటే, ఆ దారి తెలుసుకుని కాళ్ళరి గెట్టు నడవటం ఎందుకు? ఒకటి రెండు నెలలపాటు యీ ప్రాంతాలే తిరుగుతూం డండి. ఆ మహాకలి రాక్షసుడి బంట్లు వచ్చి మిమ్మల్ని కాళ్ళూ చేతులూ కట్టి, వాడి పాతాళదుర్గానికి మోసుకు పోతారు," అన్నాడు పొట్టిరాక్షసుడు.



"అలా కాదు. ఆ దుర్మార్గుడికి తెలియ కుండా వాడి దుర్గంలో ప్రవేశించి, ఒకానొక రాజకుమార్తెను రక్షించి తేవలసి ఉన్నది," అన్నాడు ధూమకుడు.

"నా పడుచుపెళ్ళాం, భామాసింగి కూడా వాడి చెరలోనే ఉన్నది, అనుమానం లేదు. వాడి నౌకర్లే గదా దాన్ని అరణ్యంలో నుంచి ఎత్తుకుపోయింది? ఆ మహాకలి రాక్షసుడి పీక సరికి, వాడి నెత్తురుతో దాహం తీర్చుకుంటాను," అన్నాడు పులిం దుడు బబ్బలు చరుచుకుంటూ.

పొట్టిరాక్షసుడు మారు మాటాడకుండా, ధూమకుడూ వాళ్ళ దగ్గిరకు వచ్చి, "నేను

యివ్వవలసిన హెచ్చరికేదో యిద్దామని, తరవాత మీ యిష్టం. పాతాళదుర్గానికి వెళ్ళేందుకు దగ్గిర మార్గమేదో మీకు చెపుతాను, అందరూ నా వెంట రండి," అంటూ వాళ్ళను వెంట బెట్టుకుని శిథిలదేవాలయాని కేసి బయలుదేరాడు.

దేవాలయం యింకా కొంచెం దూరంలో వున్నదనగా ధూమకుడు ఆగి, "మనం వెళుతున్నది ఆ దేవాలయ ఆవరణలోకా? అక్కడున్న క్రూరమృగాల మాటేమిటి? ఇంతకు ముందే వాటివల్ల పెద్ద ప్రమాదంలో పడ్డాం," అన్నాడు.

"మీకు సంగతి తెలియక వాటిని రెచ్చగొట్టారు. అవన్నీ రాక్షసజంట్ల పెంపుడు జంతువులు. ఇన్ని అడవికాయలూ, దుంపలూ వాటి కేసి గిరవాటు వేస్తే, అవి పిల్లుల కన్నా సాధుజంతువులై పోతాయి," అంటూ పొట్టిరాక్షసుడు, దాపుల నున్న చెట్ల నుంచి యిన్ని కాయలు కోశాడు. అతడితోపాటు ధూమకుడూ వాళ్ళు కూడా కాయలు కోసి తీసుకుని, శిథిలదేవాలయాన్ని సమీపిస్తూనే, వాటిని అడవిమృగాల మీదికి విసిరివేశారు.

పొట్టిరాక్షసుడు అందరినీ ఆలయంలోకి తీసుకుపోయి, చీకటిగా వున్న కొన్ని గదుల కుండా వాళ్ళను నడిపి, చివరకు బీటలు వారి నేలకూలడానికి సిద్ధంగా వున్న ఒక గోడ మీదికి ఎక్కించి, దిగువ నున్న ఒక కందకాన్ని చూపిస్తూ, "పాతాళదుర్గానికి పోవాలంటే ఒకేఒక మార్గం వున్నది, అదే ఇది!" అన్నాడు.

ధూమకుడూ, అతడి అనుచరులూ తలలు వంచి కందకంలోకి చూశారు. అందులో మొసళ్ళూ, పెద్ద పెద్ద సర్పాలూ వున్నవి. అవి ఒకదాని మీద ఒకటి కలియబడి కుస్తీపట్లు పట్టుతున్నవల్లా, గోడ మీద మనుషులు కనబడగానే, నోళ్ళు తెరిచి పైకి చూడసాగినై. —(ఇంకావుంది)





# పాతాళదుర్గం

## 14

[విరూపుడు నల్లగరుడపక్షి చేత వరవానరాన్ని కింద పడకొట్టించాడు. తరవాత అందరూ తెప్పం మీద పొట్టిరాక్షసుడున్న చోటుకు చేరారు. రాక్షసుడి వెంట వున్న స్త్రీ పులిందుడి భార్యకాదని తెలిపోయింది. రాక్షసుడు వాళ్ళను శిథిలదేవాలయంలోకి తీసుకుపోయి, అక్కడ కందకంలో వున్న పెద్దపెద్ద మొసళ్ళనూ, సర్పాలనూ చూపించాడు. తరవాత—]

ధూమకుడు కందకంలోని మొసళ్ళనూ, సర్పాలనూ కొంచెంసేపు పరీక్షగా చూశాడు. అతడి కొక అనుమానం కలిగింది. శిథిల దేవాలయం ఆవరణలోని చెట్ల మీదున్న మృగాల్లాగే, యివి మహాకలి రాక్షసుడి ఇంట్ల పెంపుడు జంతువులు కాదు గదా? పైగా, పొట్టిరాక్షసుడన్నట్టు, పాతాళదుర్గానికి పోవా లంటే వున్న ఒకే ఒక మార్గం యిదెలా అవుతుంది? వాడేదో తమందరినీ చులకనగా తీసుకుని, అపహేళన పరుస్తూ మాట్లాడుతున్నాడు...

ధూమకుడు యిలా ఆలోచించి, ఒక నిశ్చితానికి వచ్చి, పొట్టిరాక్షసుడి కేసి గుచ్చి గుచ్చి చూస్తూ, "పాతాళదుర్గాన్ని చేరేందుకు, ఈ కందకంలో వున్న జంతువుల మధ్యగా వెళ్ళవలసి వుంటుందన్న నీ మాటలు సత్యంలాగే కనబడుతున్నవి. ఆ మార్గం నీకు బాగా పరిచయం అయిందీ,




అలవాటయింది కూడా గనక, నువ్వు ముందుండి దారి తియ్యి. మేం అందరం నీకు వెనకగా వస్తాం," అంటూ ఈటె పైకెత్తి, పొట్టిరాక్షసుడు వెనక్కు తిరిగి పారిపోయేందుకు వీలులేకుండా అతడి వెన్నుకు ఆనించాడు. అదే క్షణంలో సోమకుడు బాణాన్ని రాక్షసుడి తలకు గురి చేశాడు.

పొట్టిరాక్షసుడు, ధూమక సోమకుల కేసి భయపడుతూ చూసి, "మీరు మాట తప్పుతున్నారు. నాతో ఎలాంటి శత్రుత్వం లేదన్నారు గదా? ఇప్పుడు ఈటే, బాణం నా మీద ప్రయోగించి, నన్నెందుకు చంపాలని చూస్తున్నారు?" అని అడిగాడు.

"నా మొగుణ్ణి చంపకండి. పుటక్కి రాక్షసుడైనా మనుషుల్లో కూడా యింతకన్న మంచివాడూ, నమ్మకస్తుడూ వుండడు. నా మాట నమ్మండి," అంటూ పొట్టిరాక్షసుడి ఆటవిక భార్య ధూమక సోమకుల్ని బతిమాల సాగింది.

"నీ మొగుడి మంచితనం యిదేనా? మేం పాతాళదుర్గానికి మార్గం చెప్పమంటే, మమ్మల్ని యీ క్రూరజంతువులున్న కందకంలో దిగి పొమ్మంటున్నాడు! అందుకే ముందతణ్ణి దిగి దారి చూపెట్టమన్నాను. ద్రోహానికి ద్రోహమే ప్రతీకారం!" అన్నాడు ధూమకుడు, ఈటెను పొట్టిరాక్షసుడి వెన్ను మీద బలంగా అదుముతూ.

పొట్టిరాక్షసుడు ఒక చిన్న కేక పెట్టి, "నీ యీటె సూదికన్నా వాడిగా వున్నట్టుంది, అంత గట్టిగా గుచ్చకు. నీ లాటి మానవ స్త్రీ చెప్పేమాట ఎందుకు నమ్మవు? నేను దుర్మార్గుణ్ణయితే, ఆ మహాకలి రాక్షసుడి సేవలోనే వుండి, నీ బోటి వాళ్ళను కాల్చుకుతింటూ హాయిగా బతికేవాణ్ణి. సరే, మీ అందరికీ కావలసింది పాతాళదుర్గానికి పోయే దారేకదా? ముందే చెప్పాను, మీలో ఏ ఒక్కరూ అక్కణ్ణించి తిరిగి రాలేరు. మీ ఖర్మకు నేనేం చేసేది!"



అంటూ కందకం గోడ మీద గాలికి కిర్రు కిర్రు మంటూ రాసుకుంటున్న చెట్లకొమ్మల్లోంచి ఒక బలమైన తాటి మోకును వెతికి బయటికి లాగాడు.

"మహాకలి రాక్షసుడి ముఖ్య సేవకులు కొద్దిమందికి మాత్రమే, యీ రహస్యం తెలుసు. ఈ మోకు ఆధారంతో కందకం లోకి — ఆ బయిటికి పొడుచుకొచ్చిన రాయి వరకూ దిగి, ఆ రాయిని కాలితో బలంగా నొక్కితే, లోపలి నుంచి ఒక వెడల్పాటి రాతిపలక ముందు కొస్తుంది. దాని మీదికి మీ రందరూ నిర్భయంగా దిగొచ్చు. ఆ రాతిపలక బయటపడే చోట ఒక సొరంగ మార్గం వుంటుంది. దాని వెంటపోతే, మీరు మహాకలి రాక్షసుడు అధికారం చెలాయించే దండకారణ్య ప్రాంతం చేరుతారు. అంత దూరం వెళ్ళిన తరవాత వాడి పాతాళదుర్గం కనుక్కోవటం ఏ మంత కష్టం కాదు. మీలో ఎవరు ముందుగా ఈ మోకు పట్టుకుని కందకంలోకి దిగుతారు?" అని అడిగాడు పొట్టిరాక్షసుడు.

ధూమకుడికి యిందులో ఏదైనా మోసం వుండవచ్చునన్న అనుమానం కలిగింది. రాక్షసుడు చెప్పినట్టు ఆ మోకుతో కందకం గోడలో వున్న సొరంగ మార్గం చేరినా, ఆ దారి తమను సురక్షితంగా దండకారణ్య ప్రాంతం చేరుస్తుందన్న నమ్మకం ఏ ముంది? అంతేకాక మోకు మధ్యలోనే తెగటం జరిగితే, అది పట్టుకుని కందకంలోకి దిగేవాడు మొసళ్ళ నోళ్ళల్లో పడిపోతాడు!

ధూమకుడు, రాక్షసుడి చేతిలో వున్న తాటి మోకు కేసి చూస్తూ, ఏమో అనబోయేంతలో పులిందుడు పెద్దగా గొంతెత్తి, "ధూమకదొరా! ఈ బుడంకాయ రాక్షసుడి మాటలు నమ్మకు. వీడు మాయలమారి. ఈ ఆడదాన్ని చూస్తున్నకొందికి నాకు తావిడలో నా పదో పెళ్ళాం పోలికలు కనిపిస్తున్నవి," అన్నాడు.



మాట మాటకూ పులిందుడు తన పదో పెళ్ళాం సంగతి తీసుకురావటం ధూమకుడికి మొదటి నుంచీ కోపకారణంగానే వున్నది. చావుబతుకుల సమస్యలో తాముంటే, యీ భిల్లుడికి పోయిన తన పదుము పెళ్ళాం తప్ప, మాట్లాడేందుకు లోకంలో మరొక సంగతే వున్నట్టు లేదు.

ధూమకుడు, పులిందుడితో మంచిగా, "పులిందా, నీ వింతవరకూ చేసిన సహాయానికి కృతజ్ఞుణ్ణి. ఇక నీవు నీ గూడేనికి తిరిగి పోవచ్చు. నీ తెప్పల్ని కూడా తీసుకుపో. నీ భార్య పాతాళదుర్గంలో మహాకలి చెరలో వున్నదనే దాంట్లో సందేహం లేదు. రాజకుమార్తెతోపాటు, ఆమెనూ తప్పక తీసుకువస్తాం," అన్నాడు.

ధూమకు డిలా అనగానే పులిందుడు మహా సంతోషపడిపోతూ, "ధూమకదొరా, మంచి మాట చెప్పావు. పోయింది పోనే పోయింది, యిక వున్న తొమ్మిదిమంది భార్యల రక్షణ అయినా చూసుకోవాలి గదా? ఇక నేను నా గూడేనికి తిరిగి పోతాను. ఏమన్నా సహాయం కావాలంటే కబురు చెయ్యండి. పాతాళదుర్గం చేరిన తరవాత, నా పెళ్ళాం సంగతి మర్చిపోయేరు సుమా?" అంటూ కందకం దగ్గిర నుంచి బయలుదేరి, నది కేసి నడిచాడు.

ధూమకుడు నెత్తి మీది నుంచి పెద్ద భారం దిగి పోయినట్టు ఒక నిట్టూర్పు విడిచాడు. పాట్టిరాక్షసుడు ఏ హెచ్చరికా లేకుండానే మోకు పట్టుకుని ఒక్కుదున కందకంలోకి జారి, దాని గోడలో వున్న ఒక రాతిని కాలితో గట్టిగా నొక్కాడు. మరుక్షణం ఒక పెద్ద రాతి పలక బయటికొచ్చింది. రాక్షసుడు దాని మీది కెక్కి నిలబడి, ధూమకుడూ వాళ్ళతో, "చూశారు గదా? యిందులో మోసం ఏమీలేదు. కింద వున్న విషజంతువులు యింత ఎత్తు ఎగరలేవు. ఇక అంతా మోకు పట్టుకుని దిగిరండి," అన్నాడు.

అప్పటికి ధూమకుడి సంశయాల్లో కొన్ని నివారణ అయినై. అందరూ రాతిపలక పైకి దిగారు. అక్కడ వారికి మెట్లున్న ఒక సొరంగ మార్గం కనిపించింది.

"ఈ సొరంగ మార్గం ద్వారా మీ రొక గంట ప్రయాణంలో దండకారణ్యం చేర గలరు. అదే ప్రయాణం, ఆ కనబడే కొండ దారుల వెంట అయితే నాలుగైదు నెలల కాలం పట్టవచ్చు. మార్గంలో మీరు అనేక కష్టాలను ఎదుర్కోవలసి రావటమే గాక, దారి తప్పి బయలుదేరిన చోటుకే తిరిగి వచ్చే ప్రమాదం కూడా వుంటుంది," అన్నాడు పొట్టిరాక్షసుడు.

ధూమకుడు, సోమకుడి కేసి విస్తుపోయినట్టు చూశాడు. ఆ ఇద్దరూ సొరంగ మార్గంలో ప్రవేశించటానికి సిద్ధమన్నట్టు నిలబడ్డారు. ధూమకుడు, పొట్టిరాక్షసుడికి కృతజ్ఞత చెప్పి, "రాక్షసుల్లో కూడా మంచి వాళ్ళుంటారని నిన్ను చూసిం తరవాత గట్టి నమ్మకం కలిగింది. కుంభీరుడనే మీ వాణ్ణి ఎరుగుదువా? అతడే మా రాజ కుమార్తె కాంతిసేనను దొంగిలించుకు పోయింది," అన్నాడు.

"అతన్నెవరెక్కం? మాంత్రికుడొకడు వాడి కొమ్ము విరగ్గొట్టాడు. వాళ్ళిద్దరూ హోరాహోరి పోట్లాడారట. ఆ మాంత్రికు






డుండేది దండకారణ్యంలోనే. మహాకలికి వాడికి బద్ధవైరం. ఒకళ్ళగొంతొకళ్ళెప్పుడో కోసుకుంటారు," అన్నాడు పొట్టిరాక్షసుడు.

అంతలో కందకం పైనుంచి రాక్షసుడి భార్య, "నువ్వు కూడా వాళ్ళతో పడి మీ వూరు పోదామనుకుంటున్నావా? పైకి రావేం!" అంటూ కళ్ళెర్ర చేసి కేక పెట్టింది. రాక్షసుడు గతుక్కుమని, "ఈ గయ్యాళి ఎప్పుడో నా గొంతు కురెదుతుంది!" అని ధూమకుడి చేతులు పట్టుకుని, "నా సంగతి దండకారణ్యంలో నరరాక్షసులెవరికీ చెప్పకండి, సరేనా?" అంటూ మోకు పట్టుకుని గబగబా కందకం గోడపైకి పాకిపోయాడు.

విరూపుడూ, సోమకుడూ రాతిపలక మీంచి సొరంగమార్గపు మెట్ల కేసి పోబోయేంతలో ధూమకుడు వాళ్ళను వారించి, "మనం సొరంగమార్గాన దాదాపు గంట ప్రయాణం చేయవలసి వుంటుంది గదా, వెలుగు లేకుండా అదెలా సాధ్యం? రాక్షస బంట్లు యీ మార్గానే పాతాళదుర్గానికి వెళ్ళే మాట నిజమైతే, వాళ్ళు ఉపయోగించే దివిటీలు మెట్ల దగ్గిర ఎక్కడో వుంటవి, ముందు ఒకళ్ళు వెళ్ళి వెతకండి," అన్నాడు.

సోమకుడు సొరంగంలోకి పోయి ఒకటి రెండు నిమిషాల తరవాత మూడు నాలుగు దివిటీలూ, అవి వెలిగించేందుకు ఉపయోగించే చెకుముకి రాయీ, దూది తీసుకుని ధూమకుడి దగ్గిరకు వచ్చాడు. ధూమకుడూ, విరూపుడూ రాతిపలక మీంచి సొరంగంలోకి దిగారు. వెంటనే రాతిపలక టపీమని సొరంగ మార్గాన్ని మూసేసింది.

ఒకటి రెండు నిమిషాల తరవాత ముగ్గురూ దివిటీలు వెలిగించుకుని సొరంగ మార్గాన బయలుదేరారు. ముఖ్యమార్గం విశాలంగా దారి తప్పటానికి వీలులేకుండా వున్నది. కాని, దాని నుంచి అక్కడక్కడా చిన్నచిన్న మార్గాలు కొన్ని పక్కలకు పోతున్నవి. వాటిని పరీక్షించటానికిపోయిన విరూ




పుడికి, ఒకచోట రెండు మూడు మానవ కంకాళాలు కనిపించినై. రాక్షసుడి సేవకుల నుంచి తప్పించుకు పారిపోయేందుకు ప్రయత్నించి, ఆ నిర్భాగ్యులు దారి తెన్నూలేని ఆ ఇరుకు ప్రదేశంలో చిక్కుకుని మరణించి వుంటారని విరూపుడు భావించాడు.

ఏ దుస్సంఘటనా లేకుండా ఓ అర గంటకాలం ధూమకుడూ అతడి అనుచరులిద్దరూ సొరంగంలో చాలాదూరం నడిచారు. వాళ్ళు ఒక మలుపు తిరిగేసరికి దూరంగా వాళ్ళకు తమ కేసే వస్తున్న దివిటీలు కొన్ని కనిపించినై. ధూమకుడు చప్పున వెనుదిరిగి మలుపుచాటుకు వచ్చి, తన చేతిలోని దివిటీని నేలకుకొట్టి ఆర్పివేస్తూ, సోమకుణ్ణీ, విరూపుణ్ణీ కూడా అలాగే చేయమన్నాడు. తరవాత ముగ్గురూ ప్రధాన సొరంగమార్గం వదిలి, పక్కల వున్న ఒక చిన్నసందులో దాక్కున్నారు.

క్రమంగా దివిటీలు ధూమకుడూ వాళ్ళున్న ప్రాంతానికి వచ్చినై. ఆ దివిటీల వాళ్ళంతా కలిసి ఇరవైమంది వుంటారు. అందరికన్న ముందు ఒక రాక్షసుడు నడుస్తున్నాడు. ఆ తరవాత వున్నవాళ్ళంతా మహాకలికి చిక్కి, అతడి సేవలో చేరిన మానవవ్యక్తులు; అందరికీ వెనకగా మరొక రాక్షసుడు. ముందున్న రాక్షసుడు పెద్ద గొంతుతో ఏదో పాట పాడుతున్నాడు. తతిమ్మావాళ్ళు చిన్న గొంతులతో వంత పాడుతున్నారు. వాళ్ళు ధూమకుడున్న చోటు చేరి, సూటిగా ముందుకు చూస్తూ నడిచిపోసాగారు. అందరూ ఆ ప్రదేశం దాటిన తరవాత, వెనకవున్న రాక్షసుడు ముక్కుపుటాలు ఎగరవేస్తూ, "ఎక్కడో దివిటీలారిన పొగవాసన వేస్తున్నది," అన్నాడు అందరూ వినేంత బిగ్గరగా.

ముందు నడుస్తున్న రాక్షసుడు వినుకుంటూ, "ఇన్నిరకాల పొగవాసన

ఉన్నయ్యా? మన దివిటీల నుంచి వచ్చే దేమన్నా, సాంబ్రాణిపొగా? అతితెలివికి పోక త్వరగా నడిచిరా," అని కేకపెట్టాడు.

వెనక నడుస్తున్న రాక్షసుడు మాట మాడాడకుండా తతిమ్మావాళ్ళని అనుసరించిపోయాడు. ధూమకుడూ అతడి స్నేహితు లిద్దరూ ప్రాణగండం తప్పినంతగా సంతోషించారు. దివిటీ రాక్షసబ్బంట్లు సొరంగమార్గం వెంట కంటికి కనబడకుండాపోగానే, ధూమకుడూ వాళ్ళు దాక్కున్నచోటు నుంచి బయటికి వచ్చి, మళ్ళీ దివిటీలు వెలిగించుకుని, ఈసారి మరింత జాగ్రత్తగా ముందుకు పోసాగారు.

పావు గంటకాలం గడిచింది. సొరంగ మార్గం యిప్పుడు లోగడవున్నంత చీకటి మయంగా లేదు. ఎక్కడి నుంచో లోనికి వెలుగు ప్రసరిస్తున్నది. "ఇక, మనం దివిటీలు ఆర్పేయవచ్చు, సొరంగ ద్వారం సమీపిస్తున్నాం," అన్నాడు ధూమకుడు.

వాళ్ళు ముగ్గురూ దివిటీలు ఆర్పి, వాటిని సొరంగంలోవున్న పెద్ద కంతల్లో ఒకచోట దాచి, నిశ్శబ్దంగా ముందుకు నడిచారు. ఒక మలుపు తిరిగేసరికి సూర్యకాంతి కళ్ళను మిరుమిట్లు కొల్పుతూ సొరంగద్వారం నుంచి లోపలికి పడుతున్నది. ముగ్గురూ వేటాడే పులుల్లా నక్కుతూపోయి సొరంగద్వారం చేరేందుకున్న రాతిమెట్లెక్కి, ద్వారం పక్కలనున్న రాళ్ళచాటు నుంచి ముందుకు చూశారు. అక్కడ ఎదురైన దృశ్యం వాళ్ళను విలువునా కంపింపజేసింది. ఒక మహాకాయుడైన రాక్షసుడు రంగురంగుల చర్మాలతో కుట్టిన దుస్తులు ధరించి, నెత్తిన కిరీటంతో, చేతిలో పెద్ద ముళ్ళగద ఎత్తి పట్టుకుని, ఏనుగులు పూన్చిన రథంలో అరణ్య మార్గాన పోతున్నాడు. అతని రథానికి వెనకగా సాయుధులైన రాక్షసులనేక మంది నడుస్తున్నారు. —(ఇంకా వుంది)





# పాతాళదుర్గం


## 15

[పొట్టిరాక్షసుడు చేసిన సహాయం వల్ల, ధూమకుడూ అతడి అనుచరులు కందకంలోని రహస్య సొరంగమార్గం చేరారు. దారిలో వారికి కొందరు రాక్షసభృత్యులు ఎదురయ్యారు. వాళ్ళ నుంచి తప్పించుకుని ధూమకుడూ వాళ్ళు సొరంగద్వారాన్ని సమీపించగానే, ఏనుగులు పూన్చిన రథంలో పోతున్న ఒక గొప్ప రాక్షసుడు వాళ్ల కంటబడ్డాడు. తరవాత—]

ఏనుగులు లాగుతున్న రథం తమ దృష్టి నుంచి పోగానే, ధూమకుడు తన ఇద్దరు అనుచరుల ముఖాల కేసి చూశాడు. వాళ్ళు భయపడుతున్నారో, ఆశ్చర్యపడుతున్నారో తెలుసుకోవాలన్నదే అతడి ప్రయత్నం. ఎందుకంటే, తాము ఎలాగైతేనేం మహాకలి రాక్షసు డుండే దండకారణ్యం చేరాము. శత్రువుల వల్ల నిజమైన కష్టాలు ప్రారంభ మయ్యే దిప్పుడే.

సోమకుడు విల్లంబులు గట్టిగా గుప్పెట బిగించి కన్నార్పకుండా, రాక్షసుడు పోయిన మార్గం కేసి చూస్తున్నాడు. విరూపుడు ఈటెమొనను వేళ్ళతో నిమురుతున్నాడు. వాళ్ళల్లో భయచిహ్నాలేమీ లేవు, ఇద్దరూ పళ్ళు గట్టిగా బిగించి వున్నారు.

"ఆ రథంలో పోయినవాడు మహాకలి—పాతాళదుర్గంరాజు అనేదాంట్లో సందేహం లేదు," అన్నాడు ధూమకుడు.



"నేనూ అలాగే అనుకుంటున్నాను. నువ్వు ఊఁ అన్నట్టయితే, ఒక్క బాణం దెబ్బతో వాణ్ణి రథం మీది నుంచి కింద పడకొట్టేవాణ్ణి," అన్నాడు సోమకుడు.


"అది ప్రమాదం. వాడు చచ్చినా, వాడి రథం వెనక నడిచే అయుధంగాళ్ళందరూ మన మీదికివచ్చి పడేవాళ్ళు. ఆ దుర్మార్గుణ్ణి హతం చెయ్యటానికి, యింత కన్న సులువైన మార్గం ఏదైనా ధూమక బాబు ఆలోచించాలి," అన్నాడు విరూపుడు.

విరూపుడి ముందు చూపూ, ఇంగిత జ్ఞానం ధూమకుడికి చాలా సంతోషం కలిగించింది. పులిందుడు తమ వెంట లేక పోవటం అన్నివిధాలా మేలే అయింది, అనుకున్నాడు ధూమకుడు. అతడే తమ వెంటవుంటే, మహాకలిని చూస్తానే, నా పడుచు పెళ్ళాం భామాసింగిని ఎక్కడ దాచావురా? అంటూ అతడి మీదికి బల్లెం తీసుకుని కుప్పించి దూకేవాడే!

"ఈ సొరంగమార్గం నుంచి శత్రువుల కంటబడకుండా బయటపడగలిగితే, యిక అరణ్యంలో మన నెవరూ పట్టుకోలేరు. జాగ్రత్తగా వినండి, సొరంగద్వారానికి ఎవరో కాపలా వున్నారు. వాళ్ళు అటూ యిటూ నడిచే ధ్వని మీకు వినబడటం లేదా?" అని అడిగాడు ధూమకుడు.

విరూపుడూ, సోమకుడూ కొంచెంసేపు నిశ్శబ్దంగా వుండి విని, "ఒకళ్ళ కన్న ఎక్కువమందే కాపలావున్నట్టుంది. వాళ్ళు మాట్లాడుకోవటం కూడా అస్పష్టంగా వినబడుతున్నది," అన్నారు.

"ముందు కాపలావాళ్ళ సంగతేమిటో తెల్సుకోవటం మంచిది. మనం యిక్కడ జాగుచేస్తే, మరికొందరు రాక్షసబ్బంట్లు సొరంగమార్గంలో ప్రవేశించవచ్చు. లేక యింతకు ముందు పోయినవాళ్ళు తిరిగి రావచ్చు," అంటూ ధూమకుడు రాళ్ళు దాటుగా పాకుతూపోయి, సొరంగద్వారం




దారి చుట్టూ కలయచూశారు. ద్వారానికి ఒకపక్కగా వున్న ఒక పెద్ద చెట్టు కింద ఒక రాక్షసుడూ, నలుగురు మానవబంట్లూ వున్నారు. ఆ అయిదుగురూ ఏదో సంగతి తీవ్రంగా చర్చిస్తున్నారు. మధ్య మధ్య బంట్లల్లో ఒకడు వాళ్ళ నుంచి దూరంగా పోయి, చేతిలో వున్న కత్తిని సాము గరిడీల్లో తిప్పినట్టు గిరగిరా తిప్పుతున్నాడు.

ధూమకుడు వాళ్ళను చూసి కొంచెం నిస్పృహ చెందాడు. శత్రువుల కనుగప్పి సొరంగం నుంచి బయటపడి అరణ్యంలోకి పారిపోవటం అసాధ్యంలా కనిపించిం దతడికి. ఇప్పుడేమిటి చేయటం? ధూమకుడిలా మథనపడుతూ తిరిగి తన అనుచరులకేసి రాబోయేంతలో, దూరంగా ఎవరో శంఖాన్ని బలంగా పూరించిన ధ్వని వినబడింది. ఆ ధ్వని వింటూనే సొరంగ మార్గం కాపలావాళ్ళు నలుగురూ చెట్టు కింది నుంచి బయలుదేరారు. కత్తిసాము చేస్తున్నవాడు సాము ఆపి, సొరంగద్వారం కేసి రాసాగాడు.

ధూమకుడు గబగబా తన అనుచరుల దగ్గిరకు వచ్చి సంగతంతా నాలుగు ముక్కల్లో చెప్పి, "ఆ దుర్మార్గులు మధ్యాన్న భోజనానికో, సాయంకాలప్పుండానికో పోతున్నట్టున్నది. ఆ శంఖధ్వని అందుకు పిలుపై వుంటుంది. వాళ్ళల్లో ఒకడిటొస్తున్నాడు," అన్నాడు.

అంతలో రాక్షసబంటు సొరంగద్వారం దగ్గిరకొచ్చి అనుమానంగా లోపలికి తొంగి చూస్తూ, "ఏదో గుసగుస వినపడుతున్నదే, ఎవరక్కడ? రాక్షసదొరలా? మానవ కీటకాలా?" అంటూ ప్రశ్నించాడు.

ధూమకుడు తన మిత్రులకు ఆ బంటు సొరంగంలోకి దిగగానే చుట్టుముట్టమని హెచ్చరించి రాతిచాటునే వుండి చిన్నగా దగ్గాడు. ఆ ధ్వని వింటూనే బంటు, "ఏయ్, నాతో పరాచకాలా?" అంటూ



కత్తి తిప్పుతూ సొరంగంలోకి దూకాడు. మరుక్షణంలో అక్కడున్న ముగ్గురూ రాళ్ళ చాటు నుంచి లేచి అతణ్ణి చుట్టుముట్టి, "కత్తి కిందపడెయ్, నీకొచ్చిన ప్రాణభయం ఏమీ లేదు," అన్నారు.

"ఎవరూ? జాతితక్కువ మనుషులు! మీకు నేను లొంగిపోవాలా? మీరసలిక్కడికెలా రాగలిగారు? ముందు ఆయుధాలు కింద పడేసి, సాగిలపడండి. నేనెవరో తెలుసా? ఈ దండకారణ్యంలో నన్ను మించిన ఖడ్గ వేత్త లేడు," అన్నాడు రాక్షసబంటు.

వాడు మాట ముగించీ ముగించకముందే, ధూమకుడు కత్తిపిడితో ఆ బంటు నెత్తిన గట్టిగా ఒక దెబ్బ కొట్టాడు. ఆ దెబ్బ తింటూనే వాడు చిన్నగా అరిచి కింద పడిపోయాడు. ధూమకుడు తన అనుచరులతో, "వీణ్ణి మనవెంట అరణ్యంలోకి తీసుకుపోవటం మంచిది. వీడి ద్వారా మహాకలి రాక్షసుడి పాతాళదుర్గ రహస్యాలెన్నో తెలుసుకోవచ్చు," అన్నాడు.

సోమకుడూ, విరూపుడూ కలిసి రాక్షస బంటును లేవనెత్తి భుజాన వేసుకుని బయలుదేరారు. ధూమకుడు ముందుగా సొరంగ ద్వారం దాటి బయటికి వచ్చాడు. అక్కడ శత్రువు లెవరూ లేరు. కాని, గుబురుగా పెరిగిన చెట్లున్న ప్రదేశం చేరాలంటే, నాలుగైదు వందల గజాలదూరం మైదాన ప్రదేశంలో నడవాలి.

"వేగంగా పరిగెత్తాలి. అరణ్యం చేరే వరకూ మనకు రక్షణ లేదు," అంటూ ధూమకుడు తన అనుచరుల్ని హెచ్చరించాడు. వాళ్లు పరిగెత్తబోయేంతలో, అప్పటి వరకూ తిన్నదెబ్బతో మైకంలో పడివున్న రాక్షసబంటు, ఆ మైకం కాస్త వదిలి, "శత్రువులు! శత్రువులు! పట్టుకోండి," అంటూ కేకలు పెట్టసాగాడు.

"కాలయాపన ప్రమాదం. వాణ్ణి ఆ సొరంగంలోనే పడవేసి, నా వెంట పరి

గత్తి రండి," అని ఆజ్ఞాపించాడు ధూమకుడు. ఆ వెంటనే విరూపుడూ, సోమకుడూ, "చావ్వెధవా!" అంటూ రాక్షసబ్బంటును సారంగంలోకి విసిరివేశారు.

వాళ్ళు ముగ్గురూ మైదానం దాటి గుబురుచెట్లున్న ప్రదేశం చేరుకున్నారు. వాళ్ళను రాక్షసుడి కాపలా వాళ్ళెవరూ చూసినట్టులేదు. అరణ్యమంతా నిశ్శబ్దంగా వున్నది. సూర్యుడు పడమటి దిక్కుకు బాగా వాలిపోయాడు. తాము అరణ్యంలో రహస్యంగా జీవిస్తూ, మహాకలిరాక్షసుడి పాతాళదుర్గాన్ని గురించిన రహస్యం తెలుసుకోవాలి. ఆ రాక్షసుడి బంటు ఎవడైనా చెప్పందే, ఆ రహస్యం కనుక్కోవటం సాధ్యంకాదు, అనుకున్నాడు ధూమకుడు.

ధూమకుడు తా నెటుపోతున్నదీ ఆలోచించకుండానే అరణ్యంలోకి చాలా దూరం నడిచి, తన వెనక వస్తున్న అనుచరులతో, "ఈ రాత్రికి మనం అరణ్యంలో దొరికే పళ్ళూఫలాలూ తిని ఆకలి చల్లార్చుకోవలిసిందే. మనం ఆ కనబడే కొండల్లో, ఏదైనా మంచి గుహ ఒకటి చూసి నివాసం ఏర్పరుచుకుందాం," అన్నాడు.

సోమకుడు అంగీకార సూచకంగా తల వూపాడు. విరూపుడు చుట్టూ ఓసారి



కలయ చూసి, "ఇంత మహాభయంకరారణ్యం నే నెక్కడా చూడలేదు. మీకు లోగడే చెప్పాను గదా—ఈ అరణ్యంలో ఎక్కడో కాలశంబర మాంత్రికదొర వున్నాడు. ఆ దొరను కలుసుకుంటే ..."

విరూపుడు మాట ముగించే లోపలే ధూమకుడి దగ్గిరవున్న మంత్రదండం కీచుమంటూ కదిలి, ఎదురుగావున్న కొండల కేసి అతణ్ణి గుంజసాగింది. ధూమకుడు ఎంతో ఉత్సాహంగా, "ఇన్నాళ్ళుగా దీని మాటే మరిచాం, సుమా! మాంత్రికుడు, మహాకలి సేవకులకు దొరకలేదనీ, యిక్కడే ఎక్కడో స్వేచ్ఛగా వున్నాడనీ,



నాకు గట్టి నమ్మకం కలుగుతున్నది. బహుశా, ఆ కనబడే కొండప్రాంతాల వుండి వుంటారు," అంటూ వాటి కేసి ఓ క్షణ కాలం చూసి, "మనం చీకటిపడే లోపల అక్కడికి చేరటం మంచిది. మీరు చెట్లెక్కి చుట్టుపక్కల రాక్షసబంట్లెవరైనా వున్నారేమో చూడండి," అన్నాడు.


సోమకుడూ, విరూపుడూ అక్కడ వున్న ఒక ఎత్తయిన చెట్టు మీదికి గబగబా పాకిపోయి, నాలుగైదు నిమిషాలపాటు ఆ చుట్టుపక్కల అంతా పరీక్షించి చూసి, హడావిడిగా చెట్టు దిగి వచ్చారు. ముందుగా విరూపుడు, ధూమకుణ్ణి సమీపించి,

"ధూమకదొరా! నా కళ్ళనే నేను నమ్మలేకపోయానంటే, నమ్ము. రాక్షసులూ, వాళ్ళ బంట్లూ అరణ్యంలో అక్కడక్కడా చెట్లు నరికి వ్యవసాయం చేస్తున్నారు. భూమి దున్నటానికి, బళ్ళు లాగటానికి వాళ్ళుపయోగిస్తున్న జంతువు లేమిటో తెలుసా? ఏనుగులూ, సింహాలూ, లొట్టి పిట్టలూ!" అన్నాడు.

"మనుషుల్నీ, జంతువుల్నీ పీక్కుతినే రాక్షసులు భూమి దున్ని సేద్యం చేస్తున్నారా? ఆశ్చర్యంగా వుంది. సరే, మనం శత్రువుల కంటబడకుండా కొండప్రాంతం చేరవచ్చా?" అన్నాడు ధూమకుడు.

"ఆ దుర్మార్గులు ఎవరి పనుల్లో వాళ్ళున్నారు. వ్యవసాయపుపనిముట్లు తప్ప, ఎవరి చేతిలోనూ ఆయుధాలు లేవు. పనిలోపని కొందరి గొంతుల్లో బాణాలు గుచ్చమంటావా?" అన్నాడు సోమకుడు.

"తొందరపడి అలాంటి పొరపాటు చేయకు. మనం యిక్కడ వున్నట్టు ముందుగానే శత్రువుకు హెచ్చరిక యిచ్చిన వాళ్ళమవుతాం. ఇక జాగ్రత్తగా నడవండి, మంత్రదండం గింజాకుంటూ చూపే, ఆ కొండ కేసి," అంటూ ధూమకుడు బయలుదేరాడు.


CHITRA

అంతలో సారంగద్వారం వైపున పెద్ద కోలాహలం బయలుదేరింది. ఆ వెంటనే ముగ్గురూ చెట్టెక్కి, అక్కణ్ణించి సారంగం కేసి చూశారు. దానిముందు కొందరు రాక్షసులూ, వాళ్ళ బంట్లూ గుంపుగా చేరి వున్నారు. వాళ్ళ మధ్య 'ఖడ్గవేత్త'నని వీరాలు పలికిన బంటును యిద్దరు ముగ్గురు పట్టుకుని పిలకెత్తారు. వాడు ఆయాసపడుతూ చుట్టూ చేరిన వాళ్ళకు ఏమేమో చెపుతున్నాడు.

"సోమా, విరూపా, వాడు మనను గురించే వాళ్ళకు ఏదో చెపుతున్నాడు. రాక్షసులు గుర్రాల మీద అరణ్యంలో మన వేట ప్రారంభిస్తారు. పదండి, ఆ కొండ కేసి పరిగెత్తండి," అంటూ ధూమకుడు చెట్టు మీంచి దూకి పరుగు ప్రారంభించాడు.

దాదాపు అర గంటకాలం వెనక్కు తిరిగి చూడకుండా ఆ ముగ్గురూ అరణ్యంలో పరిగెత్తి, చివరకు కొండపాదం చేరారు.

ఆ కొండ మీదా, దిగువనా కూడా పెద్ద పెద్ద వృక్షాలూ, పొదలూ క్రిక్కిరిసి వున్నవి. ఎదురుగా వారికి ఒక చిన్న జలపాతం కనిపించింది. దాన్ని చూస్తూనే సోమకుడు, "అబ్బా, దాహంగా వుంది! శత్రువుల మాట దేవు డెరుగు," అంటూ నీటిలోకి దిగి దాహం తీర్చుకోసాగారు. చప్పున జలపాతం కట్టుబడిపోయింది. అప్పటివరకూ నీరు ప్రవహించిన చోట నిలువెత్తున, ద్వారంవున్న సూచనగా గుర్తులు కనిపించినై. అబ్బురపడుతూ దాని కేసే కళ్ళార్పకుండా చూస్తున్న ఆ ముగ్గురికీ ఆ ప్రదేశాన కాలశంబర మాంత్రికుడి రూపం ఛాయలా కనిపించింది. మంత్రించినట్టు ముగ్గురూ నిశ్శబ్దంగా దాన్ని సమీపించేంతలో ద్వారం తెరుచుకున్నది. అదొక గుహ. లోపల అగ్నిజ్వాలలు భగ్గుభగ్గుమంటూ ప్రజ్వరిల్లుతున్నవి.

—(ఇంకా వుంది)





# పాతాళదుర్గం

## 16

[ ధూమకుడూ వాళ్ళు, రాక్షసుల కనుగప్పి కొండల కేసి పరిగెత్తారు. అక్కడ వారి కొక జలపాతం కనిపించింది. సోమకుడు దాహం తీర్చుకునేందుకు పోగానే; నీటి ధార కట్టుబడిపోయి, అక్కడ నిలువెత్తు ద్వారం కంటబడింది. వాళ్ళు దాన్ని సమీపించగానే అది తెరుచుకున్నది. లోపల అగ్నిజ్వాలలు లేస్తున్నవి. తరవాత—]

గుహలోని అగ్నిజ్వాలలను చూస్తూనే, ధూమకుడు ద్వారం వద్ద ఆగిపోయాడు. సోమకుడూ, విరూపుడూ తమతమ ఆయుధాలను చేతికి తీసుకున్నారు. విరూపుడి భుజం మీద వున్న నల్లగరుడపక్షి రెక్కలు టపటపలాడిస్తూ ఎగిరిపోయేందుకు ప్రయత్నించింది.

"కాలశంబర మాంత్రికదొర ఎక్కడ? జలపాతం మంత్రించినట్టు కట్టుబడిపోయిందేం? ఈ మంటలేమిటి? ఇందులో ఏమన్నా మోసం లేదు కదా?" అంటూ విరూపుడు ఒకడుగు ముందుకు వేసి, ధూమకుడి భుజం మీదుగా గుహ లోపలికి తొంగిచూశాడు.

"ఎవరది! అటవికనాయకుడు విరూపుడా?" అన్న ప్రశ్నతోపాటు, జ్వాలల వెనక కాలశంబర మాంత్రికుడి రూపం ప్రత్యక్షమయింది.




విరూపుడు రెండు చేతులూ ఎత్తి మాంత్రికుడికి నమస్కరిస్తూ గుహద్వారం దగ్గిరే సాగిలపడ్డాడు.

మాంత్రికుడు చిరునవ్వు నవ్వి ద్వారం దగ్గిరకు వచ్చి, విరూపుణ్ణి దీవిస్తున్నట్టు చేయెత్తి, "ఈ యిద్దరూ ఎవరు?" అని ఆశ్చర్యపడుతున్నవాడిలా ప్రశ్నించి, విరూపుడు లేచి జవాబిచ్చేంతలో, "మీరు కదంబదేశపౌరులు కదా? మీ రాజు ఉగ్రసేనుడు ఎలా వున్నాడు? మీ రాజ్య సరిహద్దుల్లోని కొండ దగ్గిర అంత గురిగా నా ముంజేతిలో బాణం కొట్టిన వాళ్ళెవరు, మీ యిద్దర్లో?" అని ప్రశ్నించాడు.

కాలశంబర మాంత్రికుడితో స్నేహం కలపటానికి యిదే మంచి తరుణం అనిపించింది, ధూమకుడికి. అతడు ముందు కొక అడుగువేసి మాంత్రికుడికి నమస్కరిస్తూ, "మహామాంత్రికా! ఆ కొండ ప్రాంతంలో చీకటిమాటున ఎవరెవరో తెలియని స్థితిలో పెద్ద పొరపాటు జరిగిపోయింది. అందుకు నా తరఫునా, నా అనుచరుడు సోమకుడి తరఫునా క్షమాపణ కోరుతున్నాను. ఇదుగో, మీ మంత్రదండం! దీని సహాయంతోనే, ఎన్నో ఆపదలు గడిచి మీ పక్కడికి రాగలిగాం," అన్నాడు.

కాలశంబర మాంత్రికుడు మంత్రదండాన్ని అందుకుని, కళ్ళ కద్దుకుని, "గతాన్నంతా మరిచిపోదాం. ఇప్పుడు జరగవలసిన కర్మకాండ చాలా వున్నది. మీరు గుహలోకి వచ్చెయ్యండి," అన్నాడు.

ధూమకుడూ వాళ్ళు గుహలోకి అడుగు పెట్టారు. ఆ వెంటనే గుహద్వారాన్ని రాతి పలక మూసేసింది. తిరిగి ఎప్పటిలాగా జలపాతం పెద్ద ధ్వనితో ద్వారాన్ని కప్పివేస్తూ ప్రవహించ సాగింది. మాంత్రికుడు అగ్ని జ్వాలలున్న గుహ నుంచి మరొక గుహలోకి దారి తీశాడు. అక్కడ పైనుంచి వెలుగు బాగా ప్రసరిస్తున్నది. ఆ గుహలో మంచి



ఏటవాలుగా భూగర్భంలోకి ఒక దారి వున్నది. దాని వెంట మాంత్రికుడు ధూమకుడూ వాళ్ళను దిగువకు తీసుకుపోయాడు.

అక్కడ నేల సమతలంగా వున్నది. మనుషులు నివసించటానికి అనువుగా, కొండరాతిలో కొన్ని గదులు ఏర్పాటు చేయబడినై. వాటి ముందున్న ఆవరణలో కొందరు రకరకాల పరికరాలతో పనులు చేస్తున్నారు. పెద్దపెద్ద రోళ్ళల్లో కొందరు ఆకులూ, చెట్లవేళ్ళూ వేసి రోకళ్ళతో దంచుతున్నారు. మరికొందరు ఆ దంచిన దినుసుల్ని పోగుచేసి తెచ్చి దాపల మీద ఆరబెడుతున్నారు.

కాలశంబర మాంత్రికుడు వెనుదిరిగి తన వెంట వున్నవాళ్ళ కేసి చిరునవ్వు నవ్వుతూ చూసి, "ఇదంతా ఏమిటని మీకు ఆశ్చర్యం కలుగుతున్నది గదా?" అని అడిగాడు. అవునన్నట్టు ధూమకుడు తల ఊంచాడు.

"ఈ పనులు చేసేవాళ్ళంతా కుంతల దేశ మంత్రి గంగాధరుడు పంపినవాళ్ళు. వీళ్ళ నాయకుడు భద్రుడు మరికొందరితో కలిసి కొండ పైకి వెళ్ళాడు. యిప్పుడు మనం వున్నది, కొండగర్భం. మహాకలి రాక్షసుడిది పాతాళదుర్గం అయితే, మనది కొండగర్భదుర్గం. ఆ దుర్మార్గుణ్ణి దుర్గంతో పాటు సర్వనాశనం చేయటానికి ఏర్పాట్లు పూర్తి అవుతున్నవి," అన్నాడు కాలశంబర మాంత్రికుడు.

"భద్రుడు మీరున్న చోటుకు ఎలా రాగలిగాడు?" అని ప్రశ్నించాడు ధూమకుడు ఎంతో ఆశ్చర్యపడుతూ.

"అక్కడి కతను చుట్టుదారిన వచ్చాడు, మీరు నానాకష్టాలూ పడి దగ్గిర దారిన వచ్చారు. మీకు అరణ్యంలో ఇదూవుడి ఆటవికులు సహాయం చేసినట్టే, అతడికి మరికొందరు సహాయపడ్డారు," అన్నాడు కాలశంబరుడు.



"ఈ ఓషధులన్నీ ఏమిటి కాలశంబర దొరా?" అని అడిగాడు విరూపుడు.


"రాక్షససంహారానికి ఉపయోగించే ఆయుధాల్లో యివి ముఖ్యమైనవి. నువ్వాటవికుడివి కదా? ఒక్కొక్క ఆకులో, ఒక్కొక్క వేరులో ఎంతటి ప్రాణదాన దహన శక్తులుంటవో నీకు తెలియంది కాదు," అన్నాడు మాంత్రికుడు.

అప్పటివరకూ ఒక ప్రశ్న అడుగుదామని ఉగ్గబట్టుకూర్చున్న ధూమకుడు, మాంత్రికుణ్ణి, "మహామాంత్రికా! రాకుమారి కాంతిసేన క్షేమమా?" అని అడిగాడు.

"క్షేమమే. మంత్రి గంగాధరుడి కొడుకు శశికాంతుడి క్షేమసమాచారాలడగవేం? అతడి గాయాలకు మందు మంత్రాలు ప్రయోగించి నయం చేశాను. కాని, అరణ్యంలో, గూడేల పైకి మనుషుల వేటకై వచ్చిన రాక్షసబంట్ల చేతిలో అతడు చిక్కిపోయాడు, నేను తప్పించుకోగలిగాను. అతడిప్పుడు కాంతిసేనతో పాటు మహాకలిరాక్షసుడి చెరలో వున్నాడు. చెరలో వున్న ఆ యిద్దరూ ఒకర్నొకరు గాఢంగా ప్రేమించుకున్నారట...యిదేదో నా కేమాత్రం అర్థంకాని సంగతనుకో..." అంటూ మాంత్రికుడు, విరూపుడి కేసి తలతిప్పి కనుబొమలు ఎగరవేశాడు.

ఒక క్షణకాలం నిశ్శబ్దం. మహాకలిని హతమార్చటానికి మాంత్రికుడు వేసిన పథకం ఏమిటో ధూమకుడికి అంతుపట్టలేదు. అతడి దృష్టిలో అందుకు రెండే రెండు మార్గాలున్నవి. ఒకటి, పెద్ద సైన్యంతో వచ్చి అతణ్ణి యుద్ధంలో ఓడించటం. రెండు, ఏదో కుతంత్రంపన్ని అతన్ని ఒంటరిగా దొరకపుచ్చుకుని హతమార్చటం.

ధూమకు డిలా ఆలోచించి మాంత్రికుణ్ణి ఏదో అడగబోయేంతలో, కొండ పైకి



పోయేందుకున్న మెట్లమీంచి యిద్దరు యువకులు కుప్పించి దూకుతూ అక్కడికి వచ్చారు. ఇద్దరూ జంతుచర్మాలు ధరించి వున్నారు. వడుం నుంచి పొడవాటి కత్తులు వేళ్లాడుతున్నవి.

వాళ్ళు ధూమకుడూ అతడి అనుచరుల్నీ చూస్తూనే, ఎవరు వీళ్ళు? అన్నట్టుగా మాంత్రికుడి కేసి చూశారు. మాంత్రికుడు తల పంకిస్తూ, "భద్రా! నీవు చెప్పదలిచిందేదో చెప్పవచ్చు. వీళ్ళు మన మిత్రులే, కదంబదేశపౌరులు. రాకుమారి శాంతిసేన రక్షణకై వచ్చారు," అన్నాడు.

"రాకుమారి రక్షణ రాక్షసులే చూస్తున్నారు. మనం రక్షించవలసింది శశికాంతుణ్ణి. వాళ్ళు మహాకలి రాక్షసుడి తండ్రి శతవర్ధంతికి ఏర్పాట్లన్నీ పూర్తి చేస్తున్నారు. రేపు మధ్యాహ్నం ఒంటి గంట వేళ ఆ తంతు ప్రారంభమవుతుంది, శశికాంతుడి శిరశ్ఛేదంతో అది ముగుస్తుంది," అన్నాడు భద్రుడు.

"నా తండ్రిని చంపినంత తేలిగ్గా మహాకలి శశికాంతుణ్ణి చంపలేడు. రేపు సూర్యాస్తమయం లోపల దండకారణ్యంలో రాక్షస కీటకం అనేది-లేకుండా చేయబోతున్నాను. నా తండ్రి హత్యకు ప్రతీకారం చేసి తీరుతాను. పదండి, ఆ దుర్మార్గుడి ప్రయత్నాలేమిటో నేనూ స్వయంగా చూస్తాను," అంటూ కాలశంబర మాంత్రికుడు కాళ్ళతో నేలను గట్టిగా తాటించి, పళ్ళు కొరుకుతూ బయలుదేరాడు.

కొండగర్భంలో వున్న రహస్యమార్గాల వెంట ఒక అర గంట కాలం నడిచి అందరూ ఒక శిఖరప్రాంతాన్ని చేరారు. ఆ శిఖరం మీద మహావృక్షాలెన్నో వున్నవి. వాటి నిండా అల్లిబిల్లిగా అడవితీగలు అల్లుకుని వున్నవి. మాంత్రికుడు నిశ్శబ్దంగా ముందుకుపోయి గుబురుగా వున్న ఒక చెట్టు ఆకులను మెల్లిగా పక్కలకు తొలి




గించి దిగువకు చూశారు. అతడికి పాతాళ దుర్గం, అందులోని భవనాలూ, వాటి ముందున్న మైదానప్రదేశం, అందులో వంటలూ వార్పులతూ, వినోదాలతూ రాక్షసులు చేస్తున్న ఏర్పాట్లూ కనిపించినై.

కాలశంబర మాంత్రికుడు కొంచెంసేపు కన్నార్పకుండా వాటి కేసి చూసి, తరవాత తలతిప్పి, ధూమకుడూ అతడి అనుచరుల్నీ దగ్గిరకు రావలసిందిగా సంజ్ఞ చేశాడు. వాళ్ళు నిశ్శబ్దంగా అతడి దగ్గిరకు వెళ్ళారు. మాంత్రికుడు వాళ్ళకు పాతాళ దుర్గం చూపించాడు. ఆ దుర్గం మీద సూటిగా సూర్యకాంతి ప్రసరించటం లేదు. కాని ఏదో చీకటి వెలుగూ కాని సంధ్యా కాంతిలాంటిది ఆ దుర్గ ప్రదేశాన్నంతా ఆవరించి వున్నది.

"అదో పాతాళదుర్గం! యిక్కడా ఆ క్రూరుడు మహాకలి నివశించేది!" అన్నాడు ధూమకుడు.

"అవును. కాని రేపు సూర్యాస్తమయంతో వాడి దుర్గం, వాడూ కూడా మట్టిలో కలిసిపోతారు, నా తండ్రి ఆత్మకు శాంతి కలుగుతుంది. ఇంతకాలంగా ఈ కార్యం ఒంటరిగానే సాధించాలన్న మూర్ఖపు పట్టుదలలో వుండిపోయాను. ఎంత గొప్ప మాంత్రికుడి కయినా అది సాధ్యంకాని పని. కేవలం మంత్రంతో అయేది కాదు, తంత్రం కూడా ప్రయోగించాలి. అందుకు భద్రుడు నా కెంతగానో తోడ్పడ్డాడు," అన్నాడు కాలశంబర మాంత్రికుడు.

ఆ తరవాత అందరూ అక్కణ్ణించి వెనుదిరిగారు. మాంత్రికుడు ముందుండి దారి తీస్తూ, లోగడ వచ్చిన మార్గాన కాకుండా మరోదారిన నడవసాగారు. ఓపావు గంట అలా నడిచి అతను ఒక పెద్ద చెట్టుతొరెను సమీపించి, దాని మీద గుప్పెటతో బలంగా నొక్కాడు. చెట్టుతొరెలో మనిషి దూరి అవ



తలికి పోవటానికి వీలయినంత పెద్ద కంత ఏర్పడింది.

మాంత్రికుడు ఆ కంతలో నుంచి అవతలికి చూసి, ధూమకుడూ వాళ్ళను దగ్గిరకు రమ్మని పిలిచాడు. ధూమకుడు ఆ కంతలోంచి చూస్తూనే అదిరిపడ్డాడు. అతడికి కలలో కూడా ఊహించని ఒక వింత దృశ్యం కళ్ళబడింది.

అది ఒక పెద్ద సరోవరం. దాని ఒడ్డునున్న ఒక చెట్టు కింద కుంభీరుడు కూర్చుని వున్నాడు. అతడికి అల్లంత దూరంలో రాజకుమారి కాంతిసేన, మరొక భిల్లస్త్రీతో కలిసి సరోవరతీరం వెంట విహరిస్తున్నది.

"కాంతిసేన! కాంతిసేన!" అంటూ ధూమకుడు పెద్దగా కేకపెట్టబోయి తమాయించుకున్నాడు. అతడు కాలశంబరుడికేసి తిరిగి, "రాకుమారి క్షేమంగానే వున్నది. ఆ చెట్టు కింది రాక్షసుడు ఆమెను రాజప్రాసాదం నుంచి ఎత్తుకుపోయిన కుంభీరుడే కదా? రాకుమారి వెంట వున్న ఆ స్త్రీ ఎవరు?" అన్నాడు.

"ఆ అడవి భిల్లనాయకుడు పులిందుడి పడుచు పదో పెళ్ళాం, సందేహం లేదు," అన్నాడు విరూపుడు.

"పులిందుడి పెళ్ళామా? ఈ సంగతి నాకు తెలియదే. తాను కన్యనని, మహాకలిరాక్షసుడు, రాకుమారి కాంతిసేనతో పాటు తననూ పెళ్ళాడబోతున్నాడని, తాను పాతాళదుర్గ పట్టమహిషినని అందరితో చెప్పుకుంటున్నది," అన్నాడు కాలశంబర మాంత్రికుడు.

ధూమకు డా మాటలకు ఏదో జవాబు చెప్పబోయేంతలో, కుంభీరుడు చుట్టూ ఓమారు కలయ చూసి, చప్పున లేచి నిలబడి, రాతిగదను భుజాన పెట్టుకుని, చెట్టు బోదె కేసి పెద్దపెద్ద అంగలు వేస్తూ రాసాగాడు. —(ఇంకా వుంది)





# పాతాళదుర్గం

## 17

[కాలశంబర మాంత్రికుడు, ధూమకుడూ వాళ్ళను కొండశిఖరం మీదికి తీసుకుపోయారు. అక్కడ ఒక సరోవరతీరంలో రాకుమార్తె కాంతిసేన కనిపించింది. ఆమె పారిపోకుండా కావలాకాస్తున్న కుంభీరుడు, మాంత్రికుడు అనుచరులతో ఆ ప్రాంతాలకు వచ్చినట్టు గ్రహించి, అతడున్న చోటుకు వేగంగా రాసాగాడు. తరవాత—]

కుంభీరుడు తామున్న ప్రదేశం కేసి వస్తున్నట్టు అనుమానం కలగ్గానే, ధూమకుడు చప్పున కత్తి దూసి, "మహామాంత్రికా! కుంభీరుడికి మన రహస్యం తెలిసిపోయింది. వాడిటే వస్తున్నాడు. ఇతర రాక్షసులకు హెచ్చరిక యివ్వకముందే వాణ్ణి యమలోకానికి పంపటం అవసరం," అన్నాడు.

మాంత్రికుడా మాటలకు నవ్వి, "ధూమకా, తొందరపడకు. కుంభీరుడు మనపక్షంలోని వాడే. వాడు రావణుడి పాలిటి విభీషణుడివంటివాడు. వంశద్రోహులెకాలంలోనూ వుంటూనే వుంటారు!" అన్నాడు.

కుంభీరుడు చెట్టు వద్దకు వచ్చి, దాని తొడెలో వున్న పెద్ద కంత దగ్గిరకు ఒక ఎండు మోడును లాక్కుని, దాని మీద కూర్చుంటూ, "శంబరా! రాక్షసులవి పెద్ద చెవులు, వాళ్ళ శ్రవణశక్తి గొప్పది. కొద్ది దినాలుగా నీవు నమ్మకద్రోహం చేయ



పోతున్నావన్న అనుమానం నన్ను బాధిస్తున్నది. నేను మహాకలి సోదరుణ్ణి కాను, అందువల్ల విభీషణుణ్ణి ఎలా అవుతాను? వంశద్రోహం మాట! మాది రాహువంశం, వాడిది కేతువంశం. కనక, యిక్కడ వంశద్రోహం ప్రసక్తే లేదు," అన్నాడు కోపంగా.

మాంత్రికుడు అతడి కేసి రెండడుగులు వేసి, చెట్టు బోదెనానుకుని నిలబడి, చిన్న గొంతుతో, "కొత్తగా వచ్చి చేరిన అనుచరులకు, నీ మీద విశ్వాసం కలిగేందుకు ఏవో కొన్ని చిన్న అబద్ధాలు చెపుతున్నాను, నువ్వు అపోహపడకు. వాళ్ళు నిన్ను ఎరిగిన వాళ్ళే. కదంబరాజ్య కొండగుహల వద్ద రాకుమారికి నీవు చేసిన వాగ్దానం వాళ్ళు వినివున్నారు కూడా," అన్నాడు.

ఆ మాట వింటూనే కుంభీరుడు చప్పున తలతిప్పి, ధూమక సోమకుల కేసి చూసి, "ప్రాణాలతో వీళ్ళింత దూరం వచ్చారా? ఈ నల్ల గరుడపక్షిగా డెవడు? ఈ ముఖం ఎక్కడో చూసినట్టున్నదే," అన్నాడు.

"చూసే వుంటావు. ఆటవిక నాయకుడు విరూపుడు," అన్నాడు కాలశంబర మాంత్రికుడు. విరూపుడూ, ధూమక సోమకులూ రాక్షసుడికి వంగి నమస్కారాలు చేశారు.

"ఇదేరకం వినయం?" అంటూ కుంభీరుడు కనుబొమలు చిట్లించి, "శంబరా! నేను నా వంశగౌరవం కాపాడేందుకు నీకు సహాయం చేస్తానన్నాను. నీవు నమ్మకద్రోహివిగా ప్రవర్తించవుగదా?" అన్నాడు.

"ఆ అనుమానం నీకెందుకు కలిగింది?" అని ప్రశ్నించాడు మాంత్రికుడు.

"నేను వేయి కళ్ళతో అంతా గమనిస్తూనే వున్నాను. కొండ కింది జలపాతంతో, కొండ మీది సరోవరంలో నీ అనుచరులాడే ఆటలన్నీ నే నెరుగుదును. వాళ్ళ ప్రయత్నమేమిటి?" అన్నాడు కుంభీరుడు.

"అది పరమరహస్యం. ఇప్పు డప్పుడే వెల్లడించేది కాదు. కాని, ఒకటి చెపు



తున్నాను. నీకూ, నీ వంశం వాళ్ళయిన పాతిక ముప్పైమంది రాక్షసులకూ ఎలాంటి ప్రమాదం రాకుండా చూసే బాధ్యత నాది," అన్నాడు కాలకంబరుడు.

కుంభీరుడు మారు మాటాడకుండా, అసంతృప్తి వ్యక్తమయే ధోరణిలో తలాడిస్తూ, చెట్టుతొర్ర దగ్గిర నుంచి సరోవర తీరానికి వెళ్ళిపోయాడు. మాంత్రికుడు తొర్రలో వున్న కంతను ఎప్పటిలా మూసి, దీర్ఘాలోచనలో వున్నవాడిలా తల వంచుకుని వెనుదిరిగి కొంత దూరం నడిచి, "భద్రా! ఏర్పాట్లన్నీ సక్రమంగా జరిగి పోతున్నయ్యా? మరో రెండు గంటల్లో చీకటి పడబోతున్నది. భస్మాలూ అవీ వాటి వాటి స్థానాల్లో చేర్చాలి. రాక్షసుల వ్యవసాయ జంతువులు—పులులూ, సింహాలూ, ఏనుగుల మాటేమిటి? వాటికి యీ రాత్రి నుంచే ఉపవాసం ప్రారంభమవుతుంది గదా? కుంభీరుడి అనుచరులు వాటిని రేపు మధ్యాహ్నం వరకూ అదుపులో పెట్టి, వేటకు వదలగలరా?" అని అడిగాడు.

"అంతా సిద్ధం అవుతున్నది. ఎవరి స్థానాల్లో వాళ్ళు జాగరూకులుగా వున్నారు. ఓషధీ భస్మాలన్నీ, ఈ రాత్రికి పాతాళ దుర్గం చుట్టూవున్న మహావృక్షాల కొమ్మ లెక్కబోతున్నవి. సాధువులైపోయిన సింహాలూ, ఏనుగులూ తిరిగి క్రూర మృగాలు కాబోతున్నవి. ఒక్క సరోవరం సంగతే మీరు చూడాలి. ఆ బండరాయి వుండవలసిన చోట, వుండవలసిన తీరుగా వున్నదీ లేనిదీ పరీక్షించటం మా వల్ల కాలేదు. మాలో మంత్రవిద్యలుగాని, జల స్తంభన విద్యగాని తెలిసిన వాడెవడూ లేడుగదా?" అన్నాడు భద్రుడు.

"ఆ బండరాతి జోలికి పోవద్దని లోగడే హెచ్చరించానుగదా? దాని విషయంలో చిన్నం యెత్తు పొరబాటు జరిగినా రాక్షసుల చావు అబద్ధం, మన చావు నిజం అవు



తుంది. చీకటిపడనివ్వండి, దాని సంగతి చూస్తాను," అన్నాడు మాంత్రికుడు.

ఆ తరవాత అందరూ కొండ గర్భంలోని తమ నివాసానికి బయలుదేరారు. వాళ్ళు పై నుంచి సొరంగాల్లోకివున్న మెట్లసోపానం దిగి వస్తూండగా, కొందరు మనుషులు మాంత్రికుడి దగ్గిరకు పరిగెత్తుకుంటూ వచ్చి, "మహామాంత్రికా! సొరంగం గోడల వెంట పైనుంచి నీరు సన్ననిధారలుగా కారుతున్నది. మన నివాసాలు నీట మునిగే ప్రమాదం లేదుకదా?" అన్నారు.

మాంత్రికుడు ఒక క్షణకాలం నివ్వెరపోయి, అంతలోనే తెప్పరిల్లి గబగబా మెట్లు దిగి సొరంగ నివాసాల్లో ప్రవేశించాడు. అక్కడ గోడల మీద నీటిచారికలు కనిపించినై. మాంత్రికుడు ఒక చిన్న పాత్ర తెప్పించి, అందులోకి ఆ నీటిని పట్టించి, తన అనుచరుల్లో ఒకణ్ణి తాగమన్నాడు.

"రుచెలా వున్నది? ఉప్పునీరా? తీపి నీరా?" అని ప్రశ్నించాడు మాంత్రికుడు.

"తియ్యగా వున్నది," అన్నాడు వాడు.

"తియ్యగా అంటే...మన జలపాతంలోని నీరులాగానా?" అన్నాడు మాంత్రికుడు. వాడు అవునన్నట్టు తలవూపాడు.

"మన కెలాంటి ప్రమాదం లేదు. అయినా ఒకరిద్దరు నీటిధారలు మరింత పెద్దవవుతవేమో గమనిస్తూ వుండండి," అంటూ మాంత్రికుడు భద్రుడి కేసి తిరిగి, "భద్రా! ఆ మోకులూ అవీ సిద్ధంగా వున్నవికదా? ఇంక కొంచెంసేపట్లో నేను సరోవరం దగ్గిరికి బయలుదేరబోతున్నాను. నా వెంట ధూమక సోమకుల్ని, విరూపుణ్ణీ తీసుకుపోతాను. ఇక్కడి ఏర్పాట్లన్నీ చూసే బాధ్యత నీది," అన్నాడు.

సూర్యాస్తమయమై, కొండ మీద చీకట్లు అలముకొనగానే కాలశంబరుడు, ధూమక సోమకుల్ని, విరూపుణ్ణీ తోడు తీసుకుని గుహల్లో నుంచి కొండ మీదికి వెళ్ళాడు.


అక్కడ ఒక చెట్టు కింద తీగలతో అల్లిన బలమైన పొడవాటి మోకులు చుట్టగా పడి వున్నవి. ధూమక సోమకులూ, విరూపుడూ వాటిని ఎత్తి భుజాల మీద వేసుకున్నారు. వాళ్ళకు అంతా గొడవగొడవగా వున్నది. భద్రుడూ, మాంత్రికుడూ జరిపిన సంభాషణలో ఒక్క ముక్కయినా వాళ్ళకు అర్థం కాలేదు. ఈ మోకులూ, సరోవరం, బండరాయి, జలస్తంభనం...అంతా అయోమయంగా వున్నది. ప్రశ్నిస్తే, అంతా పరమ రహస్యం అంటున్నాడు కాలశంబరుడు!

ఆకాశంలో మినుకు మినుకు మనే చుక్కల కాంతిలో నలుగురూ నిశ్శబ్దంగా నడిచి, కొండ మీది సరోవరాన్ని సమీపించారు. వాళ్ళు చేరిన ప్రాంతం, సాయంకాలంవేళ కుంభీరరాక్షసుడూ, రాకుమారి కాంతిసేనా విహరించి పోయిన ప్రదేశానికి ఒక పక్కగా, పాతాళదుర్గానికి కొంచెం దాపులగా వున్నది.

తీరం చేరగానే కాలశంబర మాంత్రికుడు నీటిలో మంత్రదండాన్ని సగం వరకూ ముంచి, ఏవో మంత్రాలు పఠిస్తూ చుట్టూ ఓసారి కలయచూశాడు. ఒడ్డున అనేకమైన మహావృక్షాలు గాలితాకిడికి కదుల్లాడుతూ, కొమ్మలు ఒకదాని కొకటి ఒరుసుకోగా కిర్రుగిర్రుమంటూ వికృతంగా ధ్వనులు చేస్తున్నవి.



మాంత్రికుడు మంత్రదండం పైకెత్తి ఆ మహావృక్షాల్లో ఒకదానిని ధూమక సోమకులకు చూపుతూ, "మోకు ఒక కొసను ఆ చెట్టు కాండానికి కట్టి, రెండవ కొస నా చేతి కివ్వండి. నేను సరోవరంలో ప్రవేశించబోతున్నాను. ఎంతసేపటికి తిరిగి వస్తానో చెప్పలేను. మీరు మాత్రం నిశ్శబ్దంగా యిక్కడే కూర్చోండి," అని చెప్పి, ధూమకు డిచ్చిన మోకును అందుకుని, "శాంభవీ!" అంటూ చిన్నగా అరిచి దభాలున నీటిలోకి దూకాడు.



ధూమక సోమకులూ, విరూపుడూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. ఒక గంటకాలం గడిచింది. చెట్టుకొమ్మల్లో గుడ్లగూబ ఒకటి కర్ణకఠోరంగా అరిచింది. విరూపుడి భుజాన అప్పటివరకూ కునికిపాట్లు పడుతున్న నల్ల గరుడపక్షి ఆ అరుపు వింటూనే చప్పున తల ఎత్తి రెక్కలల్లల్లాడిస్తూ కీ అంటూ కేకపెట్టింది. అంతలో ఒక పెద్ద గబ్బిలం దాని తల మీద బలంగా తన్ని, వేగంగా మానుకొమ్మల్లోకి ఎగిరిపోయింది. గరుడపక్షి రెచ్చిపోయి విరూపుడి భుజం మీంచి కిందికి దూకి, కాళ్ళతో నేలను గీరుతూ కీచుమంటూ అరిచి పైకెగరబోయింది. ధూమకుడు ముందుకు వంగి పక్షికాలున వేలాడుతున్న తాడును గట్టిగా పట్టుకుని, "విరూపా! దీన్ని పారిపోకుండా పట్టుకో. దీనితో అవసరం రావొచ్చు," అన్నాడు.


"పారిపోకుండా పట్టుకోవటమా! యిది నన్నొదిలి ఎక్కడికి పోతుంది?" అంటూ విరూపుడు నల్లగరుడపక్షిని రెండు చేతులతో పట్టుకుని ఎత్తి భుజాన పెట్టుకుంటూ, "మాంత్రికదొర యింతసేపైనా నీళ్లలో నుంచి బయటికి రాలేదేం?" అన్నాడు.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను. ఎంత జలస్తంభన విద్య తెలిసినవాడైనా నీటి అడుగున యింతసేపుండగలడా? అతడికేదైనా ముప్పు జరిగివుంటే, మనం అంతా రాక్షసుల చేతుల్లో హతం అయిపోతాం," అన్నాడు ధూమకుడు నిస్పృహగా.

వాళ్ళిలా మాట్లాడుకుంటూండగా కొంత దిగువ పాతాళదుర్గప్రాంతం నుంచి వాద్యాల మోతా, రాక్షసులు కాల్చే తారాజువ్వల వెలుగూ ధూమకుడూ వాళ్ళకు కనిపించింది.

"వాళ్ళిప్పుడే జాతర ప్రారంభించారు," అన్నాడు విరూపుడు.

"అలాగే వున్నది. రేపు మధ్యాహ్నం వేళకుగదా, శశికాంతుణ్ణి వాళ్ళు శిరశ్ఛేదం


CHITRA

చేయబోయేది. అతన్నీ, శాంతి సేననూ ఆ దుర్మార్గుల బారి నుంచి మాంత్రికు డెలా కాపాడగలడో నా కర్థంకావటంలేదు. మనం వుండే కొండగర్భంలోని రహస్యసొరంగాలు తెలుసుకుని, వాళ్ళే ముందుగా మనను హతమార్చవచ్చు. కుంభీరుడిలో నాకు నమ్మకం లేదు," అన్నాడు సోమకుడు.

"ఏంజరగటానికైనా అవకాశం వున్నది. మరోక్షణంలో మాంత్రికుడి శవం నీటి మీద తేలినా నేనాశ్చర్యపడను," అన్నాడు ధూమకుడు.

అతడు మాట ముగించీ ముగించక ముందే సరోవరంలో చిన్న అలలు లేచినై. మరుక్షణం కాలశంబర మాంత్రికుడు ఒక చేత్తో మంత్రదండం, మరొక చేత్తో బంగారంలా మిలమిలా మెరిసిపోతున్న చిన్న మొసలి పిల్లనూ పట్టుకుని నీటి మీదికి తేలి, ఒడ్డు కేసి వచ్చాడు. ధూమకుడూ వాళ్ళు ఉత్సాహంగా లేచి అతడి కేసి పరిగెత్తారు.

మాంత్రికుడు చిరునవ్వు నవ్వుతూ వాళ్ళకు మొసలిపిల్లను చూపి, "ఇది గొప్ప శుభ సూచకం. బంగారు మొసళ్ళను మీరెక్కడా చూసివుండరు. ఇది కావాలని నాకు దొరికింది. దీన్ని, వల్ల గరుడపక్షిని ప్రయోగించి రేపు ఒక గొప్ప ఘనకార్యం సాధించబోతున్నాం," అన్నాడు.

ధూమకుడూ అతడి అనుచరులు బంగారు మొసలిపిల్ల కేసి చూస్తూ అద్భుత పడ్డారు. మాంత్రికుడు కొండ కింద రేగిన గందరగోళ ధ్వనులు ఒక త్రుటికాలం విని, "ఓహో, మహాకలిరాక్షసుడి పైతృకపర్వం తీరే ముహూర్తం సమీపించిందన్నమాట! జై, శాంభవీ!" అంటూ చేతులు రెండూ పైకెత్తి, "ఆ మోకులు చెట్టుబోదెకు గట్టిగా బిగించారు గదా? మహాకలి కాలశంబరుల మధ్య చావుబతుకుల యుద్ధం ప్రారంభమైంది," అంటూ తన రహస్యనివాసం కేసి బయలుదేరాడు. —(ఇంకా వుంది)





# పాతాళదుర్గం

## 18

[ కాలశంబర మాంత్రికుడు రాత్రివేళ కొండ మీది సరోవరంలో దిగి, జలస్తంభనం చేసి, బంగారపు రంగులో వున్న ఒక మొసలి పిల్లతో నీటి పైకి తేలాడు. ఆ సమయంలో రాకాసులు కాలుస్తున్న తారాజువ్వలు పాతాళదుర్గం వైపు నుంచి పైకెగర సాగినై. మాంత్రికుడు అనుచరులతో తన రహస్యనివాసం కేసి బయలుదేరాడు. తరవాత—]

మహాకలి రాకాసుడు నివసించే పాతాళ దుర్గం దాదాపు ఒక అరకోసు విస్తీర్ణం వుంటుంది. దుర్గంచుట్టూ వలయాకారంలో, ఆకాశాన్నంటుతున్నట్టుండే కొండలు నిటారుగా వుండటంవల్ల, ఆ అరణ్య ప్రాంతాల నివసించేవా రెవరికీ అక్కడ దుర్గం వున్నదన్న సంగతే తెలియదు. దుర్గం నుంచి అరణ్యంలోకి వెళ్ళేందుకు రాకాసులు కొండలో ఒక చోట సన్నని మార్గం తొలిచారు. దాన్ని వాళ్ళూ, వాళ్ళ బానిసలూ అరణ్యంలోకి పోయేందుకు వుపయోగిస్తూంటారు. ఎప్పుడైనా బుద్ధిపుట్టి దుర్గం వదలదలిస్తే మహాకలి ఆ దారినే ఏనుగుల రథం మీద అరణ్య విహారానికి వెళ్ళి వస్తూంటాడు.

ఒక్క మిట్టమధ్యాహ్నం వేళ మాత్రమే పాతాళదుర్గం మీద సూర్యరశ్మి పడుతుంది. ఉదయ సంధ్యాకాలాల్లో కొండలూ,




అరణ్యం వెలుగులో మునిగి తేలుతూంటే, పాతాళదుర్గం చిమ్మచీకటిలో మునిగి వుంటుంది. ఆ సమయాల్లో రాక్షసులు పెద్దపెద్ద అడవి మానులతో నెగళ్ళువేసి, ఆ కాంతిలో పనులు చేసుకుంటూంటారు.

రాక్షస సంహారానికి కాలశంబర మాంత్రికుడు ఎంతో కాలంగా ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆ ప్రయత్నాలిప్పటికి ఫలించే సూచనలు కనిపించి, అతడు ఎంతో ఆనంద పడుతున్నాడు. అప్పుడు పాతాళదుర్గంలోని రాక్షసుల్లో కుంభీరుడి అనుచరులు కొంత మంది అతడి పక్షం అయారు. మహాకలి చెరలో పెట్టిన కుంతలదేశ మంత్రి కొడుకైన శశికాంతుణ్ణీ, అతడు బలవంతంగా వివాహం ఆడచూస్తున్న రాకుమారి కాంతిసేననూ సమయం వచ్చినప్పుడు రక్షించి మాంత్రికుడి కొండగర్భంలోని రహస్యనివాసానికి చేర్చేందుకు కుంభీరుడు అంగీకరించాడు. మహాకలినీ అతడి బంధువర్గాన్నీ అంతం చేసిన తరవాత, పాతాళదుర్గాన్ని కుంభీరుడికివ్వటానికి కాలశంబరుడు ఒప్పుకున్నాడు.

మాంత్రికుడు సరోవరం నుంచి బంగారు మొసలిపిల్లతో తన నివాసానికి తిరిగి వచ్చేప్పుడు, ధూమక సోమకులతో అనేక సంగతులు చెప్పాడు గాని, మహాకలిని ఏ పథకం వేసి తాను చంపబోతున్నదీ మాత్రం చెప్పలేదు. "మరికొద్ది ఘడియల పాటు అదంతా రహస్యంగా వుండవలసిందే," అన్నాడతడు.

కాని, ఆ రహస్యం ఏమిటో ధూమక సోమకులకూ, విరూపుడికీ కొంత తెలిసిపోయింది. వాళ్ళు మాంత్రికుడితో కలిసి వస్తూండగా, పెద్దపెద్ద బుట్టలు తలల మీద పెట్టుకుని కొందరు వాళ్ళకు ఎదురయ్యారు. ఒకటి రెండు చోట్ల ఆ బుట్టలను తాళ్ళతో మహావృక్షాల కొమ్మల్లోకి ఎక్కిస్తున్నవాళ్ళు వాళ్ళ కంటబడ్డారు. గుహల్లోకి పోయే మెట్లను సమీపించే సరికి వారికి భద్రుడు



ఎదురై, కాలశంబర మాంత్రికుడితో, "దాదాపు ఏర్పాట్లన్నీ పూర్తయినై. ఓషధులూ, భస్మాలూ—అన్నీ చెల్లెక్కించాం. సూర్యోదయంవేళ గాలి అనుకూలం కాగానే వాటిని కొద్దికొద్ది మోతాదుల్లో, పాతాళదుర్గం లోని రాక్షసుల మీద ప్రయోగించటం జరుగుతుంది," అని చెప్పాడు.

"బావుంది. రాక్షసు లసలే మద్యపాన ప్రియులు. ఆ కైపుకు మన ఓషధులమత్తు తోడయిందంటే, వాళ్ళిక ప్రపంచమే మరిచి పోతారు. ఆ తరవాత నీళ్ళూ, రాళ్ళూ, బాణాలూ, అడవిమృగాలూ వాళ్ళను యమపురికి ప్రయాణంకట్టిస్తవి! మహాకలి చెరలో వున్న మనవాళ్ళతో కుంభీరుడు సూర్యోదయంతోనే బయలుదేరి సరోవరం చేరాలి. ఆ సంగతి వాడు మర్చిపోయాడో, రాక్షసాధములతోపాటు వాడూ, మన మిత్రులూ కూడా నా మంత్రశక్తికి బలైపోతారు," అన్నాడు కాలశంబరుడు.

భద్రుడు తలవంచుకుని కొంచెం సేపు ఏదో ఆలోచించి, "మహామాంత్రికా! అందుకు నేనొక చిన్న జాగ్రత్త తీసుకుంటాను. శశికాంతుణ్ణీ, కాంతిసేనని యిప్పుడే సరోవరప్రాంతం చేర్చమని కుంభీరుడికి కబురంపుతాను," అన్నాడు.

ఆ మాటకు మాంత్రికుడు కళ్ళెంతచేసి, "నీ స్నేహితుల రక్షణ ప్రయత్నంలో నీవు నా పథకం అంతా పాడుచేసేట్టున్నావు. నీవు, ఆ రాక్షసుడి దగ్గిరకు పంపే మనిషిని మహాకలి సేవకులు చూస్తే ఎంత ప్రమాదమో వూహించావా? వాణ్ణి వాళ్ళు దొరకపుచ్చుకుంటే, క్షణాల మీద మన రహస్యాలన్నీ వాడి చేత చెప్పించగలరు. అందుకే ముఖ్య విషయాలు పరమ రహస్యంగా దాచివుంచాను. నీవు మాత్రం కుంభీరుడి దగ్గిరకు ఎవర్నీ పంపకు," అన్నాడు.

భద్రుడు అంగీకార సూచకంగా తలాడించి వెళ్ళిపోయాడు. మాంత్రికుడు,




విరూపుడి కేసి తిరిగి, "నీ నల్లగరుడుడు మనుషులకు బాగా మాలిమి అయిందేనా? బంగారు మొసలితో దానికి పొత్తు కలపాలి. రాక్షసుల మూఢవిశ్వాసాలను మనం వీలైనంతవరకూ వుపయోగించుకుని, వాళ్ళను అదమరిపించి సర్వనాశనం చేయాలి," అని చెప్పాడు.

విరూపుడు, గరుడపక్షిని మాంత్రికుడి చేతికిస్తూ, "అదేదో దేవతా పక్షి! మనుషుల్ని మించిన జ్ఞానం దీనికున్నది. శిథిల దేవాలయం దగ్గిర యిది నరవానరాన్ని ఒక్క దెబ్బతో కింద పడకొట్టిందంటే నమ్ము, దొరా," అన్నాడు.

మాంత్రికుడు గరుడపక్షిని అందుకుని కిందపెట్టి, దాని ముందుకు తన దగ్గిరున్న బంగారు మొసలిపిల్లను తోశాడు. గరుడపక్షి మొదట్లో దాన్ని ముక్కుతో పొడవబోయింది. కాని, విరూపుడు వారించే సరికి తల అటూ యిటూ తిప్పి దాని కేసి చూస్తూ, చిన్నగా కీ పెట్టసాగింది.

"భేష్, సెభాష్!" అంటూ కాలశంబరుడు గరుడపక్షి కాలిన వేలాడుతున్న తాడును చేతికి తీసుకుని మొసలిపిల్ల నడుముకు బిగించాడు. తరవాత ఆ రెంటికీ కడుపునిండా మేతపెట్టమని విరూపుణ్ణి ఆజ్ఞాపించాడు.

కింద పాతాళదుర్గం వైపునుంచి క్రమంగా రణగొణ ధ్వని ఎక్కువ కాసాగింది. రాక్షసులు పెద్దపెద్ద మంటలు వేసి వాటి చుట్టూ గెంతుతూ పాటలు పాడసాగారు. కొందరు తాగిన మైకంలో భగభగ మండే మంటల్లోనుంచి కేకలుపెడుతూ అటూ యిటూ పరిగెత్తసాగారు. కాలశంబరుడు వాళ్ళ కేసి కొద్దిసేపు చూసి తృప్తిగా నవ్వుతూ, "అది, ఆ దుర్మార్గుల ఆఖరి వేడుక. మనవాళ్ళు మంత్రించిన ఓషధీ భస్మాలను గాలివాటున వాళ్ళ మీదికి వదులుతున్నారు. చూశారా? దుర్గం మీద గాలిలో తెల్లగా





కనిపించేదంతా, అదే! వాళ్ళు దాని ప్రభావం వల్ల క్రమంగా మతులు పోగొట్టుకుంటారు. మహాకలి యింకా అక్కడి కొచ్చినట్టులేదు. ఒకవేళ వాడు మంత్రౌషధీ ప్రభావం నుంచి తప్పుకున్నా, అనుచర సహాయంలేని వాణ్ణి, నా మంత్రదండం ప్రయోగించి క్షణాల మీద నాశనం చేయగలను," అన్నాడు.

మాంత్రికుడీ విధంగా తన అనుచరులతో సంభాషిస్తూ, పాతాళదుర్గంలో రాక్షసులు చేస్తున్న కోలాహలం చూస్తూ కొంత సేపు గడిపాడు. అంతలో తూర్పు తెల్లనై క్రమంగా సూర్యదర్శన మైంది. కాలశంబర మాంత్రికుడు నిలబడివున్న కొండప్రాంత మంతా వెలుగులో మునిగిపోయింది. అతడు కింద వున్న రాక్షసులకు తాను కనబడకుండా వుండేందుకు అనుచరులతో చెట్లగుబురుల్లోకి పోయి, తన నౌకర్లు దుర్గం మీద గుప్పిళ్ళతో గాలివాలున విసురుతున్న అమోఘ మూలికాభస్మాల కేసి తృప్తిగా చూస్తూ, "ఆ రాక్షసులు కేవలం తెచ్చి పెట్టుకున్న శివంతో ఆ నృత్యాలూ, మంటల్లో దూకటం చేస్తున్నా రనుకోకండి. నేను మంత్రించిన భస్మాలు వాళ్ళ మీద పడి, వాళ్ళను ఉన్మత్తుల్ని చేస్తున్నవి. ఇంక కొద్ది సేపట్లో వాళ్ళు పూర్తిగా పిచ్చివాళ్ళయిపోతారు," అన్నాడు.

కాలశంబరుడి మాటలు కేవలం ప్రగల్భాలు కాదు. అప్పటివరకూ పాడుతూ గెంతుతున్న రాక్షసుల్లో కొందరు, ఒకళ్ళనొకళ్ళు కవ్వించుకుని శూలాలతో, గదలతో కొట్టుకో సాగారు. అందులో రెండు పక్షాలుగా విడిపోయి తన్నుకోటం అంటూ ఏమీ లేదు. అందినవాణ్ణి అందినవాడు ఎడాపెడా బాదేస్తున్నారు.

పాతాళదుర్గం ముందున్న మైదాన ప్రదేశ మంతా చిన్న యుద్ధరంగంగా మారిపోయింది. మాంత్రికుడు పరమానందం




చెంది శాంభవీ! అంటూ మంత్రదండాన్ని కళ్ళకద్దుకో బోయేంతలో, ఏనుగుల రథం మీద మహాకలి శరవేగంతో కొట్లాడుకొంటున్న రాక్షసుల మధ్యకు వచ్చాడు. అతడి వెంట పెద్దపెద్ద గదలు ధరించిన ఇరవై ముప్పైమంది అతి బలశాలులైన రాక్షసులున్నారు. వాళ్ళు మామూలు రాక్షసులకన్న మరికొంచెం ఒడ్డూ పొడుగూ వున్నారు. వాళ్ళు మహాకలి రాక్షసుడి అంగరక్షక దళంలోని వాళ్ళు.

మహాకలి కొండగుహలు దద్దరిల్లేలా కేకలు పెడుతూ, తన చేతిలోని పొడవాటి ఖడ్గమృగ చర్మపు కొరడాతో పోట్లాడుకుంటున్న రాక్షసులను కసిగా కొట్ట సాగాడు. అతడి అంగరక్షకులు వాళ్ళను విడదీసి దూరంగా నిలబెడుతూ, ఎదురు తిరిగిన వాళ్ళను గదలతో పొడవసాగారు.

"దెబ్బకు దెయ్యం దదుస్తుందంటారే..., అదే ఇప్పుడు జరుగుతున్నది. మన మంత్రౌషధాల శక్తి వృధా అయే ప్రమాదం రావచ్చు," అంటూ కాలశంబర మాంత్రికుడు పక్కకు తిరిగి, "భద్రుడెక్కడ? కుంభీరుడు మనం రక్షించవలసిన శశికాంతుణ్ణి, కాంతిసేననూ కారాగారం నుంచి తప్పించి సురక్షితంగా సరోవర ప్రాంతం చేరకానికి ఇదే మంచి అదను," అన్నాడు.

మాంత్రికుడి మాటలు ధోరణి, వాలకం లోగడ వున్నంత ధీమాగా లేవు. తన పథకం ఎక్కడో దెబ్బ తినబోతున్నదన్న భయం పట్టుకున్నవాడిలా అతడు ప్రవర్తిస్తున్నాడని ధూమకుడు అనుమానించాడు. పాతాళ దుర్గ ప్రాంతంలో మహాకలీ, అతడి అంగరక్షకులూ కలిసి రాక్షసుల్ని చిన్నచిన్న ముఠాలుగా విడదీసి వాళ్ళకేదో చెపుతున్నారు. బహుశా మహాకలి తనకు మాంత్రికుణ్ణుంచి ప్రమాదం రానున్న సంగతి కుంభీరుడి అనుచరులైన రాక్షసుల్లో ఏ ద్రోహి ద్వారానైనా తెలుసుకున్నాడా?


33
CHITRA

ధూమకుడిలా ఆలోచిస్తున్నంతలో భద్రుడు ఇద్దరు అనుచరుల్ని వెంటబెట్టుకుని అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చి, "మహామాంత్రికా! దుర్గంలో రేగిన అల్లకల్లోలం అవకాశంగా తీసుకుని, కుంభీరుడు మన వాళ్ళతో సరోవర ప్రాంతానికి బయలు దేరాడు. ఆఖరి క్షణంలో భామాసింగి రహస్యం గ్రహించి ఏదైనా చేయబోయి వుంటుంది—దాని నేతు కత్తి భుజాన వేసుకుని వస్తున్నాడు. చెట్ల మీద వున్న మన వాళ్ళు చూసి చెపుతున్నారు," అన్నాడు.

"జై శాంభవి! విజయం మనదే! పది పన్నెండు నిమిషాల కాలం రాక్షసుల దృష్టిని మరొక వైపుకు మరల్చగలిగామా, వాళ్ళు చచ్చినవాళ్ళ కింద జమే. విరూపా! నీ నల్ల గరుడపక్షి రాక్షసుల మీదికి వదులు. ఏం జరుగుతుందో చూద్దాం. దాని కాలికి బంగారు మొసలిపిల్లను కట్టాంగదా?" అన్నాడు మాంత్రికుడు.

విరూపుడు నల్లగరుడపక్షి తల నొకమారు నిమిరి దాన్ని రెండు చేతులతో పైకెత్తి రాక్షసు లున్న మైదానం కేసి వదిలాడు. అది కీ అని అరుస్తూ వాళ్ళ మీద ఎగర సాగింది. దాని కాలికి కట్టివున్న బంగారు మొసలిపిల్ల గిలగిలా కొట్టుకుంటూ సూర్య కాంతిలో మిలమిల మెరుస్తున్నది. పక్షిని చూసిన రాక్షసులు చేతులు పైకెత్తి దణ్ణాలు పెడుతూ, "మహాకలి ప్రభువువారి తండ్రి ఘోరకలి స్వయంగా తమ శతవర్ధంతికి వచ్చారు!" అంటూ కేకలు పెట్టి, నేల మీద ప్రాణాచారాలు పడసాగారు.

కాలశంబరుడు బ్రహ్మానందపడి "సరోవరం దగ్గిర చెట్టు బోదెకు కట్టివున్న మోకుల్ని నీటిలో నుంచి బయటికి లాగండి, వాటి వెంట ఒక బండరాయి వస్తుంది. మన వాళ్ళందర్నీ గుహల్లో నుంచి కొండ మీదికి రమ్మనండి," అని తన అనుచరుల్ని ఆజ్ఞాపించాడు. —(ఇంకావుంది)






# పాతాళదుర్గం

## 19

[సూర్యోదయం కాగానే, మాంత్రికుడి అనుచరులు పాతాళదుర్గం మీదికి ఓషధీశస్త్రాలు ప్రయోగించారు. రాక్షసులు దాని ప్రభావం వల్ల, వల్ల, అతిమైకంలోనూ కవ్వింపుకుని, తన్నుకోసాగారు. మహాకలి ఏనుగుల రథం మీద అక్కడికి వచ్చాడు. విరూపుడు వదిలిన నల్లగరుడపక్షి, బంగారు మొసలిపిల్లతో పాతాళదుర్గం మీద ఎగరసాగింది. తరవాత—]

రాక్షసులు నల్లగరుడపక్షిని చూసి అద్భుతం చెంది ప్రాణాచారాలు పడటం గమనించిన మహాకలి, ఏనుగల రథం ఆపి తలఎత్తి పైకి చూశాడు. అతడి దృష్టిని గరుడపక్షి కాలిన వేలాడుతున్న మొసలిపిల్ల ఆకర్షించింది. పక్షిలో విశేషం ఏమీలేదు. అలాంటి వాటిని అతడు లోగడ తూర్పువైపు కొండప్రాంతాల్లో చూసి వున్నాడు. కాని, బంగారంలా మిలమిలా మెరిసిపోతున్న మొసలిపిల్ల పక్షి కాలిన వేళ్ళాడు తుండటం ఏమిటి? బంగారు మొసళ్ళు ఎక్కడైనా వుంటవా?

తమ రాజు వాలకం గమనించిన ఒక ముసలిరాక్షసుడు, "మహాకలీ! ఆ పక్షి నీ తండ్రి అయిన ఘోరకలి అని మనవాళ్ళు భక్తితో దణ్ణాలు పెడుతున్నారు. నీవూ అలా చేయటం బావుంటుంది. లేకపోతే, తండ్రి అంటే భక్తిగౌరవాల్లేవి కొడుకుగా వాళ్ళు నిన్ను దూషిస్తారు," అని సలహా యిచ్చారు.



"గరుడపక్షి నా తండ్రి ఎలా అవుతుంది? అందులో ఏదో మోసం వున్నది. వారం రోజులుగా దుర్గం చుట్టూవున్న కొండల మీద మానవాధము లెవరో తచ్చాడు తున్నట్టు యింతకు ముందే నాకు వార్త తెలిసింది," అన్నాడు మహాకలి కోపంగా.

మహాకలి అన్న మాటల్ని ముసలి రాక్షసుడు అందరికీ వినబడేలా ఎత్తయిన రాతి బండ మీద నిలబడి, పెద్ద గొంతుతో చెప్ప సాగాడు. "అది కొండ శిఖరాల మీద బతికే గుడ్డి గరుడపక్షి, మహాసత్త్వుడైన ఘోర కలేశ్వరుడు కాదు. ఈ మాట మన దుర్గేంద్రుడు మహాకలి చెపుతున్నాడు."

ఈ మాటలు విన్న రాక్షసుల్లో కొందరు గరుడపక్షి కేసి రాళ్ళు గురిచేశారు, మరి కొందరు. ముసలివాడు తమ రాజును అవమానిస్తున్నాడన్న కోపంలో అతడి మీదికి చేతికందిన ఆయుధాలను విసరసాగారు. మహాకలి తన అంగరక్షకు లందర్నీ కేకవేసి, వాళ్ళతో సంప్రతింపులు ప్రారంభించాడు.

పైన కొండ మీది చెట్లచాటున నిలబడి యిదంతా చూస్తున్న కాలశంబర మాంత్రికుడు తృప్తిగా ఓ సారి నవ్వి, "సరోవరంలో వున్న బండరాయిని మనవాళ్ళు యీపాటికి బయిటికిలాగి వుంటారు. గుహల్లోవున్న మన వాళ్ళంతా యింకా కొండమీదికి వచ్చినట్టు లేదే? జై, శాంభవి! వేగిరం, వేగిరం!" అంటూ మంత్రదండాన్ని పైకెత్తి గిరికీలు కొట్టసాగాడు.

అంతలో భూకంపం కలిగినట్టుగా కొండ దద్దరిల్లిపోయింది. పాతాళదుర్గం వైపున వున్న కొండపాదంలో రెండుమూడు చోట్ల నీరు తాటిచెట్టు ప్రమాణంలో పైకి లేచి, చెవులు చిల్లులుపడేలా ధ్వనిస్తూ దుర్గం ముందున్న మైదానం మీద ధారాపాతంగా పడసాగింది.


"జలప్రళయం! జలప్రళయం!" అంటూ కొందరు రాక్షసులు భయంతో



కంపించిపోతూ కేకలు పెట్టారు. ముసలి రాక్షసుడు గొంతు మరింత పెద్దది చేసి, "తనను అవమానించినందుకు ఘోర కలేశ్వరుడు మనందరినీ శిక్షిస్తున్నాడు. రాక్షసజాతి సర్వనాశనం తప్పదు. దీనికి బాధ్యతంతా మహాకలిదే!" అని అరిచాడు.

సరోవరంలోని బండరాయిని మోకుల సాయంతో బయటికి లాగిన మాంత్రికుడి అనుచరులు—భద్రుడూ మొదలైనవాళ్ళు పరుగు పరుగున అతడి దగ్గిరకు వచ్చారు. భద్రుడు ఎంతో ఉత్సాహంగా, "మహ మాంత్రికా! మనం జయించాం. ఇంత కాలంగా నువ్వు రహస్యంగా దాచివుంచిన బండరాయిని బయటికి గుంజగానే, సరోవరం అంతా ఒక్కసారి అల్లకల్లోలమై, భూకంపం వచ్చినట్టుగా కొండ గజగజలాడి పోయింది," అన్నారు.

"అది భూకంపమా? కాదు, ప్రళయం, మహాప్రళయం! నేను రోజుల తరబడి జలస్తంభనం చేసి, సరోవరం అడుగు నుంచి కొండలోని సొరంగాల్లోకి దారులు ఏర్పరిచి, కావాలన్నప్పుడు సరోవర జలమంతా పాతాళదుర్గాన్ని ముంచెత్తేందుకు వీలుగా ఆ రాయిని అక్కడ తాపడం చేశాను. ఆ రాయికి ఏ కారణం వల్లనైనా స్థానభ్రష్టత్వం కలిగిందో, పాతాళదుర్గం నీట మునుగుతుంది. కాని, రాక్షసుల్లో కొందరైనా యీ లోపల దుర్గాన్నుంచి అరణ్యంలోకి వున్న కొండదారి వెంట పారిపోయే అవకాశం వున్నది. ఆ దుర్మార్గుల్లో ఒక్కగా నొక్కడైనా అలా ప్రాణాలతో బయటపడకుండా వుండేందుకే, యింత కాలం వేచివుండి, యిన్ని ఏర్పాట్లు చేయవలసి వచ్చింది," అంటూ కాలశంబరుడు, చెవులకు అరచేతు లడ్డం పెట్టుకుని కొంచెం సేపు విని, "ఏమిటా అరుపులు? మీకు వినబడటం లేదా?" అని పక్క నున్న వాళ్ళను ప్రశ్నించాడు.



దలిస్తే మనం వాళ్ళను హతమారుస్తాం. ఆ క్రూరులందరూ నీట మునిగి చావవలసిందే," అన్నాడు.

"శశికాంతుణ్ణీ, రాజకుమారి కాంతిసేననూ వెంట తీసుకుని సరోవర ప్రాంతానికి బయలుదేరిన కుంభీరు డేమయ్యాడో తెలియటం లేదు," అన్నాడు భద్రుడు.

"నా మిత్రుడూ శత్రువూ కూడా అయిన పులిందుడి పడుచు పెళ్ళాం భామాసింగి కూడా వాళ్ళ వెంట వున్నదని చెప్పావు. ఆ గయ్యాళి అందర్నీ తప్పు దారి పట్టించి వుండదు గదా?" అన్నాడు విరూపుడు.

"మా కన్నిటికన్న రాజకుమారి ముఖ్యం. ఆమెను తెచ్చి రాణిగా చేస్తామని మా కదంబ ప్రజలందరికీ మాట యిచ్చి వచ్చాం," అన్నాడు ధూమకుడు. సోమకుడు అవునన్నట్టు తలాడించి, విల్లంబుల్ని చేతికి తీసుకున్నాడు.

"ఎక్కడో దూరంగా పులులూ, సింహాలూ రెచ్చిపోయి మొరుగుతున్నట్టుగా వున్నది," అన్నాడు విరూపుడు.


"మొరగటమా?" అంటూ మాంత్రికుడు చిరునవ్వు నవ్వి, "అవి కుంభీరుడి పెంపుడు జంతువులు. ఒకటి రెండు రోజులుగా వాటికి ఆహారం పెట్టకుండా మాడ్చారు. అప్పుడవి పాతాళదుర్గం నుంచి అరణ్యంలోకి పోయేందుకున్న ఒకే ఒక సన్నని కొండమార్గాన్ని కాపాడేందుకు వస్తున్నవి. ఆ దారి వెంట మహాకలి తన అనుచరులతో బయటికి పారిపోలేదు. సాహసించి మన వైపుగా వున్న కొంత ఎక్క


కాలకంబర మాంత్రికుడు అసంతృప్తి సూచకంగా తల పక్కకు తిప్పుకుని, "ఇప్పుడు ఎవరి ప్రయోజనం వాళ్ళు చూసుకోవటం ప్రారంభిస్తే మొదటికే ముప్పు వస్తుంది. నా తండ్రిని క్రూరాతిక్రూరంగా తల నరికి చంపిన మహాకలి రాక్షసుణ్ణి హతమార్చితే నా పగ తీరినట్టే! కాని,

అంతమాత్రాన కలగబోయే మేలేముంటుంది? వాడి అనుచరుల్లో మరొకడు పాతాళదుర్గాన్ని ఆశ్రయంగా పెట్టుకుని, మహాకలిని మించిన ఘోరకార్యాలు చేయవచ్చు. కనక, ముందీ రాక్షసాధములందర్నీ యమపురికి పంపితే, ఆ తరవాత రాజకుమారి కాంతిసేనా, మంత్రికొడుకు శశికాంతుడూ—అందరి రక్షణా చూడవచ్చు." అన్నాడు.

ఆ మాటలకు భద్రుడూ, ధూమకుడూ ఒకేసారి గొంతెత్తి ఏదో జవాబు చెప్పబోయేంతలో కింద పాతాళదుర్గం వైపు నుంచి భయంకరమైన ధ్వని వినబడింది. మాంత్రికుడూ అతడి అనుచరులూ కొంచెం ముందుకు పరిగెత్తి రాళ్ళ మీదుగా వంగి, కిందికి చూశారు. పాతాళదుర్గంలోని ఒక భాగం నీటి తాకిడికి పునాదులతో కూడా కదిలి నీట పడిపోయింది. అప్పటి వరకూ దాని మీద నిలబడివున్న రాక్షసులు హాహాకారాలు చేస్తూ నీళ్ళల్లో పడి ఈదసాగారు. కొందరు రొప్పుతూ రొజుతూ మాంత్రికుడున్న కొండ వైపుకు యీదుకు రావటం కనబడింది.

కాలశంబరుడు మంత్రదండం పైకెత్తి, "భద్రా! ధూమకా! నా మాట కొంచెం వినండి. శశికాంతుడూ, రాకుమారి క్షేమంగా





వున్నారని నమ్మండి," అంటూ మంత్ర దండాన్ని వాళ్ళ ముందుకు చాచి, "అదుగో, ఆ చెట్టు కింద కనబడుతున్నారు గదా? ఆ పక్కన వున్నవాడు కుంభీరుడు!" అంటూ వాళ్ళు మంత్రదండం కేసి దృష్టి తిప్పక ముందే చప్పున పైకెత్తి పట్టుకుని, "భద్రా! చెట్లకొమ్మల్లో భద్రంగా దాచి వుంచిన రాళ్ళని వడిశెలలను, రాక్షసాధ ముల మీద ప్రయోగించటానికి యిదే మంచి అదను. గురి చూసి, వాళ్ళ మీదికి రాతి గుండ్లను విసరండి," అని చెప్పాడు.

భద్రుడు చప్పట్లు చరిచి, కొండ గుహల నుంచి పైకి వచ్చిన మాంత్రికుడి అనుచ రుల్ని కొందరిని వెంట పెట్టుకుని, కొండ అంచున వున్న మహావృక్షాల దిక్కు కేసి పరుగుతీశాడు.

ఆ సరికే చెట్ల మీద వున్న వడిశెలల వాళ్ళు, పెద్ద పెద్ద రాతిగుండ్లను వాటిల్లో పెట్టి రాక్షసుల మీద ప్రయోగించటానికి సిద్ధపడి, ఆజ్ఞల కోసం ఎదురుచూస్తున్నారు.

భద్రుడు వాళ్ళను సమీపించి, "ఇక రాళ్ళవర్షం కురిపించండి. దెబ్బ కొక రాక్ష సుడు పరలోకానికి ప్రయాణం కట్టాలి," అని హెచ్చరించి, తన వెంట వున్నవాళ్ళతో, "మీరు మోయగలిగినంత పెద్ద రాళ్ళను వడిశెలల వాళ్ళ దగ్గిరకు తీసుకుపోండి," అని ఆజ్ఞాపించాడు.

ఒక్క క్షణం తరవాత మహా వృక్షాల కొమ్మల నున్న వడిశెలల నుంచి పెద్ద పెద్ద రాళ్ళు జుఁయ్ అని శబ్దం చేస్తూ, నీట యీదుతున్న రాక్షసుల శరీరాలను తాక సాగినై. దెబ్బ తగలగానే ఒక్కొక్క రాక్ష సుడూ పెద్ద చావుకేక పెట్టి నీట మునిగి గిలగిలా తన్నుకుంటూ పైకి తేలసాగాడు.

ఆ సరికి పాతాళదుర్గంలో ఎక్కువ భాగాన్ని సరోవర జలం ఆక్రమించింది. దుర్గం తాలూకు కొన్ని శిఖరాలు మాత్రమే నీటి మీద తేలివున్నవి. కొందరు రాక్షసులు

ఆ శిఖరాలను ఆసరాగా పట్టుకుని వేళ్ళాడుతున్నారు. కింద పొంగులు వారుతున్న నీటిని చూసిన బంగారు మొసలిపిల్ల అందులో దూకేందుకు గిజగిజ తన్నుకోసాగింది. ఆ కారణం వల్ల నల్ల గరుడపక్షి ఎంత బలంగా రెక్కలాడించినా ఎత్తుకు పోలేక, వరద నీటికి నాలుగైదు గజాల ఎత్తున ఎగరసాగింది.

"ఘోరకలేంద్రుడు మనను రక్షించేందుకు వస్తున్నాడు!" అంటూ పాతాళదుర్గం శిఖరం పట్టుకు వేళ్ళాడుతున్న ఒక రాక్షసుడు కేక వేశాడు. ఆ వెంటనే చాలా మంది రాక్షసులు, "రక్షించు, ఘోరకలేంద్రా, రక్షించు!" అంటూ హాహాకారాలు ప్రారంభించారు.

ఇదంతా చూస్తున్న కాలశంబర మాంత్రికుడు పొట్ట చెక్కలయేలా నవ్వుతూ, "విరూపా! ఈ నల్ల గరుడుడు నువ్వన్నట్టు నిజంగా దేవతాపక్షి. దాని సాయంతో మనం రాక్షసుల్ని బాగా మోసగించగలిగాం. కాని, మహాకలి ఏమైనట్టు? వాడు జలగండం నుంచి తప్పించుకు పోలేదు గదా?" అన్నాడు, అదుర్దా కనబరుస్తూ.

అందరూ వరవళ్ళు తీస్తున్న నీటి కేసి పరీక్షగా చూశారు. హఠాత్తుగా రెండు ఏనుగులు పాతాళదుర్గ శిఖరం వెనక నుంచి ముందుకు వచ్చినై. వాటిల్లో ఒక దాని మీద మహాకలి వున్నాడు, రెండవ దాని మీద ఆతడి అంగరక్షకు లిద్దరు కూర్చుని వున్నారు. అందరి దుస్తులూ నీళ్ళోడుతున్నవి. మహాకలి తన చేతిలోని గదను పైకెత్తి, "ఆ దిక్కుమాలిన పక్షి, నా తండ్రి అనుకుని ప్రాణాచారాలు పడి, నెత్తి మీదికొస్తున్న ప్రమాదాన్ని గుర్తించక చిక్కుల్లో పడ్డాం. ఇప్పుడు విచారించి లాభం లేదు. అందరూ అరణ్యంలోకి పోయే కొండ సొరంగం కేసి యీదుకురండి. కొండ మీదికి చేరాలని ప్రయత్నించే వాళ్ళను, ఆ దుష్ట



మాంత్రిక వెధవ కాలశంబరుడెలా రాళ్ళు విసిరి చంపిస్తున్నాడో కనబడటం లేదా?" అంటూ పెద్దగా అరవసాగాడు.

మహాకలి అంగరక్షకు లిద్దరూ తాము ఎక్కి వున్న ఏనుగును చక్రాకారంలో వరద నీట తిప్పుతూ, రాక్షసులను శూలాలతో పొడిచి మహాకలి చెప్పిన కొండ సొరంగం కేసి మళ్ళవేయసాగారు. మహాకలి అటు కేసి ఏనుగును నడుపుతూ, "తొందరగా రండి! సొరంగం దాటి ఒకసారి నేల తాకామో, ఆ మాంత్రికుడు చచ్చిన వాడి కిందే లెక్క. నా కాబొయ్యే పెళ్ళాం కాంతిసేన ఎక్కడ? బలిపెట్టవలసిన ఆ చచ్చు వెధవ శశికాంతు డేమయ్యాడు? పిశాచి భామానాంగి నీట కలిసిందా? ఆఁ అన్నట్టు కుంభీరుడేడి? ఆ ఒంటికొమ్ము రాహు వంశపు శుంఠే గదా వాళ్ళందరికీ కాపలా? కుంభీరా! కుంభీరా!" అంటూ కేకలు పెట్టసాగాడు.

"మహాకలిగాడికి మతిపోయింది! సంధి మంత్రాని కిదా సమయం? సరే, అందరూ కొండ సొరంగం కేసి నడవండి. ఈ సరికే అక్కడ కుంభీరుడు వన్యమృగాలతో ద్వారరక్షణ చేస్తూ వుంటాడు. అయినా, రాక్షసులకు సింహాలతో పోట్లాడటం ఏపాటి? మనం కాట్ల కుక్కలతో కలియబడ్డంత తేలిక," అంటూ కాలశంబరుడు వేగంగా బయలుదేరాడు.

రాక్షసులందరూ తమ రాజు వెనకగా ఈదుతూ సొరంగ మార్గం కేసి రాసాగారు. మాంత్రికుడు తన అనుచరలతో కొండ రాళ్ళు ఎక్కి దిగుతూ, సాధ్యమైన చోట కొండ అంచుల వెంట పాకుతూ, వాళ్ళ కన్న కొంచెం ముందుగా సొరంగ మార్గం చేరాడు. అతడికి అరణ్యం వైపుకు వున్న సొరంగద్వారం ముందు కుంభీరుడూ, అతడి వంశం వాళ్ళూ కనిపించారు.

—[వచ్చే సంచికలో ముగింపు]





# పాతాళదుర్గం

## 20


[రాక్షసులు నల్లగరుడపక్షి ప్రాణాధారాలు పడుతున్న అదనులో, మాంత్రికుడు కొండ మీది సరోవరజలం పాతాళదుర్గం మీద ప్రవహించేలా చేశాడు. నీటమునిగి చాలామంది రాక్షసులు చచ్చారు. మిగిలిన వాళ్ళతో మహాకలి సొరంగమార్గం తీసి బయలుదేరాడు. దాన్ని శశికాంతుడూ, కుంభీరుడూ తమ అనుచరులతో కాపలి కాస్తున్నారు. తరవాత—]

కాలశంబర మాంత్రికుడు సొరంగ మార్గం పైభాగానికి చేరుతూనే కుంభీరుణ్ణి హెచ్చరిస్తూ, "కుంభీరా! నువ్వు పాతాళ దుర్గం రాజువయే క్షణం సమీపిస్తున్నది. ని రాహువంశం వాళ్ళు దండకారణ్యాన్ని హాయిగా ఏలుకోవచ్చు. కేతువంశం వాళ్ళు సర్వనాశనం అవుతున్నారు," అన్నాడు.

మాంత్రికుడు మాట ముగించే లోపలే ధూమకుడు అతడి భుజం పట్టుకుని వెనక్కు తిప్పుతూ, "మహాకలి సొరంగ మార్గాన్ని సమీపిస్తున్నాడు," అని చెప్పాడు.

"వాడి ప్రయత్నమేమిటో నాకు తెలుసు. ఊఁ, రానివ్వండి. అందుబాటులోకి రాగానే వాళ్ళ మీద, యీ రక్కసిబండలను తోయండి," అన్నాడు కాలశంబరుడు.


మాంత్రికుడిలా చెపుతున్నంతలో మహాకలి, అతడి అనుచరులూ సొరంగ ద్వారం వున్న ప్రాంతం చేరారు.



"జై, కుంభపతి!" అంటూ మహాకలి తన చేతనున్న గదతో ఏనుగు తల మీద చిన్నగా కొట్టాడు. వెంటనే ఏనుగు నీళ్ళల్లో మునిగింది. దానితోపాటు అతడి అంగరక్షకు లిద్దరూ ఎక్కివున్న ఏనుగు కూడా మునిగింది. వెంటనే ఫెళఫెళమంటూ పెద్ద ధ్వని అయింది. మాంత్రికుడూ, అతడి అనుచరులూ ఆ ధ్వని వచ్చిన వైపుకు వెళ్ళి చూసేంతలో, మహాకలి సారంగ మార్గానికి అడ్డుగా వున్న రాళ్ళను ఏనుగుతో పడదోయించి బయిటికి వచ్చేశాడు. అతడి వెనకగా, అంగరక్షకు లెక్కివున్న ఏనుగూ బయటపడింది. మరుక్షణంలో సారంగ మార్గాన్నుంచి నీరు పెద్ద శబ్దం చేస్తూ వేగంగా బయిటికి ప్రవహించసాగింది.

కుంభీరుడూ, అతడి బంధువర్గం పట్టుకునివున్న పులులూ, సింహాలూ ఆ నీటిని చూసి బెదిరిపోయినై. వాళ్ళు వాటిని అదుపు చేయబోయేంతలో మహాకలి వాళ్ళను చూసి, "కుంభీరా! నువ్విక్కడ ఏం చేస్తున్నావ్? ద్రోహీ, నువ్వేగదా సారంగ మార్గానికి రాళ్ళు అడ్డం పెట్టించింది?" అంటూ అరిచి ఏనుగును అతడి మీదికి దూకించాడు.

కుంభీరుడు యిలాంటి ప్రమాదం రానున్నదని ముందే వూహించి వుండటంతో, చప్పున తన దగ్గిరున్న సింహాన్ని మహాకలి ఎక్కివున్న ఏనుగు మీదికి ఉసిగొలిపి, దూరంగా పరిగెత్తి, "రాహువంశానికి, జై!" అంటూ తన చేతులోవున్న శూలాన్ని మహాకలికి గురిచేసి బలంగా విసిరాడు. కాని, అది గురితప్పి ఏనుగు డొక్కలో గుచ్చుకున్నది. దానితో అది బెదిరిపోయి, మహాకలి ఆపాలని ప్రయత్నించినా ఆగకుండా, ఘీంకరిస్తూ అరణ్యం కేసి పరిగెత్తసాగింది. మహాకలి అంగరక్షకులు తమ నాయకుణ్ణి అనుసరించారు. కుంభీరుడు తన అనుచరులను హెచ్చరించి, సింహాన్ని తీసుకుని




మహాకలి వెంటబడ్డాడు. కాని, యీలోపలే శశికాంతుడు, మహాకలి దారిని అడ్డగిస్తూ, అతడి మీద బాణాలు ప్రయోగించసాగాడు.

కాలశంబర మాంత్రికుడు, "శాంభవీ!" అంటూ పెద్దగా అరిచి, "ఆ దుర్మార్గుడికి అడ్డుతగలండి. నే నొస్తున్నాను!" అంటూ సొరంగం మీది నుంచి కుప్పించి దూకుతూ కిందికి దిగి, మహాకలి కేసి పరిగెత్తాడు. ధూమకుడూ, సోమకుడూ, భద్రుడూ కూడా మాంత్రికుడి వెంట పరిగెత్తారు.

సొరంగద్వారం నుంచి ప్రవాహం వెంట బయిటికి కొట్టుకువచ్చిన కొందరు రాక్షసులను, కుంభీరుడి అనుచరులు తేలికగా చంపేశారు. వాళ్ళు నీటపడి యీది యీది సగం చచ్చివుండటంతో, వాళ్ళు అంతగా ప్రతిఘటించలేక పోయారు. పులులూ, సింహాలూ వాళ్ళ మీదికి ధూకి, కంఠాలను గావుపట్టు పట్టినై.

పరిస్థితి విషమించిందని తెలుసుకున్న మహాకలి, నిలిచి పోరాడటంకన్న, పారిపోవటమే క్షేమం అనుకున్నాడు. కాని, కాలశంబరుడు తనవాళ్ళందర్నీ, అతడు అరణ్యం లోకి పారిపోకుండా దారి అటకాయించమన్నాడు. "కావాలంటే వాణ్ణి కొండల కేసి పోనివ్వండి. అంతేగాని అరణ్యంలోకి ఒక సారి జొరపడ్డాడో యిక మనకు కనబడడు," అని హెచ్చరించాడు.

మహాకలీ, అతడి అనుచరు లిద్దరూ అన్ని వైపుల నుంచీ చుట్టుముట్టబడ్డారు. అరణ్య మార్గం వైపున కుంభీరుడూ అతని అనుచరులూ చేరి అతడి మీదికి రాళ్ళూ, పెద్దపెద్ద చెట్లకొమ్మలూ విసరసాగారు. మరో వైపు నుంచి శశికాంతుడూ, సోమకుడూ వాళ్ళ మీద బాణాలు ప్రయోగిస్తున్నారు. ధూమకుడు మరిద్దరు అనుచరులతో రాకుమారి కాంతిసేననూ, భామాసింగినీ ఆ ప్రదేశం నుంచి రక్షణ కోసం కొంత దూరంగా తీసుకుపోయాడు.



మహాకలి తన ఏనుగును శత్రువుల మీదికి వురికిస్తూ, అందినవాళ్ళను గదతో మోదుతూ కొంతసేపు పోరాడి, ఇక లాభం లేదని తెలుసుకుని. తన అంగరక్షకులను హెచ్చరించి, దాన్ని శశికాంతుడి కేసి దూకించాడు. శశికాంతుడు బాణాలతో ఏనుగును అడ్డగించలేకపోయాడు. మహాకలి యీ విధంగా శత్రువలయాన్ని ఛేదించుకుని, కొండల కేసి పారిపోసాగాడు. అతడి అంగరక్షకులు అతడికి వెనకగా తమ ఏనుగును ఉరికించారు.

ఏనుగుతో దారి మార్గం లేని కొండ ఎక్కటం సాధ్యంకాదని తెలిసిన మహాకలి, ఆ కొండలో తాను ఏనుగుతో కూడా ప్రవేశించటానికి అనువైన గుహ కోసం వెతికి, అలాంటి దొకటి కనిపించగానే, ఆగి, వెనక వస్తున్న అంగరక్షకులతో, "శత్రువుల నుంచి మనం చాలా దూరం వచ్చేశాం. మనం దాగబోయే గుహ వాళ్ళు కనుక్కోలేరు. అదుగో, ఆ ఎదురుగా కనిపించే గుహలోకి నే వెళ్తాను. మీరు యీ దాపులనే ఏదైనా గుహలో దాగండి," అంటూ గుహలోకి ప్రవేశించాడు.

మహాకలి అంగరక్షకులు తమ నాయకుడు గుహ ప్రవేశించగానే, తామెక్కివున్న ఏనుగును అల్లంత దూరంలోవున్న మరొక గుహ దగ్గిరకు తీసుకుపోయి, శత్రువులెవరూ తమను వెన్నాడటంలేదని ధృవపరుచుకునేందుకు ఒకసారి వచ్చిన మార్గం కేసి పరీక్షగా చూసి, తరవాత ఏనుగును మెల్లగా గుహ కేసి నడిపారు. కాని, వాళ్ళు చాలా దురదృష్టవంతులు. ఏనుగును జాగ్రత్తగా వాళ్ళు గుహ ద్వారం దగ్గిరకు తీసుకుపోయి, లోన ప్రవేశించబోయేంతలో, గుహ పైభాగాన్నుంచి, రాతితో చేయబడిన పడవలంగ రొకటి గిరగిరా తిరుగుతూ వచ్చి, వాళ్ళ కంఠాలను బలంగా తాకింది. ఆ దెబ్బకు వాళ్ళిద్దరూ దిమ్మెరపోయి,



కుయ్యిం మనేందుకూడా శక్తిలేక, ఏనుగు మీది నుంచి దభీ మంటూ కింది రాళ్ళమీద పడిపోయారు. ఆ మరుక్షణం పై నుంచి వికటాట్టహాసం వినబడింది. మరి కొన్ని బండరాళ్ళు గుహ పై నుంచి గురిగా వాళ్ళ శిరస్సుల మీద పడినై. అంగరక్షకు లిద్దరూ తలలు పగిలి ప్రాణాలు వదిలారు.

ఆ మరుక్షణం, "రాహు కేతు వంశాలు నశించాలి!" అంటూ పొట్టి రాక్షసుడు, రాళ్ళ చాటు నుంచి లేచి నిలబడి, రాతి లంగరును గాలిలో గిరగిరా తిప్పసాగాడు. అతడి పక్కన, వాడి ఆటవికభార్య వెనక్కు తిరిగి చప్పట్లు చరిచి చేతులూపసాగింది. ఒకటి రెండు నిమిషాలు గడిచినై. కుంతల దేశ మంత్రి గంగాధరుడు కొద్ది పరివారంతో పొట్టి రాక్షసుడి దగ్గిరకు వచ్చాడు. రాక్షసు డాయనకు మహాకలి దాగి వున్న గుహ చూపించి, ఆ ప్రాంతాని కేసి పరుగున వస్తున్న మాంత్రికుడు కాలశంబరుణ్ణీ, అతడి అనుచరుల్నీ తొందరగా రావలసిందని హెచ్చరిస్తూ కేకలు ప్రారంభించాడు.

కొద్ది సేపటిలో మాంత్రికుడూ, శశి కాంతుడూ, కుంభీరుడూ గుహల దగ్గిరకు వచ్చారు. మంత్రి గంగాధరుడు కొండ దిగి వచ్చి, తన కుమారుణ్ణి కౌగలించుకుని, ఆనంద బాష్పాలు రాలుస్తూ, "శశీ! నువ్వు బతికే వున్నావని మొదటి నుంచి నాకు గట్టి నమ్మకం వున్నది. ఈ పొట్టి రాక్షసుడు మూడు నాలుగు నెలల క్రితం మన రాజ్యం వచ్చి, పాతాళదుర్గాన్ని గురించిన అన్ని రహస్యాలూ చెప్పేశాడు. నేను కొద్దిపాటి సేనతో బయలుదేరి వారం రోజుల క్రితమే యీ ప్రాంతాలు చేరాను. పాతాళదుర్గం సర్వనాశన మవటం కళ్ళారా చూశాను. శుభం. రాకుమారి కాంతిసేన ఎక్కడ?" అని అడిగాడు.

కాంతిసేనా, భామాసింగీ కొంచెం ఆలస్యంగా అక్కడికి వచ్చి చేరారు. మంత్రి



కాంతిసేన ఆ మాటలకు సిగ్గుపడి తల వంచుకున్నది. కాలశంబరుడు మంత్రి గంగాధరుడి ముందుకు వచ్చి, "మహా మంత్రీ! అంతా శుభప్రదంగానే ముగిసింది. ధూమకుడూ, సోమకుడూ చేసిన సహాయాన్ని మరిచిపోకండి. భద్రుడు ఎలానూ మీవాడే. పోతే, నేను కుంభీరుడికి చేసిన వాగ్దానం ఒకటున్నది. అతణ్ణి యీ ప్రాంతాలకు రాజును చేసి, నా దారిన నేను మహాకాళి నర్చించేందుకు కొండల్లోకి పోతాను," అని చెప్పి పొట్టిరాకీనుణ్ణి, "ఆ దుర్మార్గుడు మహాకలి దాగిన గుహ ఏది?" అని ప్రశ్నించాడు.

పొట్టిరాకీనుడు గుహ చూపించాడు. మాంత్రికుడు గుహ ముందుకు పోయి మంత్రదండాన్ని పైకెత్తి, "మహాకలీ, బయిటికిరా. నీ చావు సమీపించింది. నాతో ద్వంద్వ యుద్ధానికిరా. నా అనుచరులెవరూ నీ మీద ఆయుధం ఎత్తరు. నువ్వు నన్ను జయించావో, నీ యిష్టంవచ్చిన చోటుకు పోయేందుకు, నా వాళ్ళెవరూ అడ్డు తగలరు," అని కేక వేశాడు.

మరుక్షణం మహాకలి గద భుజాన పెట్టుకుని గుహ నుంచి బయిటికి వస్తూ, "అలా అయితే మనం ధర్మయుద్ధం చేద్దాం.

గంగాధరుడు రాకుమారికి, ఆమె తండ్రి ఉగ్రసేనుడి క్షేమవార్తలు చెప్పి, "ప్రస్తుతం కదంబరాజ్యానికి రాజు లేకపోయినా, నీవు ఆ రాజ్యం చేరిన మరుక్షణం నిన్ను రాణిగా అంగీకరించేందుకు ప్రజలు సిద్ధంగా వున్నారు. ఆ తరవాత నీవు వరించిన వ్యక్తి కదంబరాజవుతాడు," అని చెప్పాడు.

"ఇంకా వరించటమా? శశికాంతుడూ, రాకుమారీ ఏనాడో ఒకర్నొకరు ప్రేమించుకుని వివాహం ఆడేశారు. నేను ఆమెను దొంగిలించుకు వచ్చేప్పుడు చేసిన వాగ్దానం నెరవేర్చుకున్నాను. అవునా, రాజకుమారీ?" అని ప్రశ్నించాడు కుంభీరుడు.



ఏనుగును గుహలోనే వదిలి వచ్చాను. కాచుకో!" అంటూ మాంత్రికుడి మీదికి లంఘించాడు.

కాలశంబరుడు, అతడి దెబ్బను తన మంత్రదండంతో కాచుకుని, "పాపీ! ముందే చెపుతున్నాను. నువ్వెవరినైతే దొంగ దాటుగా మీదపడి తల నరికి చంపావో, ఆ నా తండ్రిగారిది, యీ మంత్రదండం. ఇది, నీ శరీరాన్ని తాకిందో, నీటి బుడగలాగా పేలిపోతావు. ఇక చూపించు, నీ గదావిద్యాప్రావీణ్యం," అంటూ ముందు కురికాడు.

మాంత్రికుడిలా అనే సరికి మహాకలి నిర్విణ్ణుడై, భయంతో వణికిపోతూ, మంత్రదండం దెబ్బలను గదతో కాచుకుంటూ, ఒక్కొక్క అడుగే వెనక్కు వేయసాగాడు. కాని, కాలశంబరుడు, మహాకలికి పారిపోయే అవకాశం యివ్వకుండా, మీదిమీదికి దూకుతూ, అతడు బాగా అలిసిపోయినట్టు కనబడగానే, "పాపీ, యిక చావు!" అంటూ ఎడం చేత్తో గదను పట్టుకు లాగి, మంత్రదండంతో అతడి గుండెల్లో పొడిచాడు. ఆ వెంటనే కళ్ళను మిరుమిట్లు కొల్పేలాంటి కాంతీ, చెవులు దిబ్బెళ్ళు పడేటంత ధ్వనీ ఒకేసారి పుట్టింది. మహాకలి శరీరం చిన్నాభిన్నమై అంత ఎత్తున గాలిలోకి లేచిపోయింది.

అందరూ కాలశంబరుడికి జయజయ ధ్వానాలు చేశారు. మాంత్రికుడు, మహాకలి గదను కుంభీరుడికిస్తూ, "కుంభీరా! నువ్వు దండకారణ్యానికి రాజువు. పాతాళదుర్గం యింకా ఏమైనా మిగిలి వుంటే దానికి అధిపతివి," అన్నాడు.

"మహామాంత్రికా, నేను నీకు అజన్మ కృతజ్ఞుణ్ణి. కొండ మీది సరోవరజలం కింది పాతాళదుర్గం మీదికి ప్రవహించకుండా ఆపవలసిందిగా ప్రార్థిస్తున్నాను," అన్నాడు కుంభీరుడు, మాంత్రికుడికి నమస్కరిస్తూ.

"ఆ పని యీ రాత్రే చేస్తాను. తిరిగి బందకాయిని యథాస్థానంలో పెడితే ప్రవాహం కట్టుబడి పోతుంది. భయ పడకు," అన్నాడు కాలకంబరుడు.

ఆ సాయంకాలం మంత్రి గంగాధరుడి పరివారం, కుంభీరుడి అనుచరులూ విందు వినోదాలతో హాయిగా గడిపేశారు. గంగాధరుడు రెండు రోజులపాటు మాంత్రికుడికీ, కుంభీరుడికీ అతిథిగా వుండి శశికాంతుడూ, కాంతిసేనా, పరివారం వెంటరాగా కుంతల దేశానికి బయలుదేరారు.

అందరూ ప్రయాణం అయి పోయేటప్పుడు కుంభీరుడు, విరూపుణ్ణి పక్కకు పిలిచి, "భామాసింగి జాగ్రత్త. అది మహకలి మీద మోహపడి ఆఖరు క్షణంలో పాతాళదుర్గం వదలనని మొండి కెత్తింది. నోరు మూసి బలవంతంగా భుజాన వేసుకుని బయటికి లాక్కొచ్చాను. దాన్ని భిల్ల నాయకుడు పులిందుడికి ఒప్పచెప్పక పోయావో, నీకూ అతడికీ బతికున్నన్నాళ్ళూ పోరు తప్పదు," అని సలహా యిచ్చాడు.

"అది వాడి పదో పడుచు పెళ్ళాం. కాళ్ళూ చేతులూ కట్టి మోసుకు పోయి అయినా సరే, అతగాడికి ఒప్పచెపుతాను. కాని...మహాకలి మీద ఇంత విజయమూ నాకు ఆనందం కలిగించటం లేదు. ఈ జరిగిపోయిన గలభాలో, నా నల్లగరుడుడు దారి తప్పి ఎటో ఎగిరిపోయాడు," అన్నాడు విరూపుడు విచారంగా.

"దాన్ని యీ కొండల్లో ఎక్కడున్నా వెతికి పట్టుకుని, నీకు పంపుతాను, సరేనా?" అంటూ కుంభీరుడు, విరూపుడి నడుం పట్టుకుని గిరగిరా తిప్పి కిందదించాడు.

"అహ్హా, కుంభీ! నువ్వు రాక్షసుడి వన్న మాటే మరిచాను, సుమా!" అంటూ విరూపుడు పెద్దగా నవ్వి, చాలాదూరం ముందుకు పోయిన తనవాళ్ళను కలుసుకునేందుకు పరిగెత్తాడు. —(అయిపోయింది)

